www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 223 | శనివారం 03-02-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

మండిపడ్డ మదుపరులు



రూ.5లక్షల కోట్ల పెట్టుబడి వాపస్...!

కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ దురాశ దేశీయ మార్కెట్ల కొంప ముంచింది. దీర్ఘకాల మూలధన లాభాలపై పన్ను విధించినందుకు మదుపర్లు తగినశాస్తి చేసి చూపించారు. గడచిన ఇరవై నాలుగు గంటల్లో 700 కోట్ల డాలర్లు (రూ.4.7లక్షల కోట్లు) పెట్టుబడిని మదుపర్లు పిండేసుకున్నారు. రెండు నెలలుగా లాభాల బాటలో ర్యాలీ తీసిన సెన్సెక్స్, నిఫ్టీ కుప్పకూలిపోయాయి. బీఎస్ఈలో రూ.153.1 లక్షల కోట్ల పెట్టుబడి సమకూరగా... గురు, శుక్రవారాల్లో మదుపర్ల ఒత్తిడితో బీఎస్ఈ పెట్టుబడి 148.4 లక్షల కోట్లకు పడిపోయింది. మొత్తం 2500లకు పైగా షేర్లు పడిపోగా కేవలం 300షేర్లు కాస్త నిలదొక్కుకున్నాయి.

7 లో



మాట్లాడుతున్న సురవరం. పక్కన అజీజ్‌పాషా, పల్లా వెంకటరెడ్డి

ఎన్నికల బడ్జెట్టే...

- రైతులకు, పేదలకు ఒరిగేదేమీ లేదు
- కార్పొరేట్లకు అనుకూలం
- ఏకకాలంలో ఎన్నికలకు వ్యతిరేకం
- రాజస్థాన్ ఓటమితో బీజేపీ పతనానికి కౌంట్‌డౌన్ షురూ
- లక్ష కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటుకు డిమాండు
- విలేకరుల సమావేశంలో సురవరం

విశాలాంధ్ర బ్యూరో–హైదరాబాద్ : పార్లమెంటులో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలు ఆమోదించే బడ్జెట్ కాదని, కార్పొరేట్ శక్తులకు మేలు చేసే బడ్జెట్ అని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి విమర్శించారు. మధ్యతరగతి, పేద వర్గాలకు బడ్జెట్‌లో ఎలాంటి రాయితీలు కల్పించలేదన్నారు. కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ పార్లమెంటు లోపల, బయట.. లౌకిక, ప్రజాస్వామిక, కార్మిక, ప్రజా సంఘాలతో లోతుగా చర్చించి కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. జైట్లీది మోసపూరితమైన బడ్జెట్ అని, సంపన్నులకు, పెట్టుబడిదారులకు అనుకూలమైనదని సురవరం అన్నారు. ముందస్తు ఎన్నికల కోసమే బడ్జెట్ పెట్టారని, పేదలకు, గ్రామీణులకు ఒరిగేది ఏమీలేదని స్పష్టం చేశారు. శుక్రవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో కేంద్ర కార్యవర్గ సభ్యుడు సయ్యద్ అజీజ్ పాషా, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డితో కలిసి సురవరం విలేకరులతో మాట్లాడారు. బలవంతంగా ఏకకాలంలో ఎన్నికలకు తాను వ్యతిరేకమని, ప్రజాస్వామ్య రాజ్యాంగ హక్కులను గౌరవించాలన్నారు. రాజస్థాన్ ఉపఎన్నికల్లో బీజేపీ ఓటమిని చవిచూసిందని, ఆ పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. రైతులకు, పేదలకు బడ్జెట్ అనుకూలంగా ఉంటుందని, గ్రామాలకు పెద్దపీట వేస్తుందని ఆశిస్తే తీరా బడ్జెట్ చూస్తే తుస్సుమన్నదని ఎద్దేవా చేశారు. రైతులకు, గ్రామీణ ప్రాంతాలకు విద్యా, వైద్య రంగాలకు కేటాయింపులు భారీగా పెంచినట్లు ప్రచారం చేసుకుంటున్నారని సురవరం అన్నారు. లక్ష కోట్ల రూపాయలను బ్యాంకుల నుంచి రైతులకు రుణాలు ఇప్పిస్తామని ప్రభుత్వం చెబుతోందని, దేశంలోని 18 కోట్ల మంది రైతులకు ఆ

- మిగతా 2 లో

ఇప్పుడేం చేద్దాం

బడ్జెట్‌లో తీరని అన్యాయం



- మోడీతో ప్రయోజనం నిల్
- చంద్రబాబు అంతర్మథనం

విశాలాంధ్ర–అమరావతి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు విభజన నాడు ఇచ్చిన హామీల ప్రకారం నిధులను కేటాయించకపోవడంతో ఇప్పుడేం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అంతర్మథనం చెందుతున్నారు. బీజేపీ కనీసం మిత్రధర్మం పాటించడం లేదని భావిస్తున్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని నరేంద్ర మోడీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని ప్రకటించి దానిని మరచిపోయారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఇరు పార్టీలు కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. అయినప్పటికీ హామీల అమలుకు కేంద్రం ఇంతవరకు సక్రమంగా నిధులు ఇవ్వలేదు. తాజా బడ్జెట్‌లోనైనా నిధులు కేటాయిస్తారని ప్రభుత్వమే కాదు, రాష్ట్ర ప్రజలూ ఎదురు చూసి తీవ్రంగా నిరాశ చెందారు. ఈ నేపథ్యంలో బీజేపీతో సంబంధాలపై తర్జనభర్జన పడుతున్నారని తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వంలో కొనసాగినందున ఏ ప్రయోజనమూ రాష్ట్రానికి కలగడం లేదు. హామీలే

- మిగతా 2 లో

ఆచితూచి అడుగు...

2 లో



త్వరలో రాజకీయ నిర్ణయం

- తొందరపడి ఎవరూ మాట్లాడొద్దు: సీఎం
- 12న 'అగ్రి' బాధితులకు నష్టపరిహారం చెల్లింపు
- గుంటూరులో మాతాశిశు ఆరోగ్య కేంద్రం
- పట్టణ హౌసింగ్ నిధుల కోసం బ్యాంకులకు ప్రభుత్వ హామీ
- ఏపీ కంటెంట్, డ్రోన్ కార్పొరేషన్ల ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం

- వివరాలు 11 లో

బీజేపీపై టీజీ ఫైర్

- పొగరు దించుతాం..
- మా అధినేతను అవమానిస్తున్నారు
- బాబును తక్కువగా అంచనా వేయొద్దు..
- బలహీన పడుతున్న విషయం గమనించండి

11 లో

ఏపీకి సాయం కోసం రాజ్యసభలో కేవీపీ మౌన నిరసన

9 లో

మరుగుదొడ్డిలో కుమ్ములాట

- ఢిల్లీలో విద్యార్థి హత్య

9 లో

హైదరాబాద్‌లో నరబలి

- మూడునెలల చిన్నారి శిరచ్ఛేధనం
- తల గుర్తింపు, దొరకని మొండెం
- చంద్ర గ్రహణ సమయంలో క్షుద్ర పూజలు

11 లో



మార్చి 12 నుంచి గ్రూప్-1 ఇంటర్వ్యూలు

- ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు
- అర్హులైన అభ్యర్థుల వివరాలు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో....

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్–1 ఇంటర్వ్యూలకు 151 మంది అభ్యర్థుల్ని ఎంపిక చేశారు.ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ నంబరు–36/2016లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖల్లో ఖాళీగా వున్న 78 పోస్టులకు రాత పరీక్షలను నిర్వహించిన విషయం విదితమే. మెయిన్స్ రాత పరీక్షలో కేటగిరీల వారీగా ప్రతిభ చూపిన 151 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఎంపిక చేశారు.మార్చి 12 నుంచి 23వరకూ ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ ఇంటర్వ్యూలు కొనసాగుతాయి.తొలిరోజు 16 మందికి, మిగిలిన పని దినాల్లో రోజుకు 15 మంది చొప్పున అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేస్తారు.ఇంటర్వ్యూలు ముగిసిన కొద్దిరోజుల్లో ఫలితాల్ని వెల్లడించే దిశగా కమిషన్ కార్యాలయం అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఇంటర్వ్యూలకు అర్హులైన అభ్యర్థుల వివరాల్ని ఏపీపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 151 మందికి వ్యక్తిగతంగా ఇంటర్వ్యూ లేఖలు పంపనున్నారు. గ్రూప్–1 మెయిన్స్, ఇంటర్వ్యూలలో

- మిగతా 2 లో



కొత్త నోట్లతో ఇక్కట్లు

- చెల్లుబాటు కాని రూ.10, రూ.50 నోట్లు
- ఇప్పటికీ చెలామణి కాని పది నాణెం
- తూతూ మంత్రంగా అధికారయంత్రాంగం చర్యలు



విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : మున్నెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రజలు కరెన్సీ కష్టాలు ఎదుర్కొంటున్నారు. పెద్దనోట్ల రద్దుతో ప్రారంభమైన ఇబ్బందులు, కొత్త నోట్ల ముద్రణతో మరింత ఎక్కువయ్యాయి. ఏడాదిన్నర కాలంగా వివిధ రూపాల్లో ఎదురవుతున్న కరెన్సీ ఇక్కట్లు ప్రజలకు చుక్కలు చూపెడుతున్నాయి. గతంలో నిరుద్యోగ సమస్య వల్ల, కూలి పనులు దొరక్క, చాలీచాలని వేతనాలతో జీవనం గడవక, లేదంటే ఆదాయానికి మించి ఖర్చులు ఎక్కువైతే అప్పులు చేసి ఆర్థిక ఇబ్బందులు పడేవారు. కాని ఇప్పుడు పరిస్థితి డబ్బులు పుష్కలంగా బ్యాంకులో వుండి కూడా తీసుకోలేక, చెలామణిలో వున్న కొత్త నోట్లు మార్కెట్లో చెల్లుబాటు కాక నానా ఇబ్బందులు పడే విచిత్ర పరిస్థితి నెలకొంది. నల్లధనం వెలికితీత, అవినీతి నిర్మూలన, టెర్రరిజం అణచివేత కారణాలు చెప్పి 2016 నవంబరు 8వ తేదీ అర్ధరాత్రి ప్రధాని నరేంద్ర మోడీ రూ.500, రూ.1000 నోట్లను రద్దు చేసిన విషయం తెల్సిందే. అప్పటినుండి ఇప్పటివరకు ప్రజలకు కరెన్సీ కష్టాలు తీరలేదు. దాదాపు నాలుగైదు నెలలపాటు డబ్బుల కోసం ఏటీఎంలు, బ్యాంకుల ముందు పడిగాపులు కాసి అష్టకష్టాలు అనుభవించారు. అనేకమంది మృత్యువాత కూడా పడ్డారు. పెద్దనోట్ల రద్దుకు ప్రభుత్వం ఏ కారణాలైతే చెప్పిందో, అవేమీ నెరవేరలేదు గానీ సామాన్యులు మాత్రం నరకం చవిచూశారు. ఇప్పటికీ కరెన్సీ కొరత కొనసాగుతూనే వుంది. ఖాతాదారులు ఇబ్బంది పడుతూనే వున్నారు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే మరోవైపు రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తగా అమల్లోకి తెచ్చిన

- మిగతా 2 లో

ఇదీ లోకం!



మాటల గారడీ బడ్జెట్

ఏపీకి అన్యాయంపై నిరసన | పలుచోట్ల సీపీఐ, ఏఐటీయూసీ ఆందోళన

విశాలాంధ్ర నెట్‌వర్క్ : పార్లమెంట్‌లో గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన 2018–19 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలపై విమర్శలపరంపర కొనసాగుతోంది. అన్ని వర్గాల ప్రజలు ఈ బడ్జెట్ ప్రతిపాదనలపై తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు.

అనంతపురం సప్తగిరి సర్కిల్ కూడలిలో ఏఐటీయూసీ కార్యకర్తలు కళ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేస్తూ బైఠాయించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. ఓబులేసు ఈ సందర్భంగా మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంకెల గారడీతో కూడిన బడ్జెట్‌గా పేర్కొన్నారు. ఇది పూర్తిగా కార్మిక,

- మిగతా 11 లో



అనంతలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న ఓబులేసు తదితర సీపీఐ నేతలు



ఫిన్‌లాండ్ అధ్యక్షుడిగా నినిస్టో

హెల్సింకి : ఫిన్‌లాండ్ అధ్యక్షుడిగా సౌలీనినిస్టో పదవీ బాధ్యతలను స్వీకరించారు. పార్లమెంటు సభ్యుల ఎదుట ఆయన తన పదవిని స్వీకరించారు. రెండవసారి ఆయన అధ్యక్షుడిగా పనిచేయనున్నారు. ఫిన్‌లాండ్‌లో అధ్యక్షుడి పదవీకాలం ఆరేళ్లు ఉంటుంది. బాధ్యతలు తీసుకున్న తరువాత నినిస్టో మాట్లాడుతూ గత దశాబ్దికాలంలో అనేక అంతర్జాతీయ సంక్షోభాలు ఎదురయ్యాయని వాటిలో కొన్ని మాత్రమే పరిష్కారమయ్యాయని విచారం వ్యక్తం చేశారు. నేడు శాంతికంటే భౌగోళిక రాజకీయ ప్రయోజనాలు ఎక్కువయిపోయి శాంతిని నెలకొల్పే కృషి తగ్గిపోతున్నదని దీనిని పెంపొందించుకోవలసిన అవసరం ఉన్నదని ఆయన అన్నారు. ఈ దశలో ఐక్యరాజ్యసమితి, యూరోపియన్ యూనియన్లు మరింత శ్రద్ధ వహించి కీలకపాత్ర నిర్వహించి పరిస్థితిని మెరుగుపరచాలని ఆయన కోరారు. ఐరాస ప్రజావేదికగా తన స్థితిని ఉన్నతీకరించుకోవాలని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన కృషిలో ఫిన్లాండ్ క్రియాశీలక పాత్ర నిర్వహిస్తుందని అధ్యక్షుడు తెలిపారు. తాము కేవలం పరిశీలకులుగా ఉండబోమని అన్నారు. పశ్చిమదేశాలు అంటే అమెరికా, నాటో దేశాలే కాదు.. యూరోపియన్ యూనియన్ కూడా ఉంది. అలాగే తూర్పు దేశాలు అంటే రష్యా మాత్రమే కాదు.. చైనా కూడా ఉంది అని నినిస్టో అన్నారు. దేశభద్రత ప్రథమ ప్రాధాన్యతగా ఉంటుందని ఆయన చెప్పారు. అయితే ఈ భద్రత కేవలం ఆయుధాల ఆధారమైందికాదు.. దేశ సమైక్యత, దేనికైనా సిద్ధంగావుండే సాహసం అవసరమని అన్నారు.

సమాధులలో సగం కాలిన శవాలు

మయన్మార్ సైన్యం ఘాతుకాలకు నిదర్శనం

ఢాకా : మయన్మార్ రఖిన్ రాష్ట్రంలో రొహింగ్యాలు నివసించే ప్రాంతాలలో తాజాగా 5 నూతన సమాధులు బయటపడ్డాయి. వీటిలో యాసిడ్‌తో సగం కాలిపోయిన శవాలు బయటపడ్డాయి. అలాగే బుల్లెట్ గాయాలకు చనిపోయి పూర్తిగా కుళ్లిపోకుండావున్న శవాలు కూడా కనిపించాయి. ఈ సమాధులవద్దకు చేరిన వారిలో నూర్‌ఖదీర్ అనే వ్యక్తి తన స్నేహితుల శవాలను గుర్తించాడు. ఖదీర్ మరో 14 మంది రొహింగ్యా ముస్లింలు ఫుడ్‌బాల్ లాంటి ఆట ఆడుకుంటూవుండగా మయన్మార్ సైన్యం తుపాకులు పేల్చింది. ఈ కాల్పులనుంచి ఖదీర్ మరికొంతమంది తప్పించుకున్నారు. ఆనాటి కాల్పులకు గురైనవారిలో 6గురు స్నేహితులు రెండు సమాధులలో శవాలై కనిపించారని ఖదీర్ చెప్పాడు. సామూహికంగా ఖననం చేసిన 5 సమాధులు ఉన్నాయని గతంలో ఈ సమాధుల విషయం బయటపడలేదని అసోసియేటెడ్ ప్రెస్ విలేకర్లు పలువురిని ఇంటర్వ్యూచేసి ధృవీకరించారు. యాసిడ్ దాడులు, తుపాకి కాల్పులకు బలవకుండా తప్పించుకుని బంగ్లాదేశ్ చేరుకున్న దాదాపు రెండు డజన్లమందిని ఈ విలేకరులు ఇంటర్వ్యూ చేశారు. వారి వద్ద సెల్‌ఫోన్ వీడియోలు కూడా కాల్పులకు సంబంధించినవి ఉన్నాయి. కాల్పులు జరగలేదని మయన్మార్ ప్రభుత్వం అనేకమార్లు వాదించింది. ఇన్‌డిన్ గ్రామంలో మాత్రం సామూహిక సమాధిలో 10 మంది టెర్రరిస్టులు శవాలు కూడా ఉన్నట్లుగా అసోసియేటెడ్ ప్రెస్ తెలిపింది. మయన్మార్ సైన్యం సామూహిక హత్యాకాండకు పాల్పడిందని చెప్పేందుకు ఈ భారీ సమాధులే నిదర్శనమని భావిస్తున్నారు. ఆయా గ్రామాలు ఖాళీగావున్న చిత్రాలను శాటిలైట్ ద్వారా తీయగా అసోసియేటెడ్ ప్రెస్ వాటిని సేకరించింది. ఒక గ్రామంలో 75 మందిని చంపివేసినట్టుగా ఆ గ్రామస్తులు తెలియజేశారు. అయితే సమీపంలో ఉన్న సమాధులను పరిశీలించిన తరువాత దాదాపు 400 మంది ఆ గ్రామానికి చెందినవారు చనిపోయి ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. విలేకరులు అనేక గ్రామాలలో తిరిగి ఇంటర్వ్యూ చేశారు. గత ఏడాది ఆగస్టు 27వ తేదీన సైన్యం ఒక పథకం ప్రకారమే కాల్పులు జరిపారని దీంతో భీతిల్లిపోయిన వేలాదిమంది గ్రామస్తులు అడవులకు పారిపోయిన దాక్కున్నారని పలువురు గ్రామాస్తులు వివరించారు.

చైనా, బ్రిటన్ మధ్య మెరుగైన సంబంధాలు

ఇరుదేశాల నేతలు జిన్‌పింగ్, థెరిసా భేటీ



బీజింగ్ : రెండు దేశాల మధ్య సంబంధాలను మరింతగా మెరుగుపరుచుకోవాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, బ్రిటన్ ప్రధానమంత్రి థెరిసామే నిర్ణయించారు. వారిరువురు ఇక్కడ దియాఒయుటాయ్ గెస్ట్‌హౌస్‌లో సమావేశమై శాంతి, అభివృద్ధి ఇచ్చిపుచ్చుకునే సహకారం తదితర అంశాలపైన చర్చలు జరిపారు. బహుళ ప్రపంచం అభివృద్ధిపైన వారు కేంద్రీకరించారు. అలాగే ఆర్థిక ప్రపంచీకరణ, సాంస్కృతిక వైవిధ్యం, ఐటి అప్లికేషన్స్ తదితర అంశాలు కూడా చర్చలలో చోటుచేసుకున్నాయి. నేటికాలానికి అనుగుణంగా తమతమ దేశాల ప్రజల అవసరాలను, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించుకోవాలని భావించారు. స్వర్ణయుగం సంబంధాలను నెలకొల్పుకోవాలని జిన్‌పింగ్ అన్నారు. 2015 అక్టోబర్‌లో ఇరువురునేతలు సమావేశమై జరిపిన చర్చలను గుర్తు చేసుకున్నారు. నూతన శకంలో ఆరోగ్యకరమైన, క్రమబద్ధమైన ద్వైపాక్షిక సంబంధాలను బ్రిటన్‌తో పెంపొందించుకునేందుకు చైనా ఆసక్తి చూపిస్తున్నదని జిన్‌పింగ్ తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు 4 ప్రతిపాదనలు చేశారు. వ్యూహాత్మక, సమ్మిళిత మార్గంలో భవిష్యత్తు ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి ప్రణాళికను రచించుకోవాలి. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలను ఏర్పరచుకోవాలి. అలాగే చట్టసభల సభ్యుల మధ్య పరస్పర సంబంధాలు నెలకొల్పుకోవాలి. రాజకీయ పార్టీలు, సైన్యం మధ్య కూడా ఈ సంబంధాలను కలిగివుండాలి. పరస్పర అవగాహనను పెంపొందించుకోవాలి. ఒకరి ప్రయోజనాలను ఒకరు గౌరవించాలి. ప్రధానమైన ఆందోళన కలిగించే అంశాలపట్ల సానుకూలంగా చర్చించుకోవాలి. సున్నితమైన అంశాలపై నిర్మాణాత్మకంగా పనిచేయాలి. ఆర్థిక, వాణిజ్య సహకారానికి రెండు దేశాలు కలిసి పనిచేయాలి. ఆర్థిక ప్రపంచీకరణకు, సరళీకరణకు తాము తోడ్పాటు అందిస్తామని జిన్‌పింగ్ అన్నారు. బెల్ట్ & రోడ్ ఇన్సియేటివ్ ప్రాజెక్టు, రవాణారంగం తదితర రంగాలలోను సహకరించుకోవాలి.

ఫోర్డు కార్మికుల సమ్మె



బెర్లిన్ : ఫోర్డు కార్ల తయారీ కంపెనీలో పనిచేసే కార్మికులు శుక్రవారం సమ్మెను ప్రారంభించారు. జర్మనీలో ఫోర్డు కార్లకంపెనీతోపాటు ఇతర ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులు కూడా 24 గంటల సమ్మెను ప్రారంభించారు. వేతనాలు పెంచాలని సమ్మె చేస్తున్నారు. సమ్మెలో ఫోర్డు కంపెనీకి చెందిన 13వేల మంది పాల్గొన్నట్టు డిపిఎ వార్తాసంస్థ తెలిపింది.ఓక్స్ వ్యాగన్‌ర బోస్చ్, మేహల్ ఆటో విడిభాగాలు తయారుచేసే కంపెనీల కార్మికులు కూడా పాల్గొన్నారు. గురువాతం రాత్రి షిఫ్టునుంచే సమ్మె ప్రారంభమయ్యింది.బిఎండబ్ల్యు, అడి, డిఏంలర్, పోర్చ్ తదితర కంపెనీల కార్మికులు కూడా సమ్మె చేయనున్నారు. 6 శాతం వేతనాలను పెంచాలని కార్మిక యూనియన్ డిమాండ్ చేస్తున్నది. దాదాపు 39 లక్షలమంది కార్మికులకు వేతనాలు పెంచవలసివుంటుంది. అలాగే వారంలో పని గంటలను 28కి తగ్గించాలని కూడా కోరుతున్నారు. తమ డిమాండ్లపై హామీ ఇస్తేనే తిరిగి పనుల్లో చేరతామని కార్మికులు తెలిపారు.

హిజాబ్ ధారణపై ఇరాన్‌లో నిరసన

టెహ్రాన్ : ముస్లిం మహిళలు తలపైన హిజాబ్‌ను తప్పనిసరిగా ధరించాలన్న చట్టాన్ని వ్యతిరేకిస్తూ ఇరాన్ రాజధాని టెహరాన్‌లో మహిళలు నిరసన ప్రదర్శన జరిపారు. ఈ సందర్భంగా 29మంది మహిళలను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా మహిళలు నిరసన ప్రదర్శనలు జరిపారు. కొన్నిచోట్ల టెలికాం స్తంభాలను ఎక్కి తమతలపైనగల హిజాబ్‌లను తొలగించి కర్రలకు కట్టి వేలాడదీశారు. దాదాపు 4 దశాబ్దాలకాలంగా హిజాబ్‌ను ధరించాలన్న చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తిరస్కరిస్తున్నది. అయితే తాజాగా యువతులు, మహిళలు జరుపుతున్న ప్రదర్శనలు దేశవ్యాప్తంగా ప్రజలను ఆలోచింపజేస్తున్నాయి. వ్యక్తిగత స్వేచ్ఛపైన విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. మహిళా ప్రదర్శనలను సంస్కరణవాద వార్తాపత్రిక షర్గా ప్రచురించింది. అయితే వార్తలను నేరుగా ప్రచురించేందుకు ప్రభుత్వం ఆంక్షలు విధిస్తుంది. అందువల్ల ఇలాంటి అంశాలపైన న్యాయాధికారులు చేసే వ్యాఖ్యలను మాత్రం ప్రచురించేందుకు అవకాశం కలుగుతుంది. పార్లమెంటు సభ్యురాలు సోహియిలజోలోడర్జిడే మాట్లాడుతూ దీర్ఘకాల ఆంక్షలమూలంగానే నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయని అన్నారు. మహిళలపట్ల పొరపాటు ధోరణిని ప్రదర్శించడంవల్లనే చట్టాన్ని రద్దుచేయాలని కోరుతున్నట్టు ఇర్నా వార్తాసంస్థ తెలిపింది. మహిళలపై ఆంక్షలు విధించి అనవసరంగా వారిని ఇబ్బందులపాలు చేస్తున్నారు. అందువల్లనే యువతులు వీధుల్లోకి వచ్చి ప్రదర్శనలు జరిపి తలపైనవున్న ముసుగులను తీసివేస్తున్నారని ఆ సంస్థ తెలిపింది. ఈ ప్రదర్శనలపైన ఇరాన్ ప్రాసిక్యూటర్ జనరల్ మొహమ్మద్ జఫర్ మాట్లాడుతూ ఇవన్నీ పిల్లచేష్టలని భావోద్వేగాలతో చేస్తున్న పనులని అభివర్ణించారు.



కాస్ట్రో కుమారుడి మృతి



మియామి : క్యూబా విప్లవనేత ఫిడెల్‌కాస్ట్రో పెద్ద కుమారుడు డియజ్‌బలార్ట్ ఆత్మహత్య చేసుకుని మృతిచెంది నట్టుగా క్యూబా అధికార మీడియా తెలియజేసింది. ఆయనను ఫిడెలిటొ అని పిలిచేవారు. ఆయన వయస్సు 68 సంవత్సరాలు. రష్యాలో చదివిన ఆయన శాస్త్రవేత్తగా ఎదిగారు. తండ్రితో అంతగా ఆయనకు సంబంధాలు ఉండేవికావని మీడియా తెలిపింది. కాస్ట్రో మొదటి భార్య కుమారుడు ఫిడెలిటొ. ఆయన తీవ్ర వ్యాకులతకు లోనై ఆత్మహత్య చేసుకున్నట్టుగా మీడియా పేర్కొన్నది.

జనజాతర

పోటెత్తిన భక్తులు : జనసందోహమైన మేడారం

వనదేవతలకు నిలువెత్తు బంగారం సమర్పించిన కేసీఆర్

మొక్కులు తీర్చుకున్న వెంకయ్య నాయుడు



విశాలాంధ్ర- మేడారం : గిరిజనుల పండుగ సమ్మక్క -సారలమ్మల జాతరకు భక్తులు పోటెత్తుతున్నారు. వనదేవతలు గద్దెపైకి చేరడంతో ప్రజలు దర్శనకాల కోసం భారీఎత్తున తరలివస్తున్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరకు వీఐపీలు, వీవీఐపీలు సైతం క్యూకడుతున్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి కేసీఆర్ కుటుంబసమేతంగా సమ్మక. సారలమ్మను దర్శించుకొని తులాభారం ద్వారా నిలువెత్తు బంగారం, పట్టువస్త్రాలు సమర్పించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పూజారులు కేసీఆర్‌కు ఘనస్వాగతం పలికారు. సీఎం సతీమణి శోభ, మనవడు హిమాన్షు, డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, స్పీకర్ మధుసూదనాచారి, మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు దేవతలను దర్శించుకున్నారు. అనంతరం కేసీఆర్ విలేకరులతో మాట్లాడుతూ సాగునీటి ప్రాజెక్టులకు ఆటంకాలు కలగరాదని, అవి త్వరగా పూర్తికావాలని వనదేవతలను వేడుకొన్నానని తెలిపారు. మేడారం జాతరలో సదుపాయాల కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని తెలిపారు. మేడారంలో 200 ఎకరాల స్థలంలో శాశ్వత ఏర్పాట్లు చేయాల్సిన అవసరముందని, ఇందుకోసం 15 రోజుల్లో భూసేకరణపై మళ్లీ చర్చిస్తామని కేసీఆర్ తెలిపారు. జాతరను ఇంకా పటిష్టవంతం చేస్తామన్నారు. మేడారం జాతరను జాతీయపండుగగా గుర్తించాలని ప్రధానిని కోరతానని చెప్పారు. భవిష్యత్‌లో జాతరను చూసి అబ్బురపడేలా ఏర్పాట్లు చేస్తామని సీఎం వెల్లడించారు.

ఇది ఆదివాసీ కుంభమేళ : ఉపరాష్ట్రపతి

ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శుక్రవారం ఉదయం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం విమానాశ్రయానికి చేరుకొన్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో మేడారం వెళ్లి సమ్మక్క సారలమ్మ జాతరను సందర్శించారు. నిలవెత్తు బంగారాన్ని(బెల్లం)తులాభారం ద్వారా వన దేవతలకు సమర్పించి, మొక్కులు చెల్లించారు. ఆయనకు పూజారులు, రాష్ట్ర మంత్రులు,జిల్లా యంత్రాంగం ఘనస్వాగతం పలికారు. గిరిజనులు తయారు చేసిన ప్రత్యేక బుట్టలో పట్టు వస్త్రాలను అమ్మవార్లకు సమర్పించిన వెంకయ్య అనంతరం పసుపు,కుంకుమలతో గద్దె వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, సమ్మక్క సారలమ్మ జాతరను ఆదివాసీ కుంభమేళాగా అభివర్ణించారు. వనదేవతలను దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మేడారం జాతరపై యావత్తు దేశం దృష్టిపెట్టాలని ఆకాంక్షించారు. రాష్ట్రప్రభుత్వం ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తంచేశారు. గతంలో సామాన్యుడిగా జాతరకు వచ్చినట్లు గుర్తుచేసుకున్నారు. మేడారం జాతర ఆధ్యాత్మిక సంపదకు గుర్తుగా మిగులుతుందని, వనదేవతల ఆరాధనతో జీవితాలు సుఖ:మయం కావాలని వెంకయ్య ఆశించారు.

కొత్త నోట్లతో ఇక్కట్లు

(మొదటిపేజీ తరువాయి)

రూ.10, రూ.50, రూ.200 నోట్లను మార్కెట్లో చెలామణి చేయడం ఇబ్బందిగా మారింది. రూ.200 నోటు కొంత ఫర్వా లేదు గాని, రూ.10, రూ.50 నోట్ల చెలామణి అంత తేలిగ్గా జరగడం లేదు. సహజంగా ఈ రెండు నోట్లు చిన్నపాటి వ్యాపారుల వద్ద పెద్దమొత్తంలో చెలామణిలో వుంటాయి. జామకాయలు, రేగి పండ్లు, కమలాలు, అరటిపండ్లు విక్రయించే చిన్నపాటి వ్యాపారులు, టీ కొట్లు, సర్వీసు ఆటోలు, సిటీ బస్సుల్లోనూ ఎక్కువగా వినియోగంలో వుంటాయి. వీరంతా ఆ కొత్త నోట్ల డిజైన్ చూసి తీసుకోవడానికి భయపడుతున్నారు. గతంలో కొన్ని రకాల చాక్లెట్లు బిజినెస్ పెంపు కోసం ఇటువంటి రంగు కాగితాల రూపంలో రూ.10 నుండి రూ.1000 వరకు నోట్లను ముద్రించి అమ్మేవారు. వీటికి పిల్లలు నుండి పెద్దల వరకు ఆకర్షితులై కొనుగోలు చేసేవారు. పిల్లలు ఆ నోట్లతో రకరకాల గేమ్సును పందాలు కాసుకుంటూ సరదాగా ఆడుకునేవారు. ప్రస్తుతం రిజర్వుబ్యాంక్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ముద్రించిన కొత్త నోట్లు కూడా అలాగే వున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే కొత్త నోట్ల డిజైన్లు వాటికంటే అధ్వాన్నంగా వున్నాయని, దీంతో అవి దొంగనోట్లో, ఒరిజినల్ నోటులో అర్థంగాక తీసుకోవడానికి వెనుకాడుతున్నామని వ్యాపారులు చెబుతున్నారు. ఒకవేళ మేం తీసుకున్నా, మా దగ్గర ఎవరూ తీసుకోవడం లేదంటున్నారు. ఇదే పరిస్థితి మార్కెట్లో అంతటా కనపడుతోంది. ఎవరికివారే ఇలాగే భావిస్తుండడంతో రూ.10, రూ.50 నోట్ల చెలామణి ప్రశ్నార్థకంగా మారింది. ఆర్టీసీ సిటీ బస్సుల్లో సైతం కొందరు కండక్టర్లు ఈ నోట్లు తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. గతంలో రూ.10 నాణెం చెలామణి కూడా ఇలాగే నిల్చిపోయింది. దీనిపై ఆర్బీఐ గవర్నర్ దగ్గర నుండి జిల్లా కలెక్టర్ వరకు పదే పదే ప్రకటనలు చేసినా చెల్లుబాటులో ఏమాత్రం మార్పు రాకపోవడం గమనార్హం. విచిత్రమేమిటంటే పది నాణెం చెల్లుబాటు అవుతుందని అందరికీ తెల్సి కూడా ఎవరూ తీసుకోవడం లేదు. వ్యాపారులు బ్యాంకుల్లో వాటిని పెద్దమొత్తంగా ఒకేసారి చెలామణి చేసుకునే అవకాశం వున్నప్పటికీ, వారు బ్యాంకుల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయలేక అసలు తీసుకోవడమే మేలనే భావనకు వచ్చారు. దీంతో పది నాణెం చెలామణి పూర్తిగా నిల్చిపోయింది. ఇప్పుడు తాజాగా చిన్న నోట్ల చెలామణి సైతం ప్రశ్నార్థకంగా మారింది. పది నాణెం పరిస్థితి వీటికి కూడా తలెత్తకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రూప్-1 ఇంటర్వ్యూలు

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులు సాధించిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక ప్రక్రియ కొనసాగుతుంది.అభ్యర్థుల్ని ఇంటర్వ్యూలు చేసేందుకుగాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేడర్‌కు చెందిన ఏఐఎస్, ఐపీఎస్ అధికారులను ఏపీపీఎస్సీ కమిషన్ నియమించింది.

ట్రాన్స్‌కోలో 382 పోస్టుల భర్తీకి అనుమతి

ఏపీ ట్రాన్స్‌కోలో వివిధ కేటగిరీలకు చెందిన 382 పోస్టుల భర్తీకి అనుమతిస్తూ ఆర్థికశాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.ఎలక్ట్రికల్ సూపరింటెండెంట్-1, ఎలక్ట్రికల్ డివిజనల్ ఇంజనీర్-19, ఎలక్ట్రికల్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్-163, అసిస్టెంట్ ఇంజనీర్-171, సివిల్ సూపరింటెండెంట్-1, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-10, సివిల్ డివిజనల్ ఇంజనీర్-11, డిప్యూటీ సీసీఏ-1, ఎస్ఏఓ-5పోస్టులున్నాయి.

ఎన్నికల బడ్జెట్టే...

(మొదటిపేజీ తరువాయి)

నిధులు ఎంతమాత్రం సరిపోవన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు దేశంలోని రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర ఇవ్వలేదన్నారు. పేదలకు వైద్యం కల్పిస్తారన్నది ప్రచారమే తప్ప అందులో వాస్తవికత లేదని, మౌలిక సదుపాయాలు లేకుండా వైద్య రంగానికి కేటాయించిన నిధులను మెడికల్ కళాశాల ఏర్పాటులో వినియోగిస్తున్నారని చెప్పారు. పేదలను విస్మరించిన కేంద్రం పెద్దలకు మాత్రం 30 నుంచి 25 శాతానికి పన్నులు తగ్గించిందన్నారు. విచ్చలవిడిగా కార్పొరేట్ శక్తులకు కేంద్ర ప్రభుత్వం దోచిపెడుతుందని విమర్శించారు. 54 శాతం పన్నుల ద్వారా ఆదాయం వస్తుందంటే ప్రజలపై పన్నుల భారం ఎంతపడుతుందో అర్థమవుతోందన్నారు. దేశీయ పరిశ్రమలు నష్టపోయేలా చర్యలు చేపట్టిందన్నారు. అందరికీ సార్వత్రిక వైద్యం అందించాలని, బీమా సంస్థలకు లాభం చేకూర్చే చర్యలు చేపట్టిందన్నారు. లక్ష కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని సురవరం డిమాండు చేశారు. వ్యక్తిగత ఆదాయపన్నులో మార్పు లేనప్పటికీ సర్‌చార్జీల భారం మోపిందని, పెట్రోల్, డీజిల్‌పై 2 శాతం కస్టమ్ సుంకాన్ని తగ్గించి... ఎంతో తగ్గించినట్లుగా గొప్పలు చెప్పుకుంటోందని కేంద్రాన్ని దుయ్యబట్టారు. విద్యార్థులకు, యువతకు, మహిళలకు జైట్లీ బడ్జెట్ ఏ విధంగానూ మేలు చేయదన్నారు. పంచాయతీ నుంచి పార్లమెంటు వరకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం అంటే ఒక వ్యక్తి ప్రచారం కోసమేనని, ఇది ఫెడరల్ వ్యవస్థకు విరుద్ధమని, ఒకేసారి ఎన్నికలకు తాము వ్యతిరేకమని సురవరం స్పష్టంచేశారు. అజీజ్ పాషా మాట్లాడుతూ కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుగా జైట్లీ బడ్జెట్ ఉందని, బంగ్లాదేశ్, పాకిస్థాన్ వంటి దేశాల్లో పెట్రోల్ ధర అతితక్కువగా ఉంటే దేశంలో మాత్రం భారీగా వసూలు చేస్తున్నారని అన్నారు. రైతులను, వ్యవసాయ రంగాన్ని బడ్జెట్‌లో విస్మరించారన్నారు.

ఇప్పుడేం చేద్దాం..

(మొదటిపేజీ తరువాయి)

మిగులుతున్నాయి. నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి మింగుడు పడటం లేదు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికి ఎలాంటి మేలు జరగట్లేదన్న అభిప్రాయంలో చంద్రబాబు, పార్టీ ఇతర నేతలు ఉన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని చంద్రబాబుతో సహా ఆ పార్టీ నేతలందరూ ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఎంపీ పదవులకు రాజీనామా చేద్దామని కొందరు, బీజేపీకి దూరంగా ఉందామని మరికొందరు, కేంద్రంలో మంత్రి పదవులను వదులుకోవాలని మరికొందరు. నిరసనలు చేద్దామని ఇంకొందరు ఇలా భిన్నాభిప్రాయాలను ఆ పార్టీ నేతలు బహిరంగంగానే వ్యక్తపరిచారు.

అయినప్పటికీ మోడీ ఏమీ జరగనట్టు వ్యవహరించటం, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా ఏపీకి అడిగినవన్నీ ఇస్తున్నాం అని తన పార్టీ నేతలతో చెప్పటం లాంటివి చూసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దీర్ఘాలోచనలో పడ్డారు. గత మూడేళ్లుగా మోడీ, అమిత్‌షాలు తమకు వ్యతిరేకంగా వున్న వారిని అనేక ఇక్కట్ల పాలు చేస్తున్న వైనం కనిపిస్తూనే ఉంది.

తమిళనాడులో జరిగిన అనూహ్య రాజకీయ పరిణామాలు, శశికళ జైలు, ఈపీఎస్, ఓపీఎస్‌లు ఒకటై బీజేపీకి వంత పాడటం, 2జీ స్పెక్ట్రంలో కనిమొళి, రాజాలు బయటపడటం, బీహార్‌లో నితిష్‌కుమార్‌తో చెలిమి, లాలూ ప్రసాద్ జైలుకు పోవటం, ఉత్తర ప్రదేశ్, గుజరాత్‌లో విజయం కోసం పన్నిన వ్యూహాలు, ఢిల్లీ పాలకుడు కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతున్న తీరు తెలుస్తూనే ఉంది. మిత్రపక్షంగా ఉన్నప్పటికీ కేంద్రం సహకారం అందించకపోయినా విడిపోతే రాష్ట్రానికి వస్తున్న అరకొర నిధులు కూడా రావని, దీంతో అసలుకే ఎసరు వస్తుందన్న ఆందోళనలో కొందరు ఆలోచిస్తున్నట్లు సమాచారం. రాష్ట్రంలో జాతీయ ప్రాజెక్ట్ పోలవరంలో కొన్ని పనులు పూర్తి చేసి 2018 చివరకు గ్రావిటీ ద్వారా కాల్వలకు నీరు అందిస్తామని చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటివరకు ప్రజలకు చెపుతూ వచ్చింది. కేంద్రం నిధులు ఇచ్చినా, ఇవ్వకున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన నిధులతో పనులు జరిపించింది. వాటికి సంబంధించి మూడు వేల కోట్లు కేంద్రం నుంచి రావాల్సి ఉంది.

సింగపూర్, జపాన్‌ల తరహాలో రాజధాని అమరావతి, ఐకానిక్ టవర్స్ నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. రాజధానిలో తాత్కాలిక సచివాలయం, అసెంబ్లీ నిర్మించి, రోడ్లు, ఐఏఎస్, ఐపీఎస్‌ల, ఎన్‌జీవోల క్వార్టర్ల నిర్మాణాలను ప్రారంభించారు. పలు సంస్థలు రాజధానిలో ఏర్పాటు అవుతున్నాయి. ఈ దశలో కేంద్రంతో విడిపోతే ఎలాంటి సమస్యలు తలెత్తుతాయోనని టీడీపీ సీనియర్లలో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలా అని మిత్రక్షంగా కొనసాగితే మిత్రధర్మాన్ని పాటించకపోగా లెక్కలేని తనంగా కేంద్ర పాలకులు వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆవేదన చెందుతున్నారు. చంద్రబాబును కేంద్రంలోని నాయకులు తక్కువ అంచనా వేస్తున్నారని, సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకొని బీజేపీ నేతల వ్యూహాలకు ఆయన చెక్ పెడతారని ఆ పార్టీ ఎంపీ టీజీ వెంకటేశ్ వ్యాఖ్యానించారు.

ఇదిలా ఉంటే కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని ప్రతిపక్షం వైసీపీ గళం విప్పకుండా, ప్రతిపక్ష పాత్రను కూడా టీడీపీ పోషించిందన్న సంకేతాలు ప్రజల్లోకి వెళ్లేలా చంద్రబాబు కేంద్రంపై వ్యతిరేక గళం వినిపించారని ఇది రాజకీయ వ్యూహమని ఆ పార్టీకి చెందిన నేతలు కొందరు చెప్పుకొస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ బీజేపీతో చెలిమి చేయటం తమకు ఇబ్బందులు తెచ్చిపెట్టిందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. అయితే బీజేపీ పెద్దలు వ్యవహరిస్తున్న తీరుపై ఆ పార్టీ నేతలందరూ మండిపడుతున్నారు. కానీ బీజేపీని ఇప్పుడు వదిలించుకోవాలా మరికొంతకాలం వేచి చూడాలా అనే అంశంపై నిర్ణయం అధినేత చంద్రబా బుదే. చంద్రబాబు కూడా బీజేపీ వైఖరిపై అసహనంతో ఉన్నా రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతినకుండా వ్యవహరించాలన్న అభిప్రాయంతో సంయమనం పాటిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు చెప్పుకొస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టీడీపీ, బీజేపీ మిత్రబంధం ఇంకెంతకాలం సాగుతుందనేది వేచి చూడాల్సి ఉంది.

ఆచితూచి అడుగు...

విశాలాంధ్ర-అమరావతి : కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యత కల్పించక పోవటంపై శుక్రవారం జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో వాడి వేడిగా చర్చసాగింది. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నివాసం వద్ద ఉన్న సమావేశమందిరంలో జరిగిన సమావేశానికి మంత్రులు, రాష్ట్ర పార్టీ ముఖ్యులు హాజరయ్యారు. అదే సమయంలో సమన్వయ కమిటీ సభ్యులతో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు, ఇతర నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ అంశంపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఏపీకి అన్యాయం చేసిన కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోయిందని, విభజన సమయంలో కాంగ్రెస్ తెలంగాణలో కేసీఆర్, ఇక్కడ జగన్‌తో అవగాహన కుదుర్చుకొని విభజన చేసిందని, తాను సమన్యాయం చేయాలని కోరినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే బీజేపీతో జతకట్టామని, అయితే కేంద్రం కూడా ఏపీని ఆదుకోవటంలో శ్రద్ధ చూపటం లేదన్నారు. ప్రభుత్వాలు సరిగా వ్యవహరించకపోతే ప్రజలు ఊరుకోరని అందుకు రాజస్థాన్‌లో జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు తార్కాణంగా పేర్కొన్నారు. బడ్జెట్‌లో కర్నాటక, మహారాష్ట్రలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని, కొత్తగా ఏర్పాటైన ఏపీలోని పోలవరం, రాజధానికి బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవటం, విశాఖ రైల్వేజోన్‌ను పక్కన పెట్టడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలపై కూడా కేంద్రం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదని చెప్పుకొచ్చారు. ప్రతిపక్ష వైసీపీ అర్థంలేని విమర్శలు చేస్తోందని, మనం రాజీనామాలు చేస్తే రాష్ట్ర ప్రయోజనాల గురించి అడిగేవారు ఎవరున్నారన్నారు. ప్రత్యేకహోదాకు బదులు ప్రత్యేక ప్యాకేజీ అన్నారు. అందులో కూడా ఇచ్చిందేమీ లేదు. బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా అడిగినవన్నీ రాష్ట్రానికి ఇస్తున్నామని చెప్పారని, ఏపీని ఆదుకునేందుకు ప్రత్యేకంగా ఏమిచ్చారో చెప్పాలన్నారు. కేంద్రం నుంచి అన్ని రాష్ట్రాలకు వస్తున్నట్లే మనకు నిధులు వస్తున్నాయని, అంతేతప్ప ప్రత్యేక ప్రయోజనాలు ఒనగూరిందేమీ లేదన్నారు. ఈ విషయంలో మనం ఊరుకోకూడదు. సైలెంట్‌గా ఉంటే ప్రమాదం. పోరాటం కొనసాగించాలి. అది ఎలా అన్నదానిపై సూచనలు చేయాలని సీఎం చంద్రబాబు సమావేశానికి హాజరైన మంత్రులను, నాయకులను కోరారు. దీంతో కేంద్రం మిత్రధర్మాన్ని పాటించటంలేదని పలువురు దేశం నేతలు, మంత్రులు ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న మంత్రులను రాజీనామా చేయించాలని కొందరు సూచించారు. పార్లమెంట్ సమావేశాలు జరిగినంతకాలం నిరసన తెలుపుదామని ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప చెప్తూ, ప్రజలు మనవైపే ఉన్నారని వారి మద్దతు మనకే ఉంటుందని అన్నారు. వైసీపీ డబుల్‌గేమ్ ఆడుతోందని, బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం జరిగిందని ఎంపీ వైవి.సుబ్బారెడ్డి తొలుత మాట్లాడారని, జగన్ ఎందుకలా మాట్లాడావని అనటంతో మాటమార్చి బడ్జెట్‌కు అనుకూలంగా జాతీయ మీడియాలో మాట్లాడారని ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ కుటుంబరావు చెప్పారు. ఇదిలాఉండగా కేంద్రం అహంకారంగా వ్యవహరిస్తున్నందున కేంద్ర మంత్రులుగా ఉన్న అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరిలతో రాజీనామాలు చేయించాలని కొందరు నేతలు సూచించారు. ఆ పదవులు రెండు నామమాత్రమే. వాటివల్ల ఒరుగుతున్నదేమీ లేదు. రాజకీయ ప్రయోజనాల కన్నా రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యంగా అందరూ మాట్లాడండి.విధాన నిర్ణయాల జోలికి వెళ్ళొద్దు అంటూ చంద్రబాబు చెప్పారు. కేంద్రం వైఖరిపై మంత్రివర్గ సమావేశంలో, ఎంపీల సమావేశంలో చర్చించిన తర్వాత నిర్ణయిద్దామని, ఈ విషయంలో ఆచితూచి అడుగేయాల్సి ఉందని చంద్రబాబు పార్టీ నేతలకు చెప్పారు. త్వరలోనే రాష్ట్రంలోని అన్ని 5 నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై సమీక్షలు జరుపుతానన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలా నడుచుకోవాలన్న అంశంపై సమావేశంలో చర్చించారు. దళితతేజం - తెలుగుదేశం కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని నేతలను కోరారు.

త్వరలోనే బీసీ, మైనార్టీ సదస్సులను నిర్వహించ నున్నట్లు సీఎం ప్రకటించారు. మొత్తం మీద సమన్వయ కమిటీలో కేంద్ర బడ్జెట్‌పై వాడివేడి చర్చ సాగినా సీఎం చంద్రబాబు ఆచితూచి అడుగేయాలని, తొందరపడకూడదని, అవసరమైతే పార్టీలో ఓ ప్యానల్‌ను ఏర్పాటు చేసి లోతైన చర్చ జరపాల్సి ఉందని నాయకులకు చెప్పి సమావేశాన్ని ముగించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రుల కెఈ.కృష్ణ మూర్తి, చినరాజప్ప, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు, రాష్ట్ర మంత్రులు, పార్టీ కార్యాలయ కార్యదర్శులు టీడీ.జనార్దన్, వివివి.చౌదరి, తదితర ప్రముఖులు ఉన్నారు.

5 నుంచి జర్మనీ, స్వీడన్‌లో రోడ్‌షో

భాగస్వామ్య సదస్సు 2018లో పెట్టుబడులే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈనెల 5వ తేదీ నుంచి జర్మనీ, స్వీడన్‌లలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రోడ్‌షోలను నిర్వహించనుంది. రోడ్‌షోలను పర్యవేక్షించేందుకు ఐఏఎస్ స్థాయి అధికారులను నియమించింది. ఈమేరకు సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి నాగులపల్లి శ్రీకాంత్ జీవోను శుక్రవారం జారీ చేశారు. గత జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సును పురస్కరించుకుని కూడా ఏపీ ప్రభుత్వం అక్కడ రోడ్‌షో నిర్వహించిన విషయం తెలిసిందే. అదే రీతిలో ఈనెల 5వ తేదీ నుంచి 7 వరకూ జర్మనీలో జరిగే ప్రదర్శనకు చిత్తూరు, తూర్పు గోదావరిజిల్లాల కలెక్టర్లు పీఎస్ ప్రద్యుమ్న, కార్తికేయ మిశ్రాలను పర్యవేక్షణాధికారులుగా వ్యవహరించనున్నారు. అలాగే 8వ తేదీ నుంచి 10 వరకూ స్వీడన్‌లో నిర్వహించే రోడ్‌షోను వీరితోపాటు పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థజైన్, ఆంధ్రప్రదేశ్ ఎకనమిక్ డెవలెప్‌మెంట్ బోర్డు (ఏపీఈడీబీ) సీఈఓ జె కృష్ణకిషోర్ పర్యవేక్షిస్తారు. ఇందుకు సంబంధించిన నిధులను ఏపీఈడీబీ సమకూరుస్తుంది.



'విద్య'కు రూ.11లక్షల కోట్లు హర్షణీయం

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : కేంద్ర ప్రభుత్వ బడ్జెట్టులో విద్యా, పరిశోధనా రంగానికి రూ.11లక్షల కోట్లు కేటాయించడం హర్షణీయమని ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ప్రెసిడెంట్ డాక్టర్ పి.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మెరుగైన విద్యాభివృద్ధి కోసం ఎస్ఆర్ఎం కృషి చేస్తోందని తెలిపారు. విద్యార్థులకు విద్యతోపాటు నైపుణ్య అంశాల్ని బోధిస్తున్నామని వివరించారు. విద్యారంగాభివృద్ధికి కేంద్రానికి ఎస్ఆర్ఎం తరపున పూర్తి సహకారం అందజేస్తామని తెలిపారు. విద్యా రంగానికి బడ్జెట్టులో సముచితమైన కేటాయింపులతో మానవ వనరులు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

నేడు రాజమహేంద్రిలో ఆహారశుద్ధి సదస్సు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆహార శుద్ధి రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామి చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. రాజమహేంద్రవరంలో శనివారం నాడు జరిగే సదస్సు ఇందుకు కీలకం కానుంది. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్సు సంయుక్తంగా నిర్వహించే ఈ సదస్సుకు అనేకమంది పారిశ్రామికవేత్తలు హాజరవుతున్నారు. 'ఆహార శుద్ధి రంగంలో అవకాశాలు' అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో ఆహారశుద్ధి రంగంలోని నిపుణులు, ఉన్నతాధికారులు, పెట్టుబడిదారులు పాల్గొంటున్నారు. ఆహార శుద్ధి రంగంలో ఉన్న అపార అవకాశాలు, ప్రభుత్వ విధానాలపై సదస్సులో ప్రధానంగా చర్చ జరుగుతుందని ఇండస్ట్రీస్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ కార్యదర్శి గిరిజా శంకర్ తెలియజేశారు. ఈ రంగంలో ఇప్పటికే పెద్ద పారిశ్రామికవేత్తలు రంగప్రవేశం చేయడంతో చిన్నతరహా పారిశ్రామికవేత్తలకు విస్తృతమైన అవకాశాలు ఏర్పాడ్డాయని ఆయన తెలిపారు. రాజమహేంద్రవరం హోటల్ రివర్ బేలో ఈ సదస్సు జరుగుతుందని చెప్పారు.

మంత్రిని కలిసిన దుర్గగుడి ఈవో

విశాలాంధ్ర-అమరావతి : విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానం ఈవోగా బాధ్యతలు చేపట్టిన పద్మ శుక్రవారం సచివాలయంలో దేవాదాయశాఖ మంత్రి మాణిక్యాలరావును మర్యాదపూర్వకంగా కలిశారు.



ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధితో పాటు అక్కడ ఉన్న సమస్యలపై మంత్రి ఈవోతో చర్చించారు. మంచిగా అందరిని కలుపుకొని ఆలయ అభివృద్ధికి పాటుపడాలని మంత్రి ఈఓకు సూచించారు.

కాంగ్రెస్ ఐటీ సెల్ కో-ఆర్డినేటర్ల నియామకం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఐటీ సెల్ సోషల్ మీడియా విభాగానికిగాను రాష్ట్ర వ్యాప్తంగా 13జిల్లాల కో-ఆర్డినేటర్లను నియమించారు. ఈ మేరకు పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు డాక్టర్ బి.సతీష్, విశాఖపట్నం అర్బన్, రూరల్‌కు గంగిరెడ్డి మనోహర్‌రెడ్డి, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాలకు తాళ్లూరి విజయ్‌కుమార్, కృష్ణా,గుంటూరుకు ఎస్‌కే మౌలాలి, ప్రకాశం, నెల్లూరుకు అంబటి రామకృష్ణ, అనంతపురం, కర్నూలు, చిత్తూరు, కడప జిల్లాలకు పీఎస్ అహ్మద్ హుస్సేన్‌లను నియమించారు.

నేటి నుంచి సోమిరెడ్డి విదేశీ పర్యటన

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి 3వ తేదీ నుంచి 10 వరకూ విదేశాల్లో పర్యటించనున్నారు. ఈమేరకు సాధారణ పరిపాలనశాఖ కార్యదర్శి శ్రీకాంత్ నాగులాపల్లి శుక్రవారం జీవో జారీ చేశారు. మంత్రి ఈనెల 3వ తేదీ నుంచి 5 వరకూ వియత్నాంలో, 6వ తేదీ నుంచి 8 వరకూ ఫిలిప్పైన్స్‌లో, 9వ తేదీ నుంచి 10 వరకూ థాయిలాండ్‌లో పర్యటిస్తారు. ఆయా దేశాల్లోని ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఐఆర్ఆర్ఐ)లకు సంబంధించి క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు.

రైల్వే నిర్వాసితులకు రూ. 21.54 కోట్ల మంజూరు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: నడికుడి-శ్రీకాళహస్తి నూతన మార్గం నిర్మాణానికి సంబంధించి నిర్వాసితులకు రూ. 21.54 కోట్లను రవాణా, రహదారులు, భవనాలశాఖ మంజూరు చేసింది. ఈమేరకు ఆశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరభ్‌కుమార్ ప్రసాద్ జీవోను శుక్రవారం జారీ చేశారు. నడికుడి-శ్రీకాళహస్తి మార్గ నిర్మాణానికి భూసేకరణకు ఈ మొత్తాన్ని వినియోగిస్తారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో 50 శాతం వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంది. ప్రాజెక్టు రెండో దశలో భాగంగా గుంటూరుజిల్లాలో ముక్కెళ్లపాడు, బసవోలు, చింతలచెరువు గ్రామాల్లో 111.87 ఎకరాలను సేకరించనున్నారు. భూములను కోల్పోవడం వల్ల 161 కుటుంబాలు నిర్వాసితులు కానున్నారు. వీరికి రూ. 21.54 కోట్లలో ఆయా మొత్తాల పరిహారాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా చెల్లించనున్నారు.

శ్రీనివాసరెడ్డికి పొట్టిశ్రీరాములు వర్సిటీ ప్రతిభా పురస్కారం



విశాలాంధ్ర - హైదరాబాద్ : జర్నలిస్టు ఉద్యమ జాతీయనాయకులు, మన తెలంగాణ దినపత్రిక సంపాదకులు కె.శ్రీనివాసరెడ్డి (కేఎస్ఆర్)ని పత్రికారంగంలో విశిష్ట సేవలందించినందుకుగాను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసింది. ఈ మేరకు యూనివర్సిటీ శుక్రవారం ప్రకటించింది. ప్రతిభా పురస్కారానికి ఎంపికైన శ్రీనివాసరెడ్డికి తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) అభినందనలు తెలియజేశాయి.

సీబీఐ కోర్టుకు జగన్

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : అక్రమాస్తుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్.జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు హాజరయ్యారు. ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరుకావాలని జగన్‌ను సీబీఐ కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల ప్రకారం జగన్ ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. ఈ కేసులో జగన్‌తో పాటుగా వైసీపీ నేత విజయ్‌సాయిరెడ్డి విచారణ ఎదుర్కొంటున్నారు. జగన్ సంస్థల్లో రాంకీ పెట్టుబడులకు సంబంధించిన చార్జిషీట్‌లో తన పేరును తొలగించాలని విజయసాయిరెడ్డి దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్‌పై ఆయన తరపు న్యాయవాది శ్రీరామ్ జనవరి 20న కోర్టులో వాదనలు వినిపించారు. జనవరి 26 వతేదీ రిపబ్లిక్ డే సందర్భంగా కోర్టుకు సెలవుకు కావడంతో జగన్ కోర్టుకు రాలేదు. తిరిగి శుక్రవారం కోర్టుకు హాజరయ్యారు. ప్రస్తుతం జగన్ ప్రజాసంకల్ప యాత్ర పేరుతో ఆంధ్రప్రదేశ్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం పాదయాత్ర నెల్లూరు జిల్లాలో కొనసాగుతోంది. సీబీఐ కోర్టుకు హాజరుకావాల్సి ఉన్నందున పాదయాత్రకు జగన్ విరామం ప్రకటించారు. తిరిగి శనివారం మరుపూరు నుంచి పాదయాత్రను ప్రారంభిస్తారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఏపీ ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో కొనసాగుతున్నాయి. ఈ నెల 1వ తేదీన ప్రారంభమైన పరీక్షలను కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ నిర్వహిస్తున్నారు. ప్రాక్టికల్ పరీక్షల ప్రశ్నాపత్రాన్ని పరీక్షలకు ముందస్తుగా ఆయా కేంద్రాలకు ఆన్‌లైన్లో పంపుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,65,832 మంది అభ్యర్థులు ప్రాక్టికల్ పరీక్షలు రాయాల్సి వుంది. ఇందుకోసం 538 పరీక్షా కేంద్రాలను కేటాయించారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా పరీక్షలను నిర్వహిస్తున్నారు.

ఇకపై దేవదాయ, ధర్మదాయశాఖ : ప్రభుత్వ ఉత్తర్వులు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : దేవాదాయ, ధర్మాదాయశాఖ పేరును దేవదాయ, ధర్మదాయశాఖగా పేరును ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల శాఖ పేరును మార్చాలని మంత్రి పీ మాణిక్యాలరావు ప్రతిపాదించగా, ప్రభుత్వం ఆమోదం తెలిపింది.



వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సమావేశంలో మంత్రి కామినేని

జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం

త్వరలో కర్నూలు క్యాన్సర్ సెంటర్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర-అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించే అంశంపై చర్చిస్తున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్ చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆయన తన శాఖ అధికారులతో పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. త్వరలో కర్నూలులో స్టేట్ క్యాన్సర్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నామని, త్వరలో టెండర్లు పిలుస్తామన్నారు. ఆయుష్ శాఖలో ఉన్న ఆసుపత్రులను తక్షణమే బలోపేతం చేయాలని, ఆయా ఆసుపత్రులలో తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలన్నారు. వేసవికాలంలో వడదెబ్బ తగలకుండా విద్యార్థులకు హోమియో మందులు పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. వెల్‌నెస్ సెంటర్లు వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, నకిలీ ఆయుర్వేద మందులను అరికట్టాలని సూచించారు. యోగ, న్యాచురోపతిపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి, అనంతపురం జిల్లా హిందుపురం, చిత్తూరు జిల్లా మదనపల్లి, నెల్లూరు జిల్లా ఆత్మకూరు, ప్రకాశం జిల్లా మార్కాపురం ఆసుపత్రులను జిల్లా ఆసుపత్రులుగా మార్చాలని ఆర్థిక శాఖకు నివేదిక పంపించామన్నారు. నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో ఎస్సార్‌లుగా పనిచేస్తున్న వైద్యులకు జీతాలు చెల్లింపు విషయంలో ట్రెజరీ డైరెక్టర్‌తో మంత్రి కామినేని మాట్లాడి డాక్టర్లకు వెంటనే జీతాలు చెల్లించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో శిథిలావస్థకు చేరిన భవనాలను వెంటనే తొలగించాలని, ఆయుష్, ఏపీ శాక్స్, ఐపీఎం శాఖల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి కామినేని అధికారులను కోరారు.

విజయవాడ-రాంచి కారిడార్‌కు రూ. 200 కోట్లే!

- 2018-19 లో లక్ష్యం 100 కి.మీ. పూర్తి
- ఎల్‌డబ్ల్యూఈ సహా కారిడార్‌కు 2,940 కోట్లు
- 'భారతమాల' ప్రాజెక్టులోనూ అన్యాయమే!



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : దేశంలో రహదారుల అభివృద్ధికి నిర్దేశించిన 'భారతమాల' ప్రాజెక్టులో భాగమైన విజయవాడ-రాంచి కారిడార్‌లో రెండు వరుసల రహదారి నిర్మాణానికి కేంద్రం 2018-19 బడ్జెట్‌లో రూ. 200 మాత్రమే కేటాయించింది. ఈ కారిడార్‌లో ఏడాది వ్యవధిలో 100 కిలోమీటర్ల మార్గాన్ని పూర్తి చేయనుంది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు (ఎల్‌డబ్ల్యూఈ) అభివృద్ధి చేసే క్రమంలో ఆయా నగరాలు, పట్టణాలను కలిపి విజయవాడ-రాంచి కారిడార్ కోసం బడ్జెట్‌లో రూ. 2,940 కోట్లను కేటాయించిన కేంద్రం దీనిని 2019-20 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. మొత్తం కారిడార్‌లో 6,045 కిలోమీటర్లు ఉండగా 2017 డిసెంబరు 31 నాటికి 4,885 కిలోమీటర్ల మార్గాన్ని పూర్తి చేసింది. ఇంకా 1600 కిలోమీటర్ల మార్గాన్ని పూర్తి చేయాల్సి ఉండగా 2018-19 సంవత్సరంలో 500 కిలోమీటర్ల మార్గాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. వాస్తవానికి ఈ ప్రాజెక్టును ఈ ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాల్సి ఉంది.

అయితే 2020 నాటికి మొత్తం కారిడార్‌ను పూర్తి చేయాలని భావిస్తున్న కేంద్రం ఈ ఏడాది 500 కిలోమీటర్ల మార్గాన్ని లక్ష్యంగా ఎంచుకుంటే మిగిలిన 1100 కిలోమీటర్ల మార్గాన్ని ఒక్క సంవత్సరంలో ఏవిధంగా పూర్తి చేస్తుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రానికి వివిధ కేటాయింపుల్లో పూర్తిగా అన్యాయం జరిగిందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతున్న నేపథ్యంలో విజయవాడ-రాంచి కారిడార్ విషయంలోనూ కేంద్రం చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. దేశవ్యాప్తంగా ఈ పథకం కోసం కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖకు 2018-19 సంవత్సరానికి 29,663.13 కోట్లను బడ్జెట్‌లో కేటాయించింది. నేషనల్ హైవే డెవలెప్‌మెంట్ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌డీపీ) అంతర్భాగ మైన భారతమాల ప్రాజెక్టులో దేశంలోని పలు ప్రాంతాల సామాజిక, ఆర్థికాభివృద్ధి కోసం రహదారులతో అనుసంధానం చేస్తారు. భారతమాల ప్రాజెక్టుకు సంబంధించి ఫేజ్-1లో మొత్తం 29,663.13 కోట్ల వ్యయంతో 55,943 కిలోమీటర్ల మార్గాన్ని ఐదేళ్ల కాల వ్యవధిలో పూర్తి చేయడం లక్ష్యంగా కేంద్రం నిర్ణయించింది. ఇక ఫేజ్-2లో దేశవ్యాప్తంగా 48,877 కిలోమీటర్ల మార్గాన్ని నిర్మిస్తారు. ఇందులో 2017 డిసెంబరు 31 నాటికి 33,500 కిలోమీటర్ల మార్గాన్ని పూర్తి చేయగా, 2018-19 సంవత్సరంలో 4,500 కిలోమీటర్ల మార్గాన్ని లక్ష్యంగా ఎంచుకుంది. భారతమాలలో భాగంగా విజయవాడ-రాంచీ మధ్య మొత్తం 1632 కిలోమీటర్ల మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. మావోయిస్టు ప్రాబల్యం ఉన్న ప్రాంతాలను అభివృద్ధి చేయడం, గిరిజన వెనుకబడిన ప్రాంతాలకు రహదారుల సదుపాయం కల్పించేందుకు ఈ కారిడార్‌ను ఎంపిక చేసింది. మొత్తం మూడు రాష్ట్రాల మీదుగా సాగే ఈ ప్రాజెక్టులో ఆంధ్రప్రదేశ్‌లో 236 కిలోమీటర్లు, ఒడిశాలో 1219 కిలోమీటర్లు, జార్ఖండ్‌లో 177 కిలోమీటర్ల అభివృద్ధి చేస్తారు. ఈ కారిడార్‌లో ఎక్కువ ప్రాంతం ఒడిశాలోనే ఉన్నందున ఆ రాష్ట్రానికే ఉపయుక్తంగా ఉంటుంది. రాష్ట్రంలో పయనించే చెన్నై-కోల్‌కత జాతీయ రహదారిలో ఒడిశాలోని జయపూర్ నుంచి ఆ రాష్ట్రంలో 12 జిల్లాల మీదుగా జార్ఖండ్‌లోని రాంచీ వరకూ రెండు వరుసల్లో రహదారిని నిర్మించనున్నారు.

ఏపీకి ఎలాంటి ప్రయోజనం లేదు : బొత్స

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : పార్లమెంటులో ఆర్థిక శాఖ మంత్రి జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఎలాంటి ప్రయోజనం లేదని వైసీపీ సీనియర్ నాయకులు బొత్స సత్యనారాయణ అన్నారు. చంద్రబాబుది అంతా బ్యాక్ గ్రౌండ్ మ్యూజికే తప్ప ముందుకు వచ్చి రాష్ట్రానికి అన్యాయం జరుగుతుందని ఎందుకు చెప్పలేకపోతున్నారని నిలదీశారు. చంద్రబాబు స్వార్థపూరిత ఆలోచనల వల్లే రాష్ట్రానికి నష్టం వాటిల్లిందన్నారు. ప్రత్యేక హోదా విషయంలోనూ కేంద్రం కంటే ముందే టీడీపీ సర్కార్ నోరు జారిందని ఆయన విమర్శించారు. పార్టీ కేంద్ర కార్యాలయం లోటస్‌పాండ్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీని కేంద్రం ఎందుకు చిన్నచూపు చూస్తోందని బొత్స ప్రశ్నించారు. చంద్రబాబుకి జరిగే పరిణామాలన్నీ ముందే తెలుస్తున్నాయని, కానీ ఏమీ తెలియనట్లు ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా, విశాఖకు రైల్వేజోన్ రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అని, వాటి కోసం చంద్రబాబు కేంద్రంతో ఎందుకు పోరాడటం లేదని నిలదీశారు. చంద్రబాబుది చేతకానితనం వల్లే బడ్జెట్ కేటాయింపులో ఎక్కడా ఏపీ ఊసే లేదని వ్యాఖ్యానించారు. పోలవరం ప్రాజెక్ట్ విషయంలోను చంద్రబాబు నైజం బయటపడిందని, కమీషన్లు, ఆర్థిక ప్రయోజనాల కోసమే రాష్ట్ర హక్కుల్ని కాలరాశారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. ఇప్పటివరకూ నాలుగు బడ్జెట్లు అయిపోయాయని, ఇది ఐదో బడ్జెట్ అని, ప్రతిసారీ రాష్ట్రానికి అన్యాయం జరిగినా ఇప్పటివరకూ టీడీపీ సర్కార్ ఎందుకు స్పందించలేదని బొత్స ప్రశ్నించారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయంపై

టీడీపీ తన వైఖరిని స్పష్టంచేయాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మధు

విశాలాంధ్ర-గుంటూరు సిటీ : కేంద్రబడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై టీడీపీ తన వైఖరిని స్పష్టం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు డిమాండు చేశారు. గుంటూరులోని సీపీఎం జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చే విషయంలో టీడీపీ ప్రజలకు తగిన వివరణ ఇవ్వాల్సి ఉందన్నారు. ఆర్థిక సర్వే ఆధారంగా వ్యవసాయ రంగానికి నిధుల కేటాయింపు జరగలేదన్నారు. కేవలం లక్ష కోట్లు రుణాలు ఇస్తామని చెప్పడం తప్ప రైతులకు గిట్టుబాటు ధరల విషయంలో బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదన్నారు. పెరుగుతున్న నిరుద్యోగం, ఉపాధి రంగాలకు తగిన కేటాయింపులు లేవన్నారు. బడ్జెట్ అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడలేకపోయిందని కేవలం రాజకీయ పరమైన లబ్ధి కోసం బీజేపీ ప్రయత్నించిందన్నారు. కర్ణాటకలో ఎన్నికలు ఉన్నందున నిధులు కొంత ఇచ్చినప్పటికి ఆంధ్రప్రదేశ్‌ను అసలు పట్టించుకోలేదన్నారు. రైతులు ఎదుర్కొంటున్న రెండు సమస్యలను విస్మరించిన ప్రభుత్వం బ్యాంకుల్లో రుణాలను మాఫీ చేయడం, పంటలకు పెట్టుబడికి తగ్గట్టుగా మద్దతుధర ప్రకటించడంలో విఫలమైందన్నారు. ఈ బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసిందని, విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రైల్వేజోన్, కడప ఉక్కు కర్మాగారం, రాజధానికి నిధులు, ఆర్థిక లోటును పూడ్చేందుకు నిధులు కేటాయించలేదన్నారు. కేంద్రంతో సఖ్యతగా ఉంటేనే



నిధులు వస్తాయని చంద్రబాబు ఊదరగొట్టారని, ఇప్పుడు నిధులు రాకపోవడంపై చంద్రబాబు ప్రజలకు ఏం సమాధానం చెబుతారన్నారు. రాష్ట్రానికి ద్రోహం చేసిన బీజేపీతో టీడీపీ పొత్తు కొనసాగిస్తుందా, పొత్తును తొలగించుకుని స్వతంత్ర్యంగా రాష్ట్ర ప్రయోజనాల కోసం పనిచేస్తుందా అని ప్రజలు నిలదీస్తున్నారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రాభివృద్ధి కోసం టీడీపీ తన విధానాన్ని స్పష్టం చేయాలన్నారు. కేంద్ర బడ్జెట్ అనంతరం ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిపై చర్చించేందుకు శనివారం అన్నీ వామపక్ష పార్టీలు విజయవాడలో సమావేశమవుతున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్రాభివృద్ధి కోసం భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బీజేపీతో విడిపోతే పవన్‌కళ్యాణ్‌తో కలిసి పనిచేస్తామని మంత్రి లోకేష్ చేసిన వ్యాఖ్యలపై పవన్‌కళ్యాణ్ తన వైఖరిని వెల్లడించాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.కృష్ణయ్య, గుంటూరు జిల్లా తూర్పు, పశ్చిమ కమిటీల కార్యదర్శులు పాశం రామారావు, గద్దె చలమయ్య, జిల్లా కమిటీ సభ్యులు టి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్ స్థలం

హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కు

28.98 ఎకరాల్లో కంపెనీ ఏర్పాటు

ప్రత్యామ్నాయంగా సూరంపల్లిలో 25.02 ఎకరాలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లిలోని ఏపీఎస్ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్‌కు చెందిన 28.98 ఎకరాల స్థలాన్ని హెచ్‌సీఎల్ టెక్నాలజీకి అప్పగించనున్నారు. సంస్థ కార్యకలాపాలు చేపట్టేందుకు వీలుగా ఆ స్థలానికి అడ్వాన్స్ పొజిషన్ ఇవ్వాలంటూ ప్రభుత్వం కృష్ణాజిల్లా కలెక్టర్‌కు సూచించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ మన్మోహన్‌సింగ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేసరపల్లిలోని ఆర్ఎస్ నంబర్ 20-3, 4, 8, 16-4లో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్ స్థలంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్‌కు కేటాయించేందుకు అనుమతించాలని ఏపీఐఐసీ కోరింది. గతంలోనే దీనిపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆరు ఎకరాల విస్తీర్ణంలో ఆర్టీసీ భవనాలు ఉండటంతో స్థలం అప్పగింతలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో సూరంపల్లిలో ప్రత్యామ్నా యంగా 25.02 ఎకరాల స్థలాన్ని కేటాయించటం తోపాటు భవన నిర్మాణాల కోసం రూ.29.40 కోట్లను ప్రభుత్వం చెల్లించేందుకు ముందుకొచ్చింది. ఈ నేపథ్యంలో తక్షణమే ఆర్టీసీ ట్రైనింగ్ సెంటర్‌ను హెచ్‌సీఎల్ సంస్థకు అప్పగించాలని ప్రభుత్వం ఆదేశించింది. స్థలాన్ని స్వాధీం చేసుకున్న మూడేళ్లలో సంస్థ కార్యకలాపాలు చేపట్టాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

కేంద్ర బడ్జెట్ భేష్ !

మంత్రి మాణిక్యాలరావు

విశాలాంధ్ర-అమరావతి : కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం గురువారం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై రాష్ట్రంలోని అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీలు అన్యాయం జరిగిందని ఘోషిస్తుంటే.. ఇది మంచి బడ్జెట్ అని, కొందరు అంకెలు చదవక, అర్థం కాక వివాదం సృష్టిస్తున్నారని, ఈ వివాదం రెండు రోజుల్లో సమసిపోతుందని బీజేపీకి చెందిన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు చెప్పారు. శుక్రవారం సచివాలయంలో ఆయనను కలిసిన మీడియాతో మాట్లాడారు. బడ్జెట్‌ను అధ్యయనం చేస్తే మంచి బడ్జెట్ అని అర్థమవుతుందని, రాష్ట్రానికి మేలు జరిగిందో లేదో తెలుస్తుందన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశానికి సంబంధించిందని, భారతదేశంలో ఏపీ అంతర్భాగమని, ఆ విషయాన్ని గ్రహించాలన్నారు. రాజధాని అమరావతి, మెట్రోరైల్ ప్రాజెక్ట్ నిర్మాణాలకు ఇంతవరకు డీపీఆర్ సమర్పించలేదని, అయినా కూడా రాజధానికి రెండు వేల కోట్లు నిధులు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. డీపీఆర్‌లు పంపకుండానే ప్రభుత్వాలు ఎన్ని నిధులని మంజూరు చేస్తాయని ఎదురు ప్రశ్నించారు. బడ్జెట్‌లోని అంశాలన్నీ అంకెలతో సహా సమగ్రంగా అధ్యయనం చేసి అప్పుడు కేంద్రం రాష్ట్రానికి చేసిన మేలు గురించి మాట్లాడతానని చెప్పారు.

కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ నిరసనలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు నెలకొన్న అన్యాయాన్ని ఎండగడుతూ శుక్రవారం పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు ఆందోళనలు చేపట్టారు. విజయవాడ పీసీసీ కార్యాలయం ఎదుట ప్రభుత్వ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దగ్ధం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినదించారు. ఈ సందర్భంగా పీసీసీప్రధాన కార్యదర్శి మస్తాన్ వలీ మాట్లాడుతూ, రాష్ట్రానికి రావాల్సిన వనరులు, సదుపాయాల కల్పనపై ప్రభుత్వం స్పందించట్లేదని విమర్శించారు. రైల్వేజోన్, రాజధాని అంశాల్ని ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. మోడీ, బాబు రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు.

రాజస్థాన్‌లో కాంగ్రెస్ గెలుపుపై మిఠాయిల పంపిణీ

రాజస్థాన్‌లో కాంగ్రెస్ విజయాన్ని హర్షిస్తూ పార్టీ నాయకులు, కార్యకర్తలు టపాసులు పేల్చారు. అనంతరం కార్యకర్తలు పరస్పరం మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో పీసీసీ ప్రధాన కార్యదర్శులు మస్తాన్ వలీ, మీసాల రాజేశ్వరరావు, అధికార ప్రతినిధి వి.గురునాథం, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ, పీసీసీ అధికార ప్రతినిధి నిమ్మల జ్యోతిక, కార్యదర్శులు కొరగంజి భాను, ఏసు దాసు, అల్లం పూర్ణ, బేగ్, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కుర్షిదా, మల్లికా, ప్రమీలా గాంధీ, కెంబూరి శ్రీలక్ష్మి పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీనామాలతో ఒత్తిడి పెంచండి : రఘువీరారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌లో ఎంతోకొంత మేలు జరుగుతుందని భావించిన తెలుగు ప్రజలకు చివరకు నిరాశే మిగిలిందని రఘువీరారెడ్డి విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో ఉండి టీడీపీ, బయట నుంచి మద్దతు ఇస్తున్న వైసీపీలు తమ పార్టీ ఎంపీలతో రాజీనామాలు చేయించి ఉద్యమాలకు సిద్ధం కావాలని డిమాండు చేశారు. శుక్రవారం హైదరాబాద్ లోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనతో పాటు మాజీ టీటీడీ ఛైర్మన్ బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే తులసిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగాభవానిలతో కలిసి మాట్లాడారు. నాలుగేళ్లుగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు విభజన చట్టంలోని హామీలను సాధించడంలో పూర్తిగా విఫలమై నేటికీ కాంగ్రెస్‌పై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రపతి ఎన్నికల సమయంలోనే రాష్ట్ర ప్రభుత్వం డిమాండు చేసి ఉంటే ప్రత్యేక హోదా దక్కేదన్నారు. అమిత్‌షా రాష్ట్ర పర్యటనలో ఏపీకి రూ.1లక్షా 40 వేల కోట్లు కేటాయించామని చెప్పినా దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో నేడు ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. విభజన చట్టంలో రూ.5 లక్షల కోట్ల హామీలు ఉన్నా ప్రభుత్వం దేన్నీ సాధించలేకపోయిందని దుయ్యబట్టారు. బీజేపీ చేసే ప్రతి ద్రోహంలో ఈ రెండు పార్టీలకు సమాన బాధ్యత ఉందని, ఇప్పటికైనా రాజీనామాలు చేసి నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండు చేశారు. కాంగ్రెస్ హయాంలో 8 శాతం ఉన్న జీడీపీ ప్రస్తుతం 6.3 శాతానికి పడిపోయిందన్నారు.

సంపాదకీయం

ఆర్థికవ్యవస్థ దుస్థితి తొలగేదెన్నడో!

'పిట్ట కొంచెం కూత ఘనం' అన్నట్లుగా వుంది కేంద్ర విత్తమంత్రి అరుణ్ జైట్లీ శుక్రవారం ఘనంగా ప్రవేశపెట్టిన బడ్జెట్. పథకాలు గొప్పగా వున్నాయి. నిధులు మాత్రం అయోమయం. మొత్తంగా బడ్జెట్ అన్ని రంగాల వారిని నిరుత్సాహ పర్చింది. ద్రవ్యలోటు, ఎగుమతులు, వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణ, ఉపాధి, పెట్టుడులు, కేటాయింపులు, పన్ను రిలీఫ్ వంటి రంగా లకు కేటాయింపులు అసంతృప్తికరంగా వున్నాయి. పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలుతో ఆర్థిక వ్యవస్థ కుదేలయింది. ఆ రెండు చర్యలు పొరపాటని బడ్జెట్ కూడా అంగీకరించింది. జైట్లీ ప్రవేశపెట్టింది ఎన్నికల బడ్జెట్ అనడం అతిశయోక్తి కాదు. రైతులు, మహిళల దగ్గర నుండి షెడ్యూల్డు తెగలు, షెడ్యూల్డు కులాలు సీనియర్ సిటిజన్ల వరకు అనేక జనాకర్షక పథకాలు ప్రవేశపెట్టారు. అయితే వాటికి సంబంధించి నిధుల వివరాలు మాత్రం బడ్జెట్లో వెల్లడించకపోవడంతో అయోమయ పరిస్థితి చోటుచేసుకొంది. మోడీ ప్రభుత్వం తీసుకున్న రెండు చర్యలతో ఏర్పడిన ఆర్థిక వ్యవస్థ దుస్థితిని తొలగించేందుకు, ఆర్థిక వ్యవస్థను తిరిగి పట్టాలెక్కించడానికి చర్యల వూసే బడ్జెట్లో లేదు. దాంతో ప్రజల్లో ఆర్థిక వ్యవస్థ దుస్థితి ఎప్పటికి తొలగుతుందన్న అయోమయ పరిస్థితి ఏర్పడింది. జైట్లీ చివరిసారిగా ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ వాస్తవంగా కార్పొరేట్లకే అనుకూలంగా వుంది. రైతులు, పేదల అనుకూల బడ్జెట్ అని ప్రధానితో సహా కేంద్రమంత్రులు, బీజేపీ ఎంపీలు చెప్పుకోవడం, జబ్బలుచరచుకోవటం కేవలం వాగాడంబరమే.

గడచిన మూడున్నరేళ్ల మోడీ ప్రభుత్వ పాలనలో కార్పొరేట్లు, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి చేయవలసినదంతా చేశారు. రాయితీలపై రాయితీలను కురిపించారు. సామాన్య ప్రజల నడ్డి విరిచే విధంగా భారాలు మోపారు. 2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మోడీ యిచ్చిన హామీలన్నీ "జుమ్లా" (ఉత్తిమాటలే) అని, వాటిని విస్మరించాలని ఆ తరువాత బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా తాపీగా సెలవిచ్చారు. విదేశీ బ్యాంకుల్లో దాచిన నల్లధనాన్ని తిరిగి భారత్‌కు తీసుకువస్తానని, ప్రతి భారతీయుడి బ్యాంకు ఖాతాల్లో రూ. 15 లక్షలు జమచేస్తానని, ఏడాదికి కోటి కొత్త ఉద్యోగాల కల్పన వంటి హామీలన్నీ ఆ తరువాత 'తూచ్'గా మారిపోయి ప్రధాని చిత్తశుద్ధిలేమిని పట్టించాయి. సామాన్య ప్రజలకు సంబంధించి అన్ని రంగాల్లో మోడీ ప్రభుత్వం విఫలం కావడం మాత్రమే గాక, ఆర్థికాభివృద్ధి మూలాలనే దాదాపు ధ్వంసం చేసింది. గత ఏడు దశాబ్దాల్లో ప్రజలు నిర్మించుకున్న వాటన్నింటినీ అయినకాడికధరకు కార్పొరేట్‌లకు వేలంలో యిచ్చేయడమే లేదా స్వాధీనం చేయడమో జరిగింది. దేశ ఆర్థిక పరిస్థితి దారుణంగా వున్నప్పటికీ మోడీ సర్కారుకు పేద ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, బాధల గురించి చీమకుట్టినట్లుగా లేకపోవడం బాధాకరం. కనీసం వ్యవసాయం, విద్య, వైద్య, ఉపాధి రంగాలలో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టనట్లయితే సంక్షోభం మరింత తీవ్రమవుతుందని బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజున సమర్పించిన ఆర్థిక సర్వే పరోక్షంగా ఒప్పుకొంది. కానీ, అతిపెద్ద సమస్యలైన వీటిపై ప్రధానమంత్రి బడ్జెట్‌లో సారించవలసినంతటి దృష్టి పెట్టినట్లు కనిపించదు.

ఉపాధికి సంబంధించినంత వరకు మోడీ ప్రభుత్వం ఉపాధికల్పన విషయంలో తప్పుడు, కల్పిత కూడిన అంకెలను వెల్లడించింది. ఉద్యోగుల భవిష్యత్ నిధి (ఈపిఎఫ్) పథకాలలో లక్షలాది మంది కొత్తవారు నమోదు చేసుకున్నారని ప్రభుత్వం చెప్పుకొంటున్నది. వీరే కొత్తగా ఉద్యోగాలు పొందిన వారిగా ప్రభుత్వ వాదన. ఆర్థిక బాధల కారణంగా గ్రాడ్యుయేట్లు వీధుల్లో "పకోడి" అమ్ముకొని రోజుకు రూ. 200 ఆర్జిస్తున్నారని, తన ప్రభుత్వంలో కొత్తగా ఉపాధులు పొందిన వారిలో వీరిని కూడా లెక్కలోకి తీసుకోవాలని ఒక టీవీ ఇంటర్వ్యూలో మోడీ చెప్పడం హాస్యాస్పదం. ప్రజలు దాన్ని మరో "జుమ్లా"గా పరిగణించి, తనకు 600 కోట్ల మంది భారతీ యులు ఓట్లు వేసి అధికారంలోకి పంపారని, ఇది ప్రపంచ రికార్డని, దేశంలోనే 3 దశాబ్దాల తరువాత ఇది జరిగిందని దావోస్‌లో మోడీ చెప్పుకోవడంతో సరిపోల్చారు. ప్రధాని దేశ జనాభాయే కేవలం 125 కోట్లన్న విషయాన్ని బహుశా మోడీ మర్చిపోయి వుంటాడేమో!. నిరుద్యోగిత వాస్తవ పరిస్థితి తెలుసుకోవాలని మోడీ నిజంగా కోరుకుంటున్నట్లయితే, ఒక్క రాష్ట్రం నుండే ఆయన అడిగి తెలుసుకోవచ్చు. దశాబ్ద కాలంగా బీజేపీ అధికారంలో వున్న మధ్యప్రదేశ్ రాష్ట్రంలో 738 చపరాసీల ఉద్యోగాలకు రెండు లక్షల మందికి పైగా దరఖాస్తులు పెట్టుకొన్నారు. వారిలో వేలాది మంది ఎంబీఏ, ఇంజినీరింగ్ ఉత్తీర్ణులు, పోస్టుగ్రాడ్యుయేట్లు, గ్రాడ్యు యేట్లు వున్నారు. ఇది నిరుద్యోగ భారతానికి నిదర్శనంగా నిలుస్తుంది. వ్యవసాయ రంగానికి సంబంధించినంత వరకు మోడీ ప్రభుత్వం మూడున్నరేళ్ల పాల నలో రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయి. రైతులు పండించిన పంటలకు ఉత్పత్తి ఖర్చులు కూడా లభించనందున వారు తమ ఉత్పత్తులను రోడ్లపై గుమ్మరించడం కొనసాగుతూనే వుంది. వర్షాభావంతో పంటలు పండక, పండిన కొద్దిపాటి పంటలకు కూడా సరైన ధర లభించకపోవడంవల్ల గత సీజన్‌లో ఏడు రాష్ట్రాల్లో రైతులకు రూ. 26 వేల కోట్లు నష్టం వాటిల్లింది. విద్యారంగం పరిస్థితి మరింత అధ్వాన్నం. ప్రభుత్వం ఒక క్రమ పద్ధతిలో మొత్తం విద్యారంగాన్ని ప్రైవేటు పరం చేసింది. సాధారణ విద్యసైతం మధ్య తరగతి వర్గాల పిల్లలకు అందుబాటులో లేకుండాపోయింది. ప్రభుత్వం అన్ని విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ, ఎంఫిల్ వంటి పరిశోధన కోర్సుల సంఖ్యను గణనీయంగా తగ్గించింది. విద్యార్థుల స్కాలర్‌షిప్పులను రద్దు చేసింది. దీంతో మధ్యలోనే విద్యార్థులు చదువులు మానేసే పరిస్తితి కల్పించింది. ప్రాథమిక పాఠశాలల్లో చేరిన విద్యార్థులలో 50 శాతం మంది మధ్యలోనే మానేశారని ఒక ప్రభుత్వ సర్వే పేర్కొంది. వాళ్లందరూ బాలకార్మికులుగా మారిపోయారు. అన్ని రంగాల్లో పరిస్థితులు దారుణంగా వున్నాయి. కార్పొరేట్ అనుకూల, ఉద్యోగ, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలు, చర్యలకు పాల్పడుతున్న మోడీ ప్రభుత్వానికి వచ్చే ఏడాది జరుగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పటం నిస్సందేహం.

చురక

మోడీ మాయామంత్రం
మనసు దోచె తంత్రం
బడ్జెట్‌లో ప్రజాకర్ష
పథకాలతో ఓట్ల స్పర్శ

సామాన్యుల తేనెపూత
సానపెట్టె ఖడ్గ మోత
కపట ప్రలోభాల దృష్టి
కార్పొరేట్ల లాభ సృష్టి

- వేల్పుల నారాయణ

పావులు కదిపిన నవీన్ ... పట్టాలెక్కని రైల్వే జోన్!

విశ్లేషణ



నల్లి ధర్మారావు

విశాఖ రైల్వే జోన్ సాధనకు చట్టపరమైన మద్దతు ఉన్నా, పాలక బిజెపికి మిత్రపక్షంగా ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు విఫలమయింది? అనే ప్రశ్న అందరిలోనూ తలెత్తుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ప్రధాని మోడీ దగ్గర భక్తి, వినయాలతో, రాష్ట్రానికి కావలసినవన్నీ సాధించుకోవాలనుకున్నారు. అయితే, అవేమీ పనిచేయలేదని ఆఖరి బడ్జెట్ రుజువు చేసింది. ప్రజల తీర్పుతో ఏర్పడిన ఒక రాష్ట్ర ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న ముఖ్యమంత్రి, కేంద్రం ద్వారా సాధించుకోవలసిన రాష్ట్ర ప్రయోజనాల కోసం ఆత్మగౌరవాన్ని కూడా ప్రదర్శించవలసి వుంది. ఇక్కడ, ఆత్మగౌరవమంటే, వ్యక్తిగా ఆయనకు సంబంధించి కాదు! అది, రాష్ట్ర ప్రజలకు సంబంధించింది. ఈ కోణంలోనే, కేంద్రంతో స్నేహంగా ఉంటూనే, అవసరమైన ప్పుడు, రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రదర్శిస్తూ, తన రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను రక్షించుకుంటున్నారు ఒడిసా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్. ఏ ముఖ్యమంత్రయినా, తన రాష్ట్రమే ప్రధానమని అనుకోవడం సహజం. కేంద్రం నుంచి రావలసిన, రాబట్టవలసిన పథకాలు, ప్రాజెక్టుల కోసం ఉన్నతాధికారులతో చర్చించి, సమగ్రమైన నివేదికలు తయారు చేయించి, కార్యాచరణకు దిగడం నవీన్ శైలి. ఎం.పీల బృందంతో కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు ఇప్పించడం, రాష్ట్ర మంత్రుల బృందాన్ని కేంద్ర మంత్రుల దగ్గరకు రాయబారాలు పంపడం, అవసరమైతే, రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రతిపక్షాల మద్దతును కూడగట్టడం ఆయన అనుసరిస్తున్న ప్రజాస్వామిక విధానం. ప్రధానికి, కేంద్ర మంత్రులకు ఒక వంక లేఖలు రాస్తూనే, అనివార్యమైతే తప్ప ఢిల్లీ వెళ్లని రాజకీయ వ్యక్తిత్వం అతనిది. విశాఖ రైల్వే జోన్‌ను అడ్డుకోవడానికి ఆయన అనుసరించిన ద్విముఖ వ్యూహం చాలామందికి తెలియదు.

'ఈస్ట్‌కోస్ట్' ఒడిసాకు సంపద

ఆంధ్ర ప్రదేశ్ విభజన ఖాయమై, 2014-ఆంధ్ర ప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి రాకముందే, రైల్వేజోన్ వ్యవహారాన్ని ఒడిసా ప్రభుత్వం పసిగట్టింది. ఈస్ట్‌కోస్ట్ జోన్ కేంద్రాన్ని భువనేశ్వర్ నుంచి విశాఖకు తరలించవద్దనే డిమాండ్‌తో, 2013లోనే ఆందోళన ప్రారంభమయింది. దీని కోసం 'ఈస్ట్‌కోస్ట్ బంచో సంఘర్షణ సమితి' ఏర్పాటయింది. నిజానికి, ఆంధ్ర ప్రదేశ్‌కు ఒక జోన్ ఇస్తే దాన్ని విశాఖ కేంద్రంగా ప్రకటించాలన్నదే మన డిమాండ్. ఉత్తరాంధ్రలో, ఏనాటినుంచో, విశాఖ జోన్ ఉద్యమం కొనసాగుతోంది. విభజన చట్టం, రాష్ట్రానికి ఒక జోన్ ఖాయం చేసింది.దాన్ని, ఎక్కడ ఏర్పాటు చేయాలన్నది పక్కనబెట్టి, అయిదేళ్ల పాలన ముగింపు దశలోనూ, మన రాష్ట్ర ప్రభుత్వం సాధించలేకపోయింది.

ఆంధ్రులకు జోన్ ఇచ్చినా ఇబ్బంది లేదు కానీ, ఈస్ట్‌కోస్ట్ జోన్‌ను యథాతథంగా కాపాడుకోవాలన్నదే ఒడిసా ప్రభుత్వ ధ్యేయం. ఎందుకంటే, భారతీయ రైల్వేకే కాకుండా, దీనివల్ల ఆర్థికంగా ఆ రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతోంది. ఈ జోన్ పరిధిలో మన రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాలు, ఛత్తీస్‌ఘడ్‌లో రెండు జిల్లాలు మాత్రమే ఉన్నాయి. ఒరిస్సా రాష్ట్రమంతా దీని పరిధిలోనే వుంది. జోన్ పరిధిలో విశాఖ డివిజన్ మాత్రమే, మన రాష్ట్రానిది. మిగిలిన ఖుర్దా రోడ్, సంబల్‌పూర్ డివిజన్లు ఒడిసావి. జోన్‌లోని 13 బ్రాడ్‌గేజ్ మార్గాల్లో ఒక్క బొబ్బిలి-సాలూరు లైన్ తప్ప, మిగిలినవన్నీ ఒడిసాలోనివే, దానితో ముడిపడినవే! జోన్‌లోని 18 మేజర్ రైల్వే స్టేషన్లలో, ఉత్తరాంధ్రలో ఉన్నవి అయిదు మాత్రమే! జోన్ ఆదాయం ప్రయాణికుల చార్జీల ద్వారా కన్నా 'లోడింగ్'పైనే ఎక్కువగా వస్తుంది. ఆర్థిక పురోగతిని సూచించే ఆపరేషన్ రేషియో (ఓ.ఆర్)లో, దేశంలోని 17 జోన్లలో ఈస్ట్‌కోస్ట్ తొలి మూడు స్థానాల్లో ఉంది. ఒడిశా ప్రభుత్వానికి 'మైనింగ్' ప్రధాన ఆదాయ వనరు. దేశంలోనే పెద్ద లోడింగ్ జోన్‌గా గుర్తింపు పొందింది. ఆంధ్రా-ఒడిసాలోని తీర ప్రాంత ఓడ రేవులకు రైల్వే మార్గాల్లోనే బొగ్గు, ఐరన్ ఓర్ తరలిస్తారు. తాల్చేరు బొగ్గు గనుల నుంచి విశాఖ పోర్టుకు 7.7 రాక్‌లు, గంగవరం పోర్టుకు 7.7 రాక్‌లు, ఒడిసాలోని పారాదీప్‌కు 11.7రాక్‌లు, ధమర్ పోర్టుకు 9.5 రాక్‌లు, ఇతర పోర్టులకు 11 రాక్‌లు తరలిస్తుంటారు. 2015-16 లెక్కల ప్రకారం, ఐరన్ ఓర్ 14 రాక్‌లు తరలిస్తే కిరండల్-విశాఖ మార్గంలో 8.8 రాక్‌లు తరలించారు. అపారమైన మైనింగ్ నిల్వలు గల ఒడిసాలో రైల్వే వ్యవస్థను, ఓడ రేవులను అభివృద్ధి చేసుకోవాలని, ముఖ్యమంత్రి నవీన్ చాలా కృషి చేస్తున్నారు. మైనింగ్ ఆధారంగా రెండు 'మినరల్ రీచ్‌లు' ఏర్పాటుకు, రైల్వే శాఖకు ప్రతిపాదనలు పంపించారు. భూసేకరణ, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా, కొన్ని ప్రాజెక్టుల నిర్మాణ వ్యయంలో 50 శాతం భరిస్తామని కూడా ప్రకటించారు. ఏటా, 14 వేల కోట్ల రూపాయలను తెచ్చిపెట్టే ఈస్ట్‌కోస్ట్ జోన్, ఒడిసాకు గల సంపదల్లో కీలకమైనది. సహజంగానే దీన్ని వదులుకోవడానికి ఇష్టపడదు. అందుకే, ముఖ్యమంత్రి నేరుగా రంగంలోకి దిగారు. రైల్వే బోర్డుపై ఎం.పీ.లతో ఒత్తిడి పెంచారు. 2014 జూలైలో నాటి రైల్వే మంత్రి సదానందగౌడకు, స్వయంగా ముఖ్యమంత్రి లేఖ రాశారు. ప్రతిపక్షాలు కూడా అతనికి మద్దతు ప్రకటించాయి. రాజకీయంగా స్నేహంతోనూ, రాష్ట్ర ప్రజల తరపున ఆత్మగౌరవంతోనూ ఆయన పట్టుదల ఫలించిందనడానికి నిదర్శనం, కేంద్రం మన రాష్ట్రానికి జోన్ ప్రకటించకపోవడమే! దీనివెనుక, ప్రధాన కారణం నవీన్‌కు గల రాజకీయ ప్రతిష్ఠ. ఒడిసాలో 21 లోక్‌సభ స్థానాలున్నాయి. రాజ్యసభలో పదిమంది ఉన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో, మోడీకి ఎం.పి. సీట్లు ఎక్కువ తెచ్చిపెట్టే నమ్మకమైన మిత్రులు కావాలి. వారిలో నవీన్ ఒకరన్న విశ్వాసం మోడీ-బీజేపీకి వుంది.

ఆఖరి అస్త్రం రాయగడ డివిజన్

సిద్ధంగా 'రాయగడ' అస్త్రం

ఈస్ట్‌కోస్ట్ జోన్ ఆదాయంలో, సగం విశాఖ డివిజన్ నుంచే వస్తుందని చెబుతూ మనం ఒత్తిడి తెస్తున్నాం. మన ఆందోళన వెనుక, మన నిరుద్యోగులకు ఖుర్దా రోడ్ జంక్షన్‌లో జరిగిన అవమానాలు, విశాఖ కేంద్రంగా ఎదగడానికి గల వనరులు, జోన్ వస్తే ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్న ఆశ కూడా కారణాలు. కానీ, ఒడిసా తన ప్రయోజనాలను కాపాడుకోవడానికి అస్త్ర,శస్త్రాలను సిద్ధం చేసుకుంది. పురాణ కథనాల ప్రకారం, నేరుగా ప్రయోగించేది శస్త్రం, అది రాజకీయ ఒత్తిడి. దీనివల్లనే, చట్టప్రకారం రావలసిన జోన్‌ను కేంద్రం ప్రకటించలేకపోయింది. కానీ, 2019 ఎన్నికల్లో, ఏ ప్రభుత్వం ఏర్పడినా, జోన్ ఇవ్వక తప్పదు. ఇది నవీన్‌కూ తెలుసు. అందుకే, వ్యూహాత్మకంగా ప్రయోగించే 'అస్త్రాన్ని' కూడా సిద్ధం చేసుకున్నారు. అదే, 'రాయగడ' డివిజన్. దేశంలో కొత్తగా 12 జోన్‌లు, 28 డివిజన్లను ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉంది. ఆంధ్ర రాష్ట్రానికి జోన్ ఇస్తే, ఒడిసాకు చెందిన రాయగడ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదన సిద్ధం చేశారు. విశాఖ డివిజన్ పరిధిలో రాయగడ, కొరాపుట్ జిల్లాలున్నాయి. డివిజన్ పరిధిలోని 1606 కి.మీ. లైన్‌లో, 410 కి.మీ. ఆ రెండు జిల్లాల్లోనే ఉన్నాయి. విశాఖ డివిజన్ ఆదాయంగా మనం చెబుతున్న లెక్కల్లో, నాలుగువేల కోట్లు కిరండల్-కొత్తవలస లైన్‌ద్వారా వస్తుంది. రాయగడ డివిజన్ ఏర్పడితే, ఆ లైన్ విశాఖకు దక్కదు.

రాయగడ డివిజన్ కోసం, కొన్ని ప్రత్యేక పరిణామాలను కూడా నవీన్ ప్రభుత్వం నివేదికలో పొందుపరిచింది. ఆదివాసీ, వెనుకబడిన ప్రాంతాలకు రైల్వే, కమ్యూనికేషన్స్ సంబంధాలు లేకపోవడం వల్ల, రైల్వే ఆస్తులను తరచుగా మావోయిస్టులు ధ్వంసం చేయడం ప్రధానమైనది. గత ఏడాది ప్రధాని పర్యటన మే నెలలో ఖరారు కాగానే, సంబల్‌పూర్ డివిజన్‌లోని 'జోలికలు' అనే రైల్వే స్టేషన్‌పై మావోయిస్టులు దాడి చేశారు. నాగావళి, కళ్యాణి నదులకు వరదలు వస్తే, రాయగడ రైల్వే స్టేషన్‌ని ముంచెత్తడం, రైల్వే లైన్లు, వంతెనలు కొట్టుకుపోవడం తరచుగా జరుగుతుంటుంది. ఇటువంటి కారణాలు చూపించి, రాయగడ డివిజన్‌ను మంజూరు చేయించుకోవాలన్నది నవీన్ ప్రభుత్వ ఎత్తుగడ! ఆంధ్రప్రదేశ్ ప్రజల దౌర్భాగ్యం ఏమంటే, మన ముఖ్యమంత్రి దగ్గర శస్త్రమూ లేదూ! అస్త్రమూ లేదూ!?

వ్యాస రచయిత : సీనియర్ జర్నలిస్టు
73968 16430

అత్యాచారాలకు ఆడువారి బట్టలు కారణమా?

సందర్భం



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఆడవాళ్ళు రెచ్చగొట్టే దుస్తులు ధరిస్తున్నారు. అందుకే అత్యాచారాలు జరుగుతున్నాయి. ఇది మను మృగాళ్ళ మాట. చిన్నారులనూ చిదిమేస్తున్నారు. ముసలోళ్ళనూ హింసిస్తున్నారు. అంగాలే ఎదగని నెలల పిల్లలగొన్లు, ముడత శరీరాలను కప్పిన కంపు చీరలు కూడా "మగతనాన్ని" ఆకర్షిస్తాయా? రెచ్చగొడతాయా? ప్రగతిశీలుర ప్రశ్న?



ప్రదర్శనలోని అత్యాచార బాధితుల దుస్తులు

ఏ దుస్తులు ధరించావు?: అత్యుత్తమ విశ్వవిద్యాలయాల్లో ఒకటైన అమెరికా కాన్సాస్ యూనివర్సిటీ విద్యార్థులు ఒక సృజనాత్మక పథకం పాటించారు. దీని స్ఫూర్తితో అత్యాచార సమయంలో స్త్రీలుధరించిన బట్టలతో బెల్జియం రాజధాని బ్రస్సెల్స్ లో 'ఏ దుస్తులు ధరించావు?' అన్న శీర్షికతో ఒక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఇది అత్యాచార బాధితుల భయంకర కన్నీటి గాథలను కథనీకరించింది. మగమత్తులో మనసు మూసుకుపోయినవారి కళ్ళు తెరిపించింది. మహిళల దుస్తులు లైంగిక దాడులను ప్రేరేపిస్తాయన్న ఆలోచనను పటాపంచలు చేసింది. బ్రసెల్స్ లో నివారణ సేవల్లో పనిచేసే మహిళ డెల్ఫిన్ గూసెన్స్ తన, తన తోటి ఉద్యోగుల బట్టలను సేకరించి, తాను పనిచేసే బ్రసెల్స్ జిల్లా మోలెన్ బీక్ మారిటైమ్ కమ్యూనిటి సెంటర్ లో కాన్సాస్ ప్రదర్శనను ప్రతిబింబించే ప్రదర్శనను జనవరి 8 నుండి 20 వరకు ఏర్పాటు చేశారు. ప్రదర్శనలోని 18 రకాల దుస్తుల్లో పైజామాలు, స్నానాల బట్టలు, ట్రాక్ సూట్లు, పాఠశాల యూనిఫాం, పోలీసు వేషధారణ ఉన్నాయి. విజాతి ఆకర్షణలేని స్వజాతి మగదుస్తులేఎక్కువ. ఈ దుస్తులు చూసిన తర్వాతనైనా హింసకు, అత్యాచారాలకు గురైనవారి పట్ల ప్రజల మనస్తత్వం మారుతుందని ఆశిస్తానని, బట్టల ప్రభావ మేమీ లేదని, అత్యాచారం ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎవరికైనా జరగవచ్చని నిర్ధారణ అయిందని ప్రదర్శన తిలకిం చిన మహిళ లీస్బెత్ వర్బ్వెన్ అన్నారు.అత్యాచార సంస్కృతిపై పురుష సమాజంలో వ్యాపించిన అవాస్తవ ఊహాగాథలకు ప్రతిస్పం దనగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేశానని గూసెన్స్ చెప్పారు. ఆడపిల్లలకు జాగ్రత్తగా బట్టలేసుకొమ్మని చెపుతాం. మగపిల్లలకు మర్యాదగా మసలుకోమని బోధించం. ఏ బట్టలూ అత్యాచారా లను ఆపవనీ, మహిళలు (మగవారిలాగే) ఇష్టమొ చ్చిన దుస్తులు ధరించవచ్చని, తమ దుర్మార్గాలకు మృగవారు బట్టల సాకు చూపవద్దని ఆమె వ్యాఖ్యానించారు.

ఇది నా తప్పా? : ఇవన్నీ మహిళలందరూ వేసుకునే సాధారణ దుస్తులు. ఐనా లైంగిక దాడులు ఆగలేదు. "ఇది నా తప్పా?" అత్యాచారాలకు గురైన అమాయకస్త్రీలు బాధతో ప్రశ్నిస్తున్నారు. "చిన్ని గౌను కూడా అత్యాచారాన్ని ప్రేరేపించిందా?"బాధితులకు మద్దతు పలికే సామాజిక సేవా సంస్థ 'సివెడబ్ల్యు' సభ్యురాలు లీస్బెత్ కెన్స్ ప్రశ్నించారు."ఇది మగాళ్ళ సమాజం. స్త్రీలు, పిల్లలు కూడా మగప్రభావాలలో కొట్టుకుపోతున్నారు. ఆడపిల్లలు రెచ్చగొట్టే బట్టలేసుకుంటారని, సరసాలాడుతారని, పొద్దుపోయి సైకిళ్ళలో ఇళ్ళకు చేరుకుంటారని అంటారు. అత్యాచారాలకు, వేధింపులకు ఒకే ఒక వ్యక్తి బాధ్యుడు. అతనే వాటిని ఆపగలడు. అతనే నేరస్తుడు." అని ఆమె వాపోయారు.

మగవాంఛ ప్రపంచ వ్యాపితం : మానభంగాలు సార్వజనిక సమస్య. మానవాళిపై మాయని మచ్చ. 2015లో యూరోపి యన్ యూనియన్‌లో 2,15,000 లైంగిక హింసలు నమోద య్యాయి. అందులో 72 వేలు అత్యాచారాలు. బెల్జియన్ స్త్రీలలో 56% మంది లైంగిక హింసకు, 25% మంది బహిరంగ ప్రదే శాల భౌతిక వేధింపులకు గురయ్యారు. "బెల్జియంలో 10% అత్యాచారాలే పోలీసులకు నివేదించబడతాయి. 10% నింది తులే శిక్షించబడతారు. బాధితుల చేదు అనుభవాల వ్యక్తీకరణను సమాజం నిరుత్సాహపరుస్తుంది. జపాన్‌లో నిశ్శబ్ద సంస్కృతి వ్యాపించింది. అత్యాచారాలకు గురైన మహిళలెవరూ ఫిర్యాదు చేయరు. చేసినా నేరస్తున్ని నిర్బంధించరు, శిక్షించరు. మానభం గానికి గురైనవారిలో 70% మంది మిత్రులకు, కుటుంబ సభ్యులకు, సమీప ఆప్తులకు చెప్పుకోలేక పోయామన్నారు. 4% కంటే తక్కువ మంది పోలీసుల దగ్గరికెళ్ళారు. "జపాన్ మహి ళలు తమపై జరిగిన అత్యాచారాలకు తమనే నిందించుకుం టారు. తామే తప్పు చేశామనుకుంటారు." అని ఓచనోమిజు విశ్వవిద్యాలయ లింగాంశాల అధ్యయన గౌరవాచార్యులు తామీ క్రైనో బాధపడ్డారు. మాధ్యమాల అభ్యాసిని 28 ఏండ్ల షియోరి ఇటొ పై ప్రసార పాత్రికేయుడు 51 సంవత్సరాల నోరియుకి యమగుచి అత్యాచారం చేశాడు. ఇటొ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యమగుచి టోక్యో ప్రసార వ్యవస్థకు వాషింగ్టన్ బ్యూరో చీఫ్. జపాన్ ప్రధాని షింజో అబె జీవిత చరిత్ర రాశారు. విచారణ, దర్యాప్తు అధికారులు యమగుచి పై కేసు ఎత్తేశారు. 2017 డిసెంబర్‌లో యొకొహామాలో ఆరుగురు విశ్వవిద్యాలయ విద్యార్థులుసహ విద్యార్థినిని బలవంతంగా మద్యం తాపి సామూహిక అత్యాచారం చేశారు. విచారణాధికారులు కేసు వదిలేశారు. జపాన్‌లో అత్యాచారుల దోష నిర్ధారణ జరిగినా శిక్షలు పడవు, నేరస్తులు జైలుకు పోరు. జనవరిలో టోక్యో దగ్గరి చిబా విశ్వవిద్యాలయంలో ఇద్దరు విద్యార్థులు తోటి విద్యార్థినిని మద్యం తాపి అత్యాచారం చేశారు. టోక్యో యూనివర్సిటీలో ఇంకొక విద్యార్థి సహ విద్యార్థినిని మానభంగం చేశాడు. వీరి నేరాలు రుజువైనా శిక్షలు రద్దయ్యాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత జపాన్‌లో ఆడువారిపై అత్యాచారాలు పెరిగా యని ప్రధాని అబె అన్నారు. 2014లో జపాన్‌లో 15 మందిలో ఒక మహిళ, అమెరికాలో 5 మందిలో ఒకరు అత్యాచారానికి గురయ్యామని ఫిర్యాదు చేసినట్లుప్రభుత్వ సర్వేలలో తేలింది. అమెరికాలో 33% మహిళలు తమపై జరిగిన అత్యా చారాలను పోలీసులకు తెలిపారు. మా దేశంలో లైంగిక దాడులు తులనాత్మకంగా తక్కువని జపాన్ ప్రభుత్వం గొప్పలు పోతుంది. దక్షిణ నైజీరియాలో ఒక దరిద్రపు ఆచారముంది. భర్త చనిపోతే భార్యను శుద్ధి ప్రక్రియకు గురి చేస్తారు. భర్త శవంలో శరీర భాగాలను కడిగిన నీటిని భార్య తాగాలి. ఆ తర్వాత 7 రోజులు తిండి లేకుండా గదిలో బంధిస్తారు. ఆమె బతికితే అతని చావుకు ఆమె కారణం కాదని, మరణిస్తే భర్త అదృశ్య శక్తులు ఆమెను చంపేశాయని నిర్ణయిస్తారు. మన రాజకీయులు, చట్టనిర్మాతలు, మనువాదులు, మతాధి పతులు ఆడువారు అత్యాచారాలకు లోనయినప్పుడు మొద్దుగా బుద్ధులు మరిచి మాట్లాడుతుంటారు. నిర్భయ అఘాయిత్య సందర్భంలో హిందూ గురు ఆశారాం బాపు, సంఘ్ ప్రముఖుడు మోహన్ భాగవత్, మధ్య ప్రదేశ్ బీజేపీ మంత్రి కైలాస్ విజయ వర్గీయ, మహిళా శాస్త్రవేత్త డా.అనితా శుక్లా, బి.ఎస్.పి. ఎం.పి. షఫీక్ రహ్మాన్ బర్, తృణమూల్ ఎం.పి. కాకోలి ఘోశ్ దస్తీదార్, జమాత్ ఇ ఇస్లాం మతసంస్థ పెద్దలు అమానవీయంగా వ్యాఖ్యా నించారు. "భర్తలు, తండ్రులు లేకుండా సూర్యాస్తమయం తర్వాత బయటికి పోయే ఆడువారు గౌరవార్హులు కారు. పెట్రోలు మంటకు కారణమవుతుంది. చక్కెర చీమలను ఆకర్షిస్తుంది." సమాజ్ వాదీ పార్టీ నేత అబు అజ్మీ గతేడాది సూత్రీకరించారు. 2014లో మహారాష్ట్ర మహిళా హక్కుల సంఘం సభ్యురాలు, రాజకీయురాలు ఆశా మిర్గే అత్యాచా రాలకు ఆడువారి బట్టలే కారణమని నిందించారు. నిర్భయ రాత్రి సినిమాకెందుకెళ్ళాలి? ముంబయి శక్తి మిల్స్ సామూహిక అత్యాచారానికి గురైన మహిళ అక్కడికెందుకెళ్ళింది? అని ప్రశ్నిస్తూ ఆడువారి బట్టలు, ప్రవర్తన, వారు తగని స్థలాలకు పోవడమే అత్యాచారాలకు కారణమని తీర్మానించారు.

వనితా వలువలు కాదు మగ మనసులు మారాలి: "ఆడువారిని లైంగికద ృష్టితోనే చూడరాదు. మానవులుగా పరిగణించాలి. వారు శారీరక వాంఛలు తీర్చే వస్తువులు కాదు. మగాళ్ళ చేతి కీలుబొమ్మలు కాదు." అని సంప్రదాయ ముస్లిం దేశం నైజీరియా రచయిత అబూబకర్ ఆదాం ఇబ్రహీం అన్నారు. "మానభంగాలకు స్త్రీల దుస్తులే కారణమని చాలాకా లంగా సాకులు చెపుతున్నారు. ఇదితమ నియంత్రణాశూన్య తను, పశు శక్తి ప్రయోగాన్ని కప్పిపుచ్చుకోడానికి నేరస్తులు చేసే అపనింద.బాధ్యతను బాధితులపై నెట్టే బాధ్యతారాహిత్యం." అని మానసిక శాస్త్రజ్ఞులు, మానభంగాలు, లైంగిక వేధింపుల అధ్య యన నిపుణులు సంద్ర శుల్మన్ విశదీకరించారు.అత్యాచార మగాళ్ళు రొమ్ములిరుసుకొని తిరుగుతారు. దాడులకు గురైన స్త్రీలు, వారి పిల్లలు శారీరక, సామాజిక, సమస్యలకు, బాధలకు గురవుతారు. మగాళ్ళు మహిళలను అణగదొక్కడంలో చూపించే అతితెలువులను వనితా వికాసానికి ఉపయోగిస్తే ప్రపంచం మరో విధంగా ఉండేది.ఆడువారి బట్టలు వాంఛను రెచ్చగొట్టవు. మగబుద్ధి మారాలి. అమ్మా, చెల్లీ ఆడువారేనని, స్త్రీలు సమాజనిర్మాతలని, తోటి మానవులని గుర్తించాలి.

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యవర్గ సభ్యులు. సెల్ : 9490204545

బడ్జెట్‌లో వ్యవసాయం, విద్య, వైద్యానికి

హామీలే... నిధుల్లేవు

డా॥ సోము

ఫిబ్రవరి ఒకటవ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టి బడ్జెట్ వ్యవసాయం, విద్య, ఆరోగ్య తదితర రంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చేదిగా ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి నిధులు కేటాయింపులు. ఆచరణకు నోచుకోవనే అనుమానాలు కలుగుతున్నాయి. రైతుల గిట్టుబాటు ధరలు, రుణాలు, గ్రామీణ ఉపాధి పథకాలకు, ఆరోగ్యం, విద్యకు కేటాయింపులు ఏమాత్రం పెంచకపోగా, కేవలం ఎన్నికల సంవత్సరంలో ఆర్భాటంగా ప్రకటించుకొన్న పథకాలుగానే గోచరిస్తున్నది.

ఉదాహరణకు పంటల గిట్టుబాటు ధరలునే తీసుకొందాం. ఒక క్వింటాలు ధాన్యం పండించటానికి దాదాపు రూ.1800నుండి 1950 వరకు ఖర్చవుతుంది. కేవలం విత్తనాలు, ఎరువులు, కూలీల వేతనం, ట్రాక్టరు, పంపుసెట్లపై డీజిల్, విద్యుత్ ఖర్చులు మాత్రమే తీసుకున్నాం, రైతు కుటుంబం వెచ్చించిన శ్రమ పై కూలీ, కౌలు రైతు చెల్లించే అద్దె చేర్చలేదు. అది కలిపితే క్వింటాలు పండించటానికి ఖర్చు దాదాపు రూ.2,400కు చేరుతుంది. స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రకారం ఈ మొత్తం ఖర్చు (రూ.2,400) పై 50 శాతం అంటే ఒక క్వింటాలు ధాన్యానికి రూ.3,600 ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ బడ్జెటులో ప్రభుత్వ ప్రకటిత కనీస ధర రూ.1400 పైన అధికంగా ఉన్న 400 రూ॥లో 50శాతంగా అంటే క్వింటాలుకు రూ.1600 వరకు ప్రకటించి చేతులు దులుపుకునే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యమైన విషయమేమిటంటే రైతు ఆదాయం రెట్టింపు 2022 నాటికి సాధించటానికి కనీసం రానున్న 4 సంవత్సరాలు సాలీనా కనీసం రెండున్నర లక్షల కోట్ల రూపాయలు నిధులు వెచ్చించాలి. విశేషమేమంటే కేంద్ర ఆర్థిక మంత్రి పెరిగే మద్దతు ధరల ఆచరణకు నిధులు ఏమీ ప్రకటించపోవటం.

ఇక రెండవ విషయం "ఈనమ్" ఎలక్ట్రానిక్ మార్కెట్ యార్డులు 20 వేలు ఏర్పరచటానికి కేవలం రూ. రెండు వేల కోట్ల రూపాయలు కేటాయించటం. మద్దతు ధర కంటే మార్కెట్‌లో ధర తగ్గిపోతే రైతు రక్షణకు కేటాయించిన మార్కెట్ ధర నిర్ధారణ నిధులు కేవలం 2 వేల కోట్లు చాలా తక్కువ.

ఇక వ్యవసాయ రుణాల మాటకొస్తే కేటాయించిన రూ.11 లక్షల కోట్లు గత ఐదారు సంవత్సరాలుగా ప్రకటిస్తూ వస్తున్న 12 లక్షల కోట్ల రూపాయలతో పోల్చుకుంటే ఏ మాత్రం అధికం కాదు. బ్యాంకులు 82 శాతంగా ఉన్న చిన్న, సన్నకారు రైతులకు కేవలం 27 శాతం రుణాలిస్తూ, ధనిక భూస్వామ్య రైతులకు, వ్యవసాయ రుణాలు పేరిట కోళ్లఫారాలకు, గిడ్డంగుల యజమానులకు, అఖరికి జౌళి మిల్లులకు సైతం మిగిలిన 77 శాతం కట్టబడుతున్నాయి. పైగా దేశంలో దాదాపు కోటిన్నర వరకు ఉన్న కౌలురైతులకు బ్యాంకులు అప్పులు ఇవ్వటం లేదు. దీనికి బదులుగా సీజనులో ఆకాశాన్నంటుతున్న విత్తన, ఎరువులు (డీఏపీ బస్తా ఇటీవల రూ.1050 నుండి 1250 కి పెరిగింది). ధరలపై నియంత్రణ పెట్టి, ఉత్పత్తి ఖర్చులపై సబ్సిడీ ఇచ్చి పంట ఖర్చులు తగ్గించటం ద్వారా రైతుకు ఊరట లభిస్తుంది.

ఇక ఆరోగ్య బీమాపై ప్రకటించిన పథకాలు కొత్తవేమీ కాదు. గతంలో ఆంధ్రప్రదేశ్‌లో ఆరోగ్యశ్రీ, "గుజరాత్‌లో 'చింతన' పథకాల వల్ల ప్రజలు వైద్యంపై పెట్టే ఖర్చు పెద్దగా తగ్గలేదు. కానీ ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రులు, బీమా కంపెనీలు విపరీతంగా లాభపడ్డాయి. కార్పొరేటు హాస్పటల్స్ వసూలు చేసే బిల్లుల పైన ప్రభుత్వ నియంత్రణ లేనంత కాలం ఈ దోపిడీ కొనసాగుతునే ఉంటుంది. గ్రామాల్లో ప్రాథమిక వైద్యశాలలో ప్రభుత్వ పని మెరుగు పర్చటానికి నిధులు కేటాయించపోవటం విచారకరం.

ఇక ప్రకటించిన ఉజ్వల, గ్రామీణ పారిశుద్ధ్య పథకాలు వినటానికి బిగ్గరగా, జనరంజకంగా వినిపిస్తున్నా వాటి అమలుకు నిధులు కేటాయింపు నామమాత్రం. ప్రతిపాదించిన 2 కోట్ల టాయిలెట్ల నిర్మాణానికి, కోట్ల ఉచిత గ్యాసు కనెక్షన్లకు (ఉజ్వల) పథకాలకు ఏమాత్రం అధిక నిధులు కేటాయించకపోవటం ఆశ్చర్యకరం.

నోట్ల రద్దు తర్వాత నిరుద్యోగం పెరిగి గ్రామీణ ఉపాధి పథకానికి డిమాండు అధికమయింది. రాష్ట్ర ప్రభుత్వాలు డిసెంబరు చివరకు మొత్తం నిధులు ఖర్చు చేసి ఇక నిధులు లేక పనులు కల్పించటం లేదు. గ్రామీణ ఉపాధి పథకానికి గత బడ్జెట్ వలే కేవలం రూ.55 వేలకోట్లు, (ఏమాత్రం పెంపులేకుండా) ప్రకటించటం ఆశ్చర్యకరం.

నాలుగు సంవత్సరాల క్రితం మోడీ ప్రభుత్వం గ్రామీణ సంక్షోభం, నిరుద్యోగం హక్కులు సాధికారికత, నవభారతం వంటి ఆశలు కల్పించింది. కానీ గత నాలుగు సంవత్సరాల్లో సాధించింది. స్వల్పం మాత్రమే. కాగా ఒక శాతం ధనికులు వద్ద 73 శాతం దేశ సంపద పోగుపడింది.

ఈ బడ్జెట్‌లో కేవలం పెద్దపెద్ద వాగ్దానాలు రానున్న ఎన్నికల ప్రచారానికి చేయబడ్డాయి. కానీ వాస్తవంలో ఆచరణకు నిధుల కేటాయింపులు నామమాత్రం.

విశాలాంధ్ర
బతుకు
The Life
శనివారం
03 ఫిబ్రవరి 2018



సమాన పనికి సమాన వేతనం కావాలి!

సమాన పనికి సమాన వేతనం కావాలని డిమాండ్ చేస్తే ఆందోళనకు దిగిన ఈ మహిళలంతా బీహార్‌కు చెందినవారు. వీళ్లంతా బీహార్ వైద్య, ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్నారు.

మధురాతి మధురం

ఉప్పగప్పరంబు నొక్కపోలికనుండు
చూడచూడ రుచుల జాడవేరు
వంటలందు వక్కలగడ్డ వంటవేరయ...

నిజమే ఆంధ్రదేశంలో వివిధ ప్రాంతాలు వివిధ రకాల వంటకాలకు ప్రసిద్ధి చెందాయి. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలంలోని వక్కలగడ్డ మాత్రం ఏదో ఒక వంటకు కాదు, అన్ని రకాల స్వీట్లు, కారప్పొడులు, అప్పడాలు పచ్చళ్లకు ప్రపంచ ఖ్యాతి పొందింది. ఈ వంటకాల వెనుక నలభీములెవరూ లేరు, అంతా మహిళలే. ఇదేదో సంప్రదాయంగా అబ్బిన కళ కాదు. వారసత్వంగా వచ్చిన విద్య కాదు. మహిళా సాధికారత లక్ష్యంగా ఆ గ్రామంలో పెద్దలు ఏర్పాటుచేసిన కమలానెహ్రూ మహిళా మండలి నేతృత్వంలో గ్రామపెద్దలు, కమ్యూనిస్టు నేతల ప్రోత్సాహంతో కాచివడపోసిన అనుభవం ద్వారా మధురాతి మధురం హోం ఫుడ్స్ తయారవుతున్నాయి. ఆ అమ్మల చేతిలో ఏం మాయ ఉందో ఏది చేసినా.. ఆహా ఏమి రుచి..తినరా మైమరచి అన్నట్లు ఉంటాయి. రుచి, శుచి, నాణ్యత, చౌక ధర ఉంటే ఆ ఆహార పదార్థాల అమ్మకాలకు తిరుగేముంటుంది. ఆ కృషి పాలపొంగులా పరవళ్లు తొక్కుతూ పూతరేకులా లాభాల తీపినందిస్తోంది. ఐదుగురితో ప్రారంభమైన ఈ హోం ఫుడ్స్ ఇప్పుడు ఎంతోమందికి ఉపాధిని కల్పిస్తోంది. స్వశక్తిని నమ్ముకునే, స్వావలంబన కోరుకునే మహిళలకు అండగా నిలుస్తోంది. ఎందరో మహిళలకు ఆర్థిక చేయూతనందిస్తోంది ఈ మధురం హోం ఫుడ్స్. వక్కలగడ్డ గుబాళింపులు విదేశాలకు వ్యాపించిందంటే దాని ప్రత్యేకత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనేముంది...







ఈ మధురం హోం ఫుడ్స్ ప్రారంభం వెనుక కమలా నెహ్రూ మహిళా మండలి వారి స్ఫూర్తి, కమ్యూనిస్టు నేతలు, గ్రామ పెద్దల ప్రోత్సాహం ఉంది. ఇది లాభాల కోసం పెట్టింది కాదు. మహిళల స్వావలంబన, సాధికారత కోసం ఏర్పాటుచేశాం. ఇక్కడ అందరం మహిళలమే పనిచేస్తున్నాం. ఇప్పుడు మా కృషి ఫలించింది. విదేశాలకు కూడా మా స్వీట్లు, పచ్చళ్లు ఎగుమతి అవుతున్నాయి

' హోం ఫుడ్స్ నిర్వాహకురాలు మల్లుపెద్ది రత్నకుమారి

అమ్మ చేతి వంట అమృతమంటారు. కొందరు అమ్మలు, పిన్నులు, అమ్మమ్మలు కలిసి పొయ్యి వెలిగించి, మూకుడు పెట్టి వంట చేస్తే.. అది మధురాతి మధురమే కదా. అదే ఈ మధురం హోం ఫుడ్స్. ఏ స్వీట్‌స్టాల్ చూసినా తయారుచేసేవాళ్ళ నుంచి విక్రయించేవాళ్ళ వరకూ అంతా పురుషులే కనిపిస్తారు. ఇందుకు భిన్నం మధురం హోం ఫుడ్స్. ఇక్కడ తయారీ నుంచి అమ్మేవాళ్ళవరకూ మొత్తం నిర్వహణ అంతా మహిళలదే. అసలు ఈ హోం ఫుడ్స్ ఏర్పాటే విభిన్నమైన ఆలోచన నుంచి వచ్చింది. ఈ హోంఫుడ్స్‌ను నిర్వహిస్తున్నవాళ్ళంతా కూడా శ్రీ కమలా నెహ్రూ మహిళా మండలి సభ్యులే. ఈ ప్రాంతంలోని మహిళలకు ఆర్థిక చేయూతనివ్వడం, స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నదే ఈ కమలా నెహ్రూ మహిళా మండలి. ఈ మహిళా మండలి నిర్వహణా ఖర్చుల కోసం ఏదైనా చెయ్యాలనే ఆలోచన నుంచే ఈ హోం ఫుడ్స్ వచ్చింది. ఈ క్రమంలో వక్కలగడ్డలో మొత్తం మూడు హోం ఫుడ్స్ ఏర్పాటయ్యాయి. ఈ మూడింటినీ మహిళా మండలి సభ్యులే నిర్వహిస్తుండడం విశేషం. అవి మధురం, రుచి, సాయి ఫుడ్స్. అన్నింటికంటే ఎక్కువ పేరుప్రఖ్యాతులు సంపాదించింది మధురం హోం ఫుడ్స్.

ఈ హోం ఫుడ్స్ 2003లో ఏర్పాటైంది. 14 ఏళ్ళుగా నిర్విరామంగా నడుస్తూనే ఉంది. రూ. 500ల పెట్టుబడితో కేవలం ఐదుగురు సభ్యులతో ప్రారంభమైన ఈ హోం ఫుడ్స్ ఇప్పుడు ఎంతోమందికి ఆర్థిక ఆసరాను కల్పిస్తోంది. తొలి రోజుల్లో ఎన్నో కష్టనష్టాలను చవిచూసినప్పటికీ నిబ్బరంగా ఎదుర్కొని నిలబడ్డారు ఈ మహిళామండలి సభ్యులు. ఇందులో ప్రస్తుతం 25 మంది సభ్యులు పనిచేస్తున్నారు. వక్కలగడ్డలోనే కాదు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి, నగరాల నుంచి కూడా వీళ్ళకు ఆర్డర్లు వస్తుంటాయి. పండగలు, వేడుకల సమయాల్లో మరింత ఎక్కువ ఆర్డర్లు వస్తుంటాయి. విదేశాల నుంచీ ఈ మధురం హోం ఫుడ్స్‌కు ఆర్డర్లు వస్తాయంటే వీరికున్న డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. కారణం ఇక్కడ ఇతర స్వీట్‌స్టాల్స్‌లో మాదిరిగా వాడిన నూనెను అసలు వాడరు. నాణ్యతకే ప్రాధాన్యతనిస్తారు. ఇంట్లో తయారుచేసుకున్న మాదిరిగానే అలాంటి రుచినే అందిస్తారు.

మహిళలకు ఆర్థిక చేయూత, స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్న మహిళా మండలి సభ్యుల ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ మధురం హోం ఫుడ్స్‌కు కొన్ని ప్రత్యేకతలూ ఉన్నాయి. ఇక్కడ పనిచేసేవారందరికీ ఏటా బోనస్‌లు, యూనిఫాంలు ఇస్తారు. నెలవారీ జీతాలతో పనిచేసేవారు ఇక్కడ రోజువారీ వేతనాలకు పనిచేసేవారూ ఉన్నారు. పండగల సమయంలో, ఎక్కువ పిండివంటల తయారీకి ఆర్డర్లు వచ్చినప్పుడు అదనపు పనివాళ్ళను చేర్చుకుంటారు. రూ. 5 వేలు నుంచి రూ. 10 వేలు వరకూ జీతాలు అందుకునేవాళ్ళు ఇక్కడ ఉన్నారు.

ఆడుతు పాడుతూ పనిచేస్తూంటే అలుపూసొలుపేముంది అన్నట్టు ఉంటారు ఇక్కడ పనిచేసే మహిళలంతా. ఇక్కడ ఎవరిని కదిలించినా ఇది వారి సొంత ఇల్లు అన్నట్టే మాట్లాడతారు. అదే ఈ హోం ఫుడ్స్ ప్రత్యేకత. ఇష్టపడి చేసే పనిలో ఎంత ఆనందముందో ఇక్కడ ఉన్నవాళ్ళను చూస్తే ఇట్టే అర్థమైపోతుంది. "ఇక్కడ వంట చెయ్యడమే ఇష్టం. ఇంటి దగ్గర ఉండాలన్నా ఉండలేం. ఇదే మా ఇల్లులా ఉంటుంది. పనిలోనే ఆనందం ఉంది. ఇక్కడ అంతా కలిసిమెలిసి ఉంటాం. కష్టసుఖాలన్నీ కలబోసుకుంటాం. సమష్టిగా ఉంటాం" అంటారు ఇక్కడ పనిచేస్తున్న 60 ఏళ్ళు పైబడిన ఓ వృద్ధురాలు. కలసికట్టుగా పనిచేస్తే విజయాన్ని ఎంత అలవోకగా



అందుకోవచ్చునన్నది ఈ మధురం హోం ఫుడ్స్ నిర్వాహకులు, పనివాళ్ళను చూస్తే అర్థమవుతుంది. ఈ ఉపాధితో వాళ్ళ జీవితాలను బాగు చేసుకోవడమే కాదు, ఆర్థికంగా నిలదొక్కుకోవడమే కాదు మరింతమందికి స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ మహిళలు.

ఈ మధురం హోం ఫుడ్స్‌లో బెంగాలీ స్వీట్స్ కోవా ఐటమ్స్ నుంచి అన్ని రకాల పిండివంటలూ దాదాపుగా 70 రకాల వరకూ అందుబాటులో ఉంటాయి. వీటితోపాటు పచ్చళ్ళు, కారాలు, మసాలా పొడులు, ఉలవచారు, ఒడియాలు, అప్పడాలు తాజాగా తయారుచేస్తారు. మామూలు పచ్చళ్ళే కాదు చికెన్ ఆవకాయ, మటన్ ఆవకాయ, రొయ్యల ఆవకాయ లాంటి నాన్‌వెజ్ ఐటమ్స్ ఇక్కడ లభ్యమవుతాయి.

\- జ్యోతి



షెల్స్ శాండిల్స్ !

కుచ్చులు, మువ్వలు, లేసులు ఇలా రకరకాల మోడల్స్‌లో చెప్పులు చూసి ఉంటారు, తొడిగి ఉంటారు. మరి గవ్వల చెప్పులు ఎప్పుడైనా చూశారా! పాదరక్షల్లో న్యూ ట్రెండ్ ఇదే. ఫ్లాట్ మోడల్స్‌లోనే కాదు హీల్స్‌లోనూ ఈ గవ్వలు పొదిగిన మోడల్స్ వస్తున్నాయి. రెండు రకాల రంగులు, విభిన్న డిజైన్లుతోనూ ఇవి ముచ్చటగా కనిపిస్తున్నాయి. మీరూ ఓ లుక్కేయండి మరి! నచ్చాయా....అయితే మరి కొనడానికి మార్కెట్‌కి బయలురేరండి ఇక!











ఆహా...అల్పాహారం!

ఉదయాన్నే తీసుకునే టిఫిన్ పోషకాలతో కూడినదై ఉండాలి అని అందరూ చెబుతారు. కానీ ఏం తినాలంటేనే ఒక్కరూ సరైన వివరణ ఇవ్వరు. ఇలాంటి మీమాంస మీకూ ఉందా? రోజూ తినే అల్పాహారం తినబుద్ధి కావడం లేదా? అయితే కొంచెం వెరైటీగా, దాంతో పాటు మంచి పోషకాలతో కూడిన ఈ టిఫిన్‌లను ఇంట్లోనే తయారు చేసుకోండి. ఆహా...ఏం రుచి అంటూ ఎంచక్కా ఆరగించేయండి.



చనా దోశ!



ఇది అందరికీ మంచి అల్పాహారమనే చెప్పాలి.. అన్ని వయస్సుల వారూ, ఆ మాటకొస్తే డయాబెటీస్ రోగులూ దీనిని భేషుగ్గా లాగించేయవచ్చు. ఇది షుగర్ పెరగకుండా అదుపు చేయడమే కాదు గుండె ఆరోగ్యాన్నీ పదిలంగా ఉంచుతుంది. పెసరట్టులో మాదిరిగానే ఇందులోనూ ఎక్కువ ప్రోటీన్లు, కాల్షియం ఉన్నాయి. మరి దీని తయారీవిధానం తెలుసుకుందామా!

కావలసిన పదార్థాలు

ఒక కప్పు బియ్యం, ఒక కప్పు శనగలు, అల్లం చిన్నముక్క, రెండు పచ్చిమిర్చి, అర టీ స్పూన్ జీలకర్ర, సరిపడ నూనె


తగినంత ఉప్పు, దోశ మీద చల్లేందుకు

ఒక క్యారట్ తురుము, అరకప్పు ఉల్లిపాయ ముక్కలు, రెండు పచ్చిమిరపకాయలు,

తయారీ విధానం

బియ్యం, శెనగలు వేర్వేరుగా రాత్రిపూటే నానబెట్టాలి. సమయం సరిపోకపోతే కనీసం సెనగలు ఎనిమిది గంటలు, బియ్యం మూడు గంటలు నానబెట్టాలి. ఈ రెండింటితో పాటు అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, ఉప్పు, సరిపడ నీళ్ళు పోసం గ్రైండర్‌లో వేసి మెత్తగా చేయండి. ఈ పిండిలో కొద్దిగా నూనె కూడా కలుపుకోవచ్చు. పిండి చిక్కగా ఉంటే దోశలు మందంగా వస్తాయి. పిండి పలచగా ఉంటే దోశలు కరకరలాడుతూ వస్తాయి. మీకు ఎలా ఇష్టమైతే అలా దోశల పిండిని రెడీ చేసుకోండి. పొయ్యి మీద పాన్ పెట్టి ఒక టీ స్పూన్ ఆయిల్ వేసి కాగాక క్యారట్ తురుము, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిరపకాయ ముక్కలు, కొద్దిగా ఉప్పు వేసి వేయించండి. వీటిని ఒక ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టుకోండి. పచ్చిగానే తినడానికి ఇష్టపడేవారు వీటిని వేయించక్కర్లేదు. ఇవన్నీ సిద్ధం చేసుకున్న తర్వాత పొయ్యి మీద పాన్ పెట్టి వేడిక్కిన తర్వాత కొద్దిగా ఆయిల్ వేసి కాగనివ్వాలి. ఆ తర్వాత ఇక గరిటె నిండుగా పిండి తీసి దోశలు పోసి కాల్చుకోవడమే. ఒక వైపు కాలిన తర్వాత రెండోవైపు తిప్పి దానిమీద క్యారట్, ఉల్లిముక్కలు చల్లాలి. రెండోవైపు వేగిన తర్వాత దానిని మడతపెట్టి ప్లేట్‌లోకి తీసుకోవడమే. అంతే చనా దోశ రెడీ. మీకు ఇష్టమైన చట్నీతో దీనిని వేడివేడిగా ఆరగించడమే.

అటుకుల పొంగలి



దక్షిణాది అల్పాహారాలన్నింటిలో అత్యంత ఆరోగ్యకరమైనదీ, పోషక విలువలు ఉన్నది ఏదీ అంటే అటుకుల పొంగలి అని చెప్పుకోవచ్చు. ఇది చాలా సులభంగా జీర్ణమవుతుంది. కడుపులో నొప్పి లేదా పొట్టకు సంబంధించిన ఇతరత్రా అనారోగ్య సమస్యలు ఉన్నవారు కూడా ఈ అటుకుల పొంగలిని భయం లేకుండా తినవచ్చు. అటుకుల ఉప్మా లేదా అటుకులతో చేసే ఇతరత్రా వంటకాల కంటే కూడా ఇది రుచిగా ఉంటుంది. చిన్న పిల్లలూ దీనిని బాగా ఇష్టపడతారు. ప్రోటీన్లతో కూడిన మంచి అల్పాహారం ఇది. ఈ అటుకుల పొంగలిలో ఉపయోగించే పదార్థాలన్నీ కూడా జీర్ణక్రియ సమస్యలను తొలగించేవే. ఇన్ని ప్రయోజనాలు ఉన్న అటుకుల పొంగలి నోటికి కొత్త రుచినీ అందిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

కావలసిన పదార్థాలు

అటుకులు రెండు కప్పులు, పెసరపప్పు ఒక కప్పు, అల్లం ముక్క చిన్నది, నల్ల మిరియాలు ఒక టీ స్పూన్, జీలకర్ర రెండు టీ స్పూన్‌లు, పసుపు అర టీ స్పూన్, జీడిపప్పులు కొద్దిగా, కరివేపాకు సరిపడ, కొత్తిమీర తరుగు కొంచెం.

తయారీ విధానం

పెసరపప్పులో కొద్దిగా ఉప్పు వేసి ఉడికించండి. మరీ ఎక్కువ ఉడికిపోకుండా ఉండాలంటే దీనిని మైక్రోవేవ్‌లో ఉడికించండి. పప్పు కొంచెం పలుకుగా ఉంటే తినడానికి బాగుంటుంది. అటుకులు మెత్తగా అయ్యేందుకు కొంచెం ముందుగా వాటిని నీళ్ళల్లో వేయండి. ఐదు నిముషాల తర్వాత నీటిని వంపేసి పక్కన పెట్టుకోండి. పొయ్యి మీద పాన్ పెట్టి కొద్దిగా నూనె వేసి కాగాక జీలకర్ర, మిరియాలు, కరివేపాకు, జీడిపప్పులు వేసి వేయించండి. ఇందులో అల్లం తురుము, పసుపు కూడా వేయండి. ఇవన్నీ వేగిన తర్వాత చివరగా పెసరపప్పు, అటుకులు కూడా వేయండి. పైన కొద్దిగా ఉప్పు చల్లి మొత్తం అన్నీ బాగా కలపండి. ఆ పైన కొత్తిమీర తరుగు చల్లడమే. అంతే అటుకుల పొంగలి రెడీ. ఇది పొడిపొడిగా ఉంటుంది. ఇలా కాకుండా ఇదే పొంగలి ముద్దలా కావాలనుకుంటే చివరలో కొద్దిగా నీళ్ళు పోసి ఐదు నిముషాలు ఉంచండి. మీకు ఇష్టమైన రీతిలో అటుకుల పొంగలి సిద్ధమైపోతుంది.

అతడు-ఆమె

62



డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

జరిగిన కథ

ఈ గల్లీ! సూర్యుడు చొరబడడానికి సందు లేదు. ఇందులోనే ఎడ్లబళ్ళు - బరువు మోసే కూలీలు - బుడ్డిదీపం పెట్టుకుని మిఠాయి రథాలు - ఒంటెలులాగే బళ్ళు - చెత్తకుప్పలలో మూతులు పెట్టి అరి టాకులులాగి తింటూవున్న ఆవులు- గుజ్జుపు జక్కాలు - వీళ్ళ కాళ్ళలో పడుతూ ఆడు కుంటున్న పిల్లలు!...

ప్రొద్దున్న చూచాను - రెండు గల్లీల తరువాత - పెద్ద కోఠీ. సుప్రసిద్ధుడైన యునానీ వైద్యుడిదట. శుక్రవారం జుమ్మా బిచ్చం అందుకోవడానికి వరుసలు తీర్చి దర్వాజా ఎదురుగా కూర్చున్నారు బిచ్చం అడుక్కునేవారు - గుడ్డివారు - కుంటివారు - గూండాలు - సోమరిపోతులు.

(నిన్నటి సంచిక తరువాయి)

సింహద్వారంలోనుంచి కనిపిస్తుంది - చక్కని తోట - గులాబీలు - చేమంతులు - జాజులు - మల్లెలు - ముద్దగన్నేరు - పారిజాతం - దానిమ్మ పువ్వులు, జిలుగులు చెక్కిన చలువ రాతి వసారాలు - ఎరుపురాతి జాలు గుమ్మీలు- బాల సూర్యుని కిరణాలలో మెరుస్తూన్న నీటిధారలు, లోపలి దర్వాజాలో నిలిచి వున్నాయి. నాలుగైదు పెద్ద కారులు. "లా అల్లా - రాసూ - లల్లా! అల్లా - ఇన్‌షల్లా! లా అల్లలుల్లా - లా అల్లా!"

తురకల భోగము - తురకల దరిద్రము! దర్వాజా బైట - దర్వాజా లోపల ఎంతటి వ్యత్యాసం! నాకు వుండబుద్ధి పుట్టలేదు - నా స్థానం కూడా దర్వాజా వెలుపలనే అనిపించింది.

చాందినీచౌకు వచ్చాను. హనుమంతుని కోవెల., బైట చలివేంద్రం. ఒక బైరాగి ఇనుపగొట్టంలోకి నీళ్ళు పోస్తున్నాడు దోసిళ్ళతో దాహం తాగుతున్నారు హనుమంతోపాసకులు. వాసుదేవుడి కొడుకు - అంజనీదేవి వ్రతం వల్ల పుట్టినవాడు - రామబంటు. అతను మయిలబడిపోతాడు - వీళ్ళందరూ కోవెలలోపలికి వెళితేను. బైటవుండే సిందూరం తిలకం పెట్టుకుని పోతున్నారు. పాపాయి బొట్టు పెట్టమని ఏడ్చింది. నేను పెట్టలేదు. గాంధీమహాత్ముడు దిగ్విజయానికి బయలుదేరేటప్పుడే తిలకం పెట్టుకోవ డానికి వొప్పుకున్నారుట!

ఆడది ఒంటిగా వీధులమ్మట తిరగడం వీళ్ళం దరికీ విడ్డూరంగా వుంది!

వీళ్ళందరి చూపులు నామీదే వాలుతున్నాయి. నా కాళ్ళు తొట్రుబడుతున్నాయి. చలి వణికిస్తూ న్నప్పటికి ముఖం అంతా చమట. హల్వాయి దుకాణం కనబడితే - పిల్లలిద్దరితో లోపలికెళ్ళి బల్ల దగ్గర కూర్చున్నాను. అతని జీవితంలో ఎప్పుడూ ఇటువంటి అనుభవం తటస్థపడనట్టుంది. ఆపాద మస్తకం నన్ను తేరిపార చూశారు. సలసల మరుగు తూన్న కోవాపాలను కలపడం మర్చిపోయాడు. మిఠాయిమీద వాలుతూన్న కందిరీగలను ఈత రెమ్మ తో తోలడం మర్చిపోయాడు అతని నవుకరు. తమలపాకుల్ని నాలికతో అందుకుని పోయింది దారెమ్మటపోయే ఆవు. ఆవుని తోలడం మర్చిపోయా డు గిన్నెలు కడిగే కుర్రాడు.

పాపాయికి, సుభకి పాలు కావాలన్నాను. పావుభర్ పాలు రెండు గాజు గళాసులలో ఇచ్చాడు. బూరాపంచదార వేసి పుర్వాలో ఇమ్మన్నాను. నేను రెండు గులబీజాములు తిన్నాను.

గులాబీజాములు తింటున్నంతసేపు శాస్త్రీ జ్ఞాపకం వచ్చాడు. అతనికిప్పుడు ఫలహార వేళ - తప్పకుండా పొలబారి వుంటుంది. నేను తనను తలచుకుంటున్నానని అనుకుంటాడు. నా ఆవేదన అతనికి అర్థం అయిందో లేదో? కోపం వచ్చి వెళ్ళిపోయాననుకుంటాడు. నాకు కోపంలేదు. ప్రపంచాన్ని తేరిపార చూడటానికి నాకు భయం. గడుసుదనం - లౌక్యం - వ్యవహార సరళి - అనుమాయతలు - నాకు తెలియవు. వాటిని సహించ లేను. "నొప్పింపక తానొవ్వక తప్పించుకు తిరుగువాడు" - అంటే నాకు గిట్టదు... అందరి స్నేహితుల మధ్య వున్నా శాస్త్రి వంటరిగానే వుంటాడు- పాపం.



నేను ఈ "లస్సీ" త్వరగా త్రాగి ఇక్కడనుంచి వెళ్ళిపోతేనే మంచిది - నన్ను చూడడానికి జనం మూగుతున్నారు : సిగ్గు బిడియం విడిచి యీ స్త్రీ ఇంత బరితెగిపోయి బహిరంగంగా విచ్చలవిడిగా తిరుగుతూందే - అనుకుంటున్నారు! ఒక్కొక్క దేశం - ఒక్కొక్క మర్యాద - ఒక్కొక్క నియమం- ఒక్కొక్క కాలం - ఒక్కొక్క నీతి. ఆధునికం మధ్య యీ సనాతనం - పురాతనం మధ్య నేను నూతనం.

...వీళ్ళదృష్టికి నిలబడలేకుండా వున్నాను. దృష్టి తగలడం అంటే ఇదేనా ఏమిటి? నానరాల బలం అంతా ఆర్చుకు పోయింది- గడ్డిపోచలాగున్నాను. మా వెంట వస్తూన్నారు అల్లరిపిల్లలు - గూండాలు.. ఇదిగో యీ దుఖాణంముందు త్రివర్ణ పతాకం ఎగురుతూంది. ఖాదీభాండారం. ఇందులోకి వెళితే యీ అల్లరిగుంపు నుంచి తప్పించుకోవచ్చు.

80 అతడు

చిన్నపాళయం శ్రోత్రియందారు రామయ్యంగారి క్లయింటు. నేను రామయ్యగారి క్రింద పని నేర్చుకుంటున్నప్పుడు శ్రోత్రియం దారుగారికి ఆయన భార్య ఆండాళ్ళమ్మగారికి ఏవో గృహచ్ఛిద్రాలు వచ్చి పొత్తు కుదరలేదు. గృహచ్ఛిద్రాలేమిటి? ఆయనది పూర్వకాలం, అంతేన సానులంటే సరదా! దానాదీనా ఆయన ఆవిడ రెండేళ్ళపాటు వేరుపడిపోయి-ఆవిడ పుట్టింటికి వెళ్ళిపోయింది.

తరువాత సర్దుకుని ఆవిడ పెనిమిటి దగ్గర కొచ్చేసింది. అప్పుడు ఉభయపక్షాల వకీళ్ళు మధ్యవర్తులుగా వుండి రాజీపత్రం వ్రాయించారు. అందులో షరతుల క్రింద యీ ప్రకారం ఉదహరించేరు : "మళ్ళీ ఈ రాజీ దరిమిలా భార్యాభర్తలు వేరుపడిన పక్షమందు, ఫలానా సర్వే నంబరున్న ఇన్నిఎకరములు, ఇన్నిసెంట్లు విస్తీర్ణముగలదిన్నీ అయినటువంటి ఫలానా శ్రోత్రియముల నుండి వచ్చే భూ ఫలసాయం కేటాయింపు చేసి భార్య మనోవర్తి నిమిత్తం గాను ఆమెకు నేను ఇవ్వగలవాడనూ"- అని. రాజీపత్రం స్టాంపు కాగితం మీద వ్రాసి రిజిస్ట్రీ చేయించుకొన్నారు. సరి-మరి రెండేళ్ళు గడిచేక మళ్ళీ ఆయన యథాప్రకారం నృత్య కళని అభినయకళని పోషించడం ఆరంభించాడు. ఆవిడ మళ్ళీ కన్నవారింటికి వెళ్ళిపోయింది.

అప్పుడే ఎనిమిదేళ్ళయింది. ఖరారునామా ప్రకారం ఆవిడకి ఇవ్వవలసినది ఇవ్వనన్నాడు శ్రోత్రియందారుగారు. ఇప్పుడు ఆవిడ తనకు రావలసిన పైకం అసలు వాయిదాలతో గుజస్తు తారీఖునుంచి లెక్కకట్టి వడ్డీ మింజుమలై ఇరవైఎనిమిదివేలకిన్నీ, రాజీపత్రం షరతులు అమలు పరచడానికిన్నీ దావా పడేసింది. సబు కోర్టులో ఆవిడ డిక్రీ పొందింది.

మొదటి దగ్గరనుంచి నాకీ వ్యవహారం తెలిసివుండడం చేతనూ ఇతరత్రా ఆయన కోర్టు వ్యవహారాలు నేనే చూస్తుండడం చేతనూ - అప్పీలు పడేయమని మొన్న ఆయన నా దగ్గర కొచ్చాడు. సరే, కాగితాలు చూచి చెబుతానన్నా. ఈవేళవచ్చి కూచున్నాడు. క్రింది కోర్టు వకీలుగారిని కూడా ఆయన వెంటేసుకొచ్చాడు.

"అప్పీలు పడేయకండి" - అని నేను సలహా యిచ్చాను.

వకీలు అన్నాడు: "అదేమిటండీ - అలా సలహా యిస్తున్నారు ? డబ్బుకి ఆశపడి ఆవిడ భర్తనుంచి లేచిపోయింది. రాజీ షరతులు సంసారాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాయి. కాబట్టి ప్రజానీతికే వ్యతిరేకం - అందుచేత అసలు రాజీపత్రమే చెల్లదు - అని మనం ఎందుకు అనకూడదు? మొదలు నరికితే వేరుతో పోతుంది కదండీ? అసలు రాజీనే చంపేదాం!"

అందుమీద నేను : "మీరు విషయం గమనించండి! రాజీ పత్రం మొదట ఎందుకు పుట్టింది? వేరుపడిన భార్య భర్తలను దగ్గిరదీసి సంసారాన్ని నిలబెట్టడానికే కదా? అంచేత న్యాయ సమ్మతం నీతిసమ్మతం కూడాను" అన్నా. ఈ చెట్టుక్రింద వకీళ్ళతో యేమి వాదిస్తాం? వీళ్ళ పిడుగురాళ్ళ పద్ధతులు హైకోర్టు ముందు చెబితే పేడనీళ్ళేసి కొడతారు ముఖాన. అయితే యేం జెయ్యనూ? శ్రోత్రియందారుగారికి అలాంటి సలహాలే నచ్చుతాయి!

వకీలుగారు నాతో వాదన. "రాజీ షరతులు అమలు పరచడానికి క్రిందికోర్టుకి అధికారం లేదని మనం వాదించ కూడదా? అన్నాడాయనగారు.

"వెనుక శ్రోత్రియందారుగారూ రైతులూ తగాదా పడి నప్పుడు కోర్టువారు ఈ రాజీ న్యాయసమ్మతమే అని రాజీ పత్రాన్ని నమోదు చేసుకున్నారు. అట్టి సందర్భంలో అమలు జరిపే కోర్టుకి అధికారం ఎక్కడనుంచి వస్తుంది - రాజీపత్రం న్యాయసమ్మతం కాదని తీర్పు చెప్పడానికి?" అన్నా.

ఆయన వూరుకుంటాడా? శ్రోత్రియందారు ఎదుట తన పాండిత్యం చూపించవద్దూ?

"అలాగైతే - క్రిందికోర్టుకి అసలు జ్యూరిస్డిక్షన్ లేదని వాదించొచ్చుగా?" అన్నాడు.

"వీల్లేదండీ! మీరు ఆ విషయం సబ్‌కోర్టులో ఎత్తితే జ్యూరిస్డిక్షను వున్నదీ అని తీర్పు చెప్పారు. అంచేత ఇప్పుడు 'రెస్ జ్యూడికేటా' కిందికి వచ్చేస్తుంది" అన్నా.

"బారిస్టరుగారూ! ఈ విషయంలో నేను చాలా పట్టుదలతో వున్నా. మీ సలహా అటుంచి - అప్పీలు తప్పక పడేయండి" అన్నాడు శ్రోత్రియందారుగారు.

"మీరు అలా సెలవిస్తే - మరెవరిదగ్గరికేనా వెళ్ళవలసిందే. అప్పీలులో బలం లేదని తోచినప్పుడు సరేమిరా నేను కాగితం పడేయను" అన్నా.

ఇంకేం వుంది - దాంతో ఆయన నాకు చెల్లు! నిక్షేపం లాంటి కోర్టు పక్షిని ఒదులుకున్నానే అనిపించింది. పక్షి అన్న పక్షా? రాజహంస! ఇలాంటి రాజహంస జోడా ఒక్కటివుంటే చాలు - సాలీనా పదిహేనువేల రూపాయలు ఆదాయానికి! కట్టె విరిచి పొయ్యిలో పెట్టినట్టు అన్నానే!

శాంతం వుంటే యెంతో సంతోషించును - నేను నమ్మిన మాటమీద నిలిచినందుకున్నూ ధర్మానికి కట్టుబడి ఒక స్త్రీ తరఫున మాట్లాడినందుకు న్నూ.

- ఇంకా వుంది.

మే 20న జేఈఈ అడ్వాన్స్‌డ్ -2018

దేశంలో ప్రతిష్ఠాత్మకమైన పరీక్షల్లో ఒకటైన ఐఐటీ అడ్వాన్స్‌డ్ నోటిఫికేషన్‌ను ఐఐటీ కాన్పూర్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీల్లో ప్రవేశాల కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 7 జోన్లలోని ఐఐటీ కో ఆర్డినేటింగ్ సెంటర్లు ఏడాదికి ఒకటి చొప్పున అడ్వాన్స్‌డ్ పరీక్ష నిర్వహణ చేపడుతాయి.



జోన్లు, వాటి పరిధిలోని ఐఐటీలు-ఈస్ట్‌జోన్: ఖరగ్‌పూర్, భువనేశ్వర్, ఐఐటీ (ఐఎస్‌ఎం) ధన్‌బాద్

- సెంట్రల్ జోన్ : కాన్పూర్, భిలాయ్, వారణాసి (బీహెచ్‌యూ), ఇండోర్

- నార్త్ సెంట్రల్ జోన్ : ఢిల్లీ, జమ్ము, జోధ్‌పూర్
- నార్త్ ఈస్ట్ జోన్ : గువాహటి, పాట్నా
- నార్త్ జోన్ : రూర్కీ, మండి, రోపర్,
- సౌత్‌జోన్ : మద్రాస్, హైదరాబాద్, పాలక్కడ్, తిరుపతి
- వెస్ట్‌జోన్ : బాంబే, ధార్వాడ్, గాంధీనగర్, గోవా
- వీటితోపాటు కేంద్ర నిధులతో నడుస్తున్న కింది సంస్థలు కూడా అడ్వాన్స్‌డ్ ర్యాంక్‌ల ద్వారా ప్రవేశాలు కల్పిస్తాయి. ప్రవేశాల కోసం ఆయా సంస్థల వెబ్‌సైట్లలో సమాచారం చూడవచ్చు.
- ఐఐఎస్సీ - బెంగళూరు, ఐఐఎస్ఈఆర్ - కోల్‌కతా, బెర్హంపూర్, భోపాల్, మొహాలి, పుణె, తిరువనంతపురం, తిరుపతి. ఐఐఎస్టీ - తిరువనంతపురం, రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ, రాయబరేలీ. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ - విశాఖపట్నం.

కోర్సులు - కాలపరిమితి

- బీటెక్ - నాలుగేళ్లు
- బీఎస్ - నాలుగేళ్లు
- బీఆర్క్ - ఐదేళ్లు
- డ్యూయల్ డిగ్రీ
- బీటెక్-ఎంటెక్ - ఐదేళ్లు
- డ్యూయల్ డిగ్రీ బీఎస్- ఎంఎస్ - ఐదేళ్లు
- ఇంటిగ్రేటెడ్ ఎంటెక్ - ఐదేళ్లు
- ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ - ఐదేళ్లు

పరీక్ష విధానం

- అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో రెండు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌కు మూడుగంటల సమయం. రెండు పేపర్లు తప్పనిసరి.
- పరీక్షతేదీ : మే 20
- పేపర్ - 1 ఉదయం 9 నుంచి 12 గంటల వరకు. పేపర్- 2 మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 వరకు నిర్వహిస్తారు.
- స్క్రైబ్‌ను ఉపయోగించుకొనే అభ్యర్థులకు ఒక్కో గంట అదనపు సమయాన్ని ఇస్తారు.
- జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయాలనుకొనే అభ్యర్థులు జేఈఈ మెయిన్ -2018 పేపర్ - 1 తప్పక రాయాలి. దానిలో వచ్చిన మార్కుల ఆధారంగా అడ్వాన్స్‌డ్‌కు ఎంపికచేస్తారు. మెయిన్ ఎగ్జామ్ వివరాల కోసం ఎఎఎ.యవవమొఱఅ.అఱఛ.ఱఅ చూడవచ్చు.
- అడ్వాన్స్‌డ్ -2018 ఎంపిక ఇలా : కింది ఐదు అంశాల ఆధారంగా అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయడానికి అభ్యర్థులను ఎంపికచేస్తారు.
- Criterion 1 జేఈఈ (మెయిన్) - 2018లో టాప్ - 2,24,000 మందిలో ఉండాలి. దీనిలో అన్ని కేటగిరీల అభ్యర్థులు వస్తారు. ఓబీసీ (ఎన్‌సీఎల్) - 27 శాతం, ఎస్సీ - 15, ఎస్టీ - 7.5, ఓపెన్ - 50.5 శాతం. వీటిలో ప్రతి కేటగిరీలో సమాంతర రిజర్వేషన్ కింద 5 శాతం దివ్యాంగులకు కేటాయిస్తారు.

పరీక్ష విధానం :

- ఆన్‌లైన్ విధానంలో (కంప్యూటర్ బేస్డ్ టెస్ట్)
- ప్రతి అభ్యర్థి రెండు పేపర్లు తప్పక రాయాలి. ప్రతి పేపర్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులపై ప్రశ్నలు ఇస్తారు.
- ప్రశ్నలు ఆబ్జెక్టివ్/మల్టిపుల్ చాయిస్ లేదా న్యూమరికల్ ఆన్సర్ విధానంలో ఇస్తారు.
- ప్రశ్నలు కాంప్రహెన్షన్, రీజనింగ్, అనలిటికల్ ఎబిలిటీలను పరీక్షించే విధంగా ప్రశ్నలను రూపొందిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్, హిందీలో ఉంటుంది.
- కంప్యూటర్ స్క్రీన్ కుడివైపున తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ తదితర రంగుల్లో ప్రశ్నల సంఖ్యలు కన్పిస్తాయి. వీటివల్ల జవాబులు గుర్తించిన ప్రశ్నలు, గుర్తించాల్సినవి, అసలు ప్రశ్నలు చూడనివి, రివ్యూ చేయాల్సిన వాటిని తెలుపుతాయి.
- అర్హతలు : కింది రెండింటిలో ఏదో ఒక అర్హత కలిగి ఉండాలి.

1. ఇంటర్/తత్సమాన కోర్సులో 75 శాతం మార్కులు వచ్చి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు అయితే 65 శాతం మార్కులు వస్తే సరిపోతుంది.

2. ఇంటర్ లేదా తత్సమాన కోర్సులో కేటగిరీల వారీగా టాప్ 20 పర్సంటైల్‌లో ఉన్న అభ్యర్థులు అర్హులు.

- ప్రవేశాలు : జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ (జోసా) ద్వారా చేస్తారు.
- పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- బీఆర్క్ : బీఆర్క్ ప్రోగ్రామ్‌ను ఐఐటీ ఖరగ్‌పూర్, రూర్కీలో ఈ కోర్సు ఉంది. ఇందులో ప్రవేశం పొందడానికి జేఈఈ అడ్వాన్స్‌డ్ 2018లో అర్హత సాధించాలి. తర్వాత ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్ట్ (ఏఏటీ). దీనికోసం తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకొని ఉండాలి.
- ఏఏటీ పరీక్షను ఐఐటీ జోనల్ కోఆర్డినేటింగ్ సెంటర్ల వద్ద మాత్రమే నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఒక్క పేపర్ ఉంటుంది. పరీక్ష కాలవ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్‌లో ఉంటుంది.
- ఏఏటీ రిజిస్ట్రేషన్ జూన్ 10, 11 తేదీల్లో చేసుకోవాలి.
- ఏఏటీ తేదీ : జూన్ 14
- ఫలితాల వెల్లడి : జూన్ 18
- వెబ్‌సైట్ : https://www.jeeadv.ac.in

- మానస

మనూలో 52 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను అహ్వానిస్తున్నది.

వివరాలు : మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ అనేది సెంట్రల్ యూనివర్సిటీ. హైదరాబాద్ గచ్చిబౌలిలో 1998లో ఏర్పాటుచేశారు.

- మొత్తం పోస్టుల సంఖ్య : 52

విభాగాలవారీగా పోస్టులు

- హైదరాబాద్ క్యాంపస్‌లో మొత్తం టీచింగ్ పోస్టులు: 26
- ప్రొఫెసర్స్- 10 పోస్టులు (ఇంగ్లిష్-1, వుమెన్ ఎడ్యుకేషన్-1, ఇస్లామిక్ స్టడీస్-1, పొలిటికల్ సైన్స్-1, బాటనీ-1, ఫిజిక్స్-1, కెమిస్ట్రీ-1, సీడబ్ల్యూఎస్-1, డీడీఈ-1, మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ చైర్-1)
- అసోసియేట్ ప్రొఫెసర్స్-14 పోస్టులు (ఇంగ్లిష్-2, పర్షియన్-1, హిందీ-1, వుమెన్ ఎడ్యుకేషన్-1, మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం-1, సోషల్ వర్క్-1, సోషియాలజీ-1, ఎకనామిక్స్-1, మ్యాథమెటిక్స్-1, హిస్టరీ (డీఈ)-1, సీపీడీయూఎంటీ-1,సీయూసీఎస్-1)
- అసిస్టెంట్ ప్రొఫెసర్స్-2 పోస్టులు (అరబిక్-1, సీడబ్ల్యూఎస్-1)

ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ ఫర్ ఉమెన్, శ్రీనగర్ టీచింగ్ పోస్టులు - విభాగాల వారీగా పోస్టులు :

- అసోసియేట్ ప్రొఫెసర్స్-8 పోస్టులు (ఉర్దూ-1, అరబిక్-1, ఇంగ్లిష్-1, పర్షియన్-1, ఎకనామిక్స్-1, హిస్టరీ-1, పొలిటికల్ సైన్స్-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1)
- అసిస్టెంట్ ప్రొఫెసర్స్-3 పోస్టులు (హిస్టరీ-1, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్-1, కశ్మీరీ-1)
- అకడమిక్ పోస్టులు-5 ఖాళీలు (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్-1, లైబ్రేరియన్-1, డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-1, డిప్యూటీ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-1, అసిస్టెంట్ డైరెక్టర్ ఫిజికల్ ఎడ్యుకేషన్-1)



మోడల్ స్కూల్ టీచర్-10 పోస్టులు

- విభాగాలు: పీజీటీ ఇంగ్లిష్-1, టీజీటీ ఇంగ్లిష్-1, టీజీటీ హిందీ-1, టీజీటీ ఫిజికల్ ఎడ్యుకేషన్-1, యోగా టీచర్-3, ఎలక్ట్రానిక్స్-2, ఎంబ్రాయిడరీ-1
- అర్హత: యూనివర్సిటీ/ సంస్థ నిబంధనల ప్రకారం అర్హతలు ఉండాలి.
- వయస్సు : 35 ఏళ్లకు మించరాదు
- ఎంపిక : రాత పరీక్ష/ ఇంటర్వ్యూ ద్వారా
- దరఖాస్తు : ఆఫ్‌లైన్‌లో
- చివరితేదీ : ఫిబ్రవరి 28
- వెబ్‌సైట్ : www.manuu.ac.in

ఐవోసీఎల్‌లో జూనియర్ ఆపరేటర్లు

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) సదరన్ రీజియన్ పరిధిలోని మార్కెటింగ్ డివిజన్ (నాన్ ఎగ్జిక్యూటివ్)లో ఖాళీగా ఉన్న జూనియర్ ఆపరేటర్ (గ్రేడ్ 1, ఏవియేషన్) తదితర పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

IOCL Recruitment

వివరాలు : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనేది ఇండియాలోని ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో అతిపెద్ద వాణిజ్య సంస్థ.

- ◆ మొత్తం ఖాళీల సంఖ్య : 98 (జూనియర్ ఆపరేటర్ (గ్రేడ్ 1)-51, జూనియర్ ఆపరేటర్ ఏవియేషన్-46, జూనియర్ చార్జ్‌మ్యాన్-1)
- ◆ ప్రాంతాలవారీగా ఖాళీలు : తెలంగాణ-11, ఏపీ-12, కర్ణాటక-28, కేరళ-3, తమిళనాడు /పుదుచ్చేరి-44
- ◆ పోస్టు పేరు : జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)
- ◆ అర్హత : హయ్యర్ సెకండరీ లేదా ఇంటర్‌లో 45 శాతం (ఎస్సీ, ఎస్టీ 40 శాతం) మార్కులతో ఉత్తీర్ణత. వినియోగంలో ఉన్న హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- ◆ పోస్టు పేరు : జూనియర్ ఆపరేటర్ (గ్రేడ్ 1)
- ◆ అర్హత : పదోతరగతితోపాటు రెండేండ్ల వ్యవధిగల ఐటీఐ ట్రేడ్ (ఎలక్ట్రానిక్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మెషినిస్ట్, ఫిట్టర్)లో ఉత్తీర్ణత . సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- ◆ **పోస్టు పేరు :** జూనియర్ చార్జ్‌మ్యాన్
- ◆ అర్హత : పదోతరగతితోపాటు మూడేళ్ల వ్యవధిగల డిప్లొమా (మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్)లో ఉత్తీర్ణత . సంబంధిత రంగంలో ఏడాది అనుభవం ఉండాలి.
- ◆ **వయస్సు :** 2018 జనవరి 31 నాటికి 18 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీహెచ్‌లకు పదేళ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- ◆ పే స్కేల్ : రూ. 10,500-24,500
- ◆ అప్లికేషన్ ఫీజు : జనరల్/ఓబీసీ రూ. 150
- ◆ ఎంపిక : రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, స్కిల్ ప్రొఫిషియెన్సీ ఫిజికల్ టెస్ట్(ఎస్‌పీపీటీ) ద్వారా. అభ్యర్థులు రాత పరీక్షలో సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.
- ◆ రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. సంబంధిత టెక్నికల్ నాలెడ్జ్-40, జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-20, రీజనింగ్ ఎబిలిటీస్-20, బేసిక్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ స్కిల్స్-20 అంశాల నుంచి ప్రశ్నలు ఇస్తారు.
- ◆ ఈ ఆబ్జెక్టివ్ పరీక్షను 90 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- ◆ నెగెటివ్ మార్కింగ్ విధానం లేదు
- ◆ ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు ఇస్తారు.
- ◆ రాతపరీక్షలో నిర్దేశిత మార్కులతో ఉత్తీర్ణులై వారి మెరిట్ జాబితా నుంచి 1:2 నిష్పత్తిలో ఎస్‌పీపీటీకి ఎంపిక చేస్తారు.
- ◆ దరఖాస్తు : ఆన్‌లైన్ ద్వారా. ఆన్‌లైన్‌లో పంపిన దరఖాస్తులను ప్రింట్ తీసి, అవసరమైన సర్టిఫికెట్లను జతచేసి పర్సనల్ అధికారికి పంపాలి.

చిరునామా :

Post Box No-3321, Nungambakkam MDO, Chennai-600034

- ◆ చివరితేదీ : ఫిబ్రవరి 10
- ◆ హార్డ్ కాపీలకు చివరితేదీ : ఫిబ్రవరి 16
- ◆ రాతపరీక్ష తేదీ : ఫిబ్రవరి 25
- ◆ ఫలితాలు విడుదల : మార్చి 10
- ◆ వెబ్‌సైట్ : https://www.iocl.com


శ్రీహరికోట షార్‌లో 33 పోస్టులు

ఇండియన్ స్పేస్ రిసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో)లో ముఖ్య కేంద్రంగా పనిచేస్తున్న సతీస్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ (శ్రీహరికోట) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

- మొత్తం పోస్టుల సంఖ్య : 33
- ఫైర్‌మ్యాన్ ఏ-7 పోస్టులు
- క్యాటరింగ్ అటెండెంట్-17 పోస్టులు
- కుక్-8 పోస్టులు
- **అర్హత :** పదోతరగతిలో ఉత్తీర్ణత. ఫైర్‌మ్యాన్ పోస్టులకు నిర్దేశించిన శారీరక ప్రమాణాలు ఉండాలి. ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, ఎండ్యూరెన్స్ టెస్ట్‌లో అర్హతను సాధించాలి. కుక్ పోస్టులకు హోటల్ లేదా క్యాంటీన్‌లో ఐదేండ్లు పనిచేసిన అనుభవం.
- హిందీ టైపిస్ట్-1 పోస్టు
- **అర్హత :** ఏదైనా డిగ్రీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత. పదో తరగతి/ డిగ్రీస్థాయిలో హిందీ సబ్జెక్టు చదివి ఉండాలి లేదా హిందీ మాధ్యమంలో చదివి ఉండాలి. కంప్యూటర్‌పై హిందీ టైప్ రైటింగ్‌లో నిమిషానికి 25 పదాల వేగాన్ని కలిగి ఉండాలి.
- **వయస్సు :** 18 నుంచి 25 ఏండ్ల మధ్య ఉండాలి (కుక్‌కు 18 నుంచి 35 ఏళ్లు, హిందీ టైపిస్ట్‌కు 18-26 ఏళ్ల మధ్య)
- **పే స్కేల్ :** ఫైర్‌మ్యాన్, కుక్ రూ. 19,900, టైపిస్ట్‌కు రూ. 25,500, క్యాటరింగ్ అటెండెంట్‌కు రూ.18,000, ఎంపిక **విధానం :** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్
- **దరఖాస్తు :** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ :** ఫిబ్రవరి 16
- **వెబ్‌సైట్ :** http://sdsc.shar.gov.in

'బెంగళూరు మెట్రో రైల్'లో 36 ఖాళీలు

బెంగళూరు మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ (బీఎమ్ఆర్ సీఎల్)... కాంట్రాక్టు పద్ధతిలో మూడేళ్ల కాలానికి 36 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



- **పోస్టు - ఖాళీలు :** డిప్యూటీ చీఫ్ ఇంజనీర్-5, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-31.
- **విభాగం :** సివిల్.
- **వేతనం :** డిప్యూటీ చీఫ్ ఇంజనీర్-రూ. 1,22,630; ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-రూ. 67,430.
- **అర్హతలు :** సివిల్‌లో బీఈ/బీటెక్‌తోపాటు సంబంధిత రంగంలో డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌కు కనీసం 15 ఏళ్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు కనీసం 12 ఏళ్లు ఉద్యోగానుభవం ఉండాలి.
- **వయసు :** డిప్యూటీ చీఫ్ ఇంజనీర్‌కు 55 ఏళు; ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు 50 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- **ఎంపిక :** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ.
- **దరఖాస్తు విధానం :** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని, హార్డ్‌కాపీ ప్రింటవుట్‌కు సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు జతచేసి గడువులోగా పంపాలి.
- **హార్డ్‌కాపీ చేరడానికి చివరి తేదీ :** ఫిబ్రవరి 17, 2018. పూర్తి వివరాలు వెబ్‌సైట్‌లో చూడొచ్చు
- **వెబ్‌సైట్ :** www.bmrc.co.in

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	బంగారం (విశాఖపట్నం)	వెండి (విజయవాడ)	వెండి (విశాఖపట్నం)	డాలరు Vs రూపాయి
-839.91	-256.30	-150	29,250	-500	40,750	
35,066.75	10,760.60	28,900	ప్రొద్దుటూరు 28,800	40,300	ప్రొద్దుటూరు 40,700	64.00
		22 క్యారెట్లు, 10 గ్రాములు	22 క్యారెట్లు, 10 గ్రాములు	కిలో (రూపాయల్లో)	కిలో (రూపాయల్లో)	

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
టీసీఎస్	3,190.00	0.30
హెయూఎల్	1,377.50	0.10

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
బీహెచ్ఈఎల్	99.50	-6.98
బజాజ్ ఆటో	3,472.60	-4.90
మారుతి సుజుకి	9,380.00	-4.28
ఏక్సిస్ బ్యాంక్	585.00	-4.28
రిలయన్స్	943.25	-4.07

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ క్రి.ముగింపు	రూ.విలువ ప్ర.ముగింపు
డాలర్	63.67	64.00
యూరో	78.96	79.92
పౌండ్	89.58	90.98
ఆస్ట్రేలియా డాలర్	51.49	51.12
సింగపూర్ డాలర్	48.55	48.73

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	29,250	31,283
చెన్నై	29,250	31,283
బెంగళూరు	28,550	30,535
ముంబై	30,020	32,107
విజయవాడ	28,900	31,400
విశాఖపట్నం	29,250	31,900
ప్రొద్దుటూరు	28,800	31,100

ముడి చమురు	69.08



మెట్రోల్లో పెరిగిన పెట్రోలు ధరలు

న్యూఢిల్లీ: బడ్జెట్ అనంతరం రెండవరోజు మెట్రో సిటీల్లో పెట్రోలు ధరలుపెరిగాయి. డీజిల్ ధరల్లో మాత్రం మార్పులేదు. నాలుగు మెట్రోలైన ఢిల్లీ, కోల్‌కతా, ముంబై, చెన్నయ్ నగరాల్లో పెట్రోలు ధరల్లో మార్జినల్ హైక్ 5పైసలు ఉంది. నూతన ధరలు ఫిబ్రవరి 2 ఉదయం 6నుండి అమల్లోకి వచ్చినట్లు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించిదంది.

గత ఏడాది నుండే పెట్రోలు, డీజల్ ధరలు గణనీయంగా పెరగడం ప్రారంభించాయి. పెట్రోలు, డీజిలుధరలు అంతర్జాతీయ ముడిచమురు ధరలు, విదేశీ మారకం రేట్ల ద్వారా నిర్ణయించబడతాయి. ముడిచమురు ధరలు బ్యారెల్ 70 డాలర్లకుపెరగడంతో బడ్జెట్‌లో పెట్రోలు,డీజిలు పై ఎక్సైజ్ సంకాన్ని తగ్గించాలని చమురు మంత్రిత్వశాఖ ఆర్థికమంత్రిత్వశాఖ జోక్యాన్ని కోరింది. ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించి 2019 ఎన్నికలకు ముందే ప్రపంచ ముడి చమురుధరలను పెంచింది.

మండిపడ్డ మదుపరులు

రూ.5లక్షల కోట్ల పెట్టుబడి వాపస్...!



ముంబై: అనుకున్నట్టే జైట్లీ బడ్జెట్‌పై మదుపర్లు మండి పడ్డారు. దీర్ఘకాల మూలధన లాభం రూ. లక్ష మించితే 10 శాతం పన్ను విధిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం బడ్జెట్‌లో ప్రకటించటంతో... మదుపర్లు తమ పెట్టుబడులను వాపస్ తీసుకోవటం ప్రారంభించారు. రెండు నెలలుగా వరుస లాభాలతో దూసుకెళ్తున్న సెన్సెక్స్.. బడ్జెట్ దెబ్బకు కుదేలైంది. బడ్జెట్ రోజు స్వల్ప నష్టాలతో ముగిసిన మార్కెట్లు.. శుక్రవారం దారుణంగా పతనమయ్యాయి. అటు పెరిగిపోతున్న అప్పుల భారం కారణంగా ఇండియా రేటింగ్‌ను పెంచ లేమని ఫిచ్ రేటింగ్ వ్యాఖ్యలు కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. బ్యాంకింగ్ షేర్లు దారుణంగా పతనమయ్యాయి. సెన్సెక్స్ 2.34 శాతం అంటే 839.1 పాయింట్లు నష్టపోగా.. నిఫ్టీ 2.33 శాతం అంటే 256 పాయింట్లు నష్టపోయింది. సెన్సెక్స్ సూచీ 35,066 పాయింట్లు, నిఫ్టీ సూచీ 10,760కి పడిపోయాయి. అమ్మ కాలు వెల్లువెత్తడంతో రియాల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, పవర్, కేపిటల్ గూడ్స్, బ్యాంకింగ్స్ రంగాల షేర్లన్నీ పతనమయ్యాయి. రూ.లక్ష పైబడే ఈక్విటీ లాభాలపై పది శాతం పన్ను విధిస్తామన్న ప్రభుత్వ ప్రతిపాదనతో శుక్రవారం ఉదయమే మార్కెట్ల పతనం మొదలైంది. ఇక ద్రవ్యలోటు గత అంచనాకి (3.2 శాతం) దూరంగా 3.5 శాతంగా ఉండనుందని జైట్లీ చెప్పడం కూడా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. బ్యాంకింగ్ షేర్లు 3.8 శాతం పతనమయ్యాయి. టాటాపవర్, ఎస్‌బీఐ, మారుతి సుజుకీ, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు నష్టాలు మూట గట్టుకున్నాయి. వాస్తవానికి బడ్జెట్‌కు ముందు వారం రోజుల నుంచే మదుపర్లు ఆచీతూచీ వ్యవహరిస్తున్నారు. వీలు చిక్కినప్పుడల్లా షేర్లను అమ్మేస్తున్నారు. ఐతే, తాజాగా దీర్ఘకాల మూలధన లాభంపై కేంద్రం కన్నుపడటంతో... మదుపర్లు కఠినంగా వ్యవహరించారు.

బ్లడ్ షుగర్ నియంత్రణతో ఫుట్ అల్సర్‌కు చెక్

డయాబెటాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాల రెడ్డి



విజయవాడ: ప్రతి నలుగురు మధుమేహ రోగుల్లో ఒకరికి ఫుట్ అల్సర్ సోకుతోందని, బ్లడ్ షుగర్ స్థాయిని తగ్గించుకుని ఫుట్ అల్సర్‌ను నివారించవచ్చని వీజీఆర్ డయాబెటీస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ వేణుగోపాలరెడ్డి తెలిపారు. మధుమేహం కారణంగా కొన్నాళ్లకు పాదాల్లో నరాలు దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. చిన్న చిన్న గాయాలనూ గుర్తించలేరని, నొప్పి ఉండదని ఆయన వివరించారు. దీనికి తోడు రక్తపోటు, పొగతాగే అలవాటు, ఊబకాయం, కొలెస్ట్రాల్ కారణంగా పాదాలకు రక్త సరఫరా తగ్గిపోతుందన్నారు. దీంతో ఆ వ్యక్తికి సెకండరీ ఇన్‌ఫెక్షన్‌లు దారి తీయవచ్చని, వీటిలో ఫుట్ అల్సర్ ముఖ్యమైందన్నారు. డయాబెటిక్ ఫుట్ అల్సర్‌తో సెప్టిసెమియా, గాంగ్రీన్, డిఫార్మిటీ, లింబ్ లాస్‌కు అవకాశం ఉందన్నారు. మధుమేహంతో బాధపడే చిన్నారులు తప్పనిసరిగా తమ పాదాలను పరీక్షించుకోవాలని, కోత, పగుళ్లు ఉన్నా, గోర్లు వెనక్కి పెరుగుతున్నా, స్పర్శ లేకున్నా తమ వైద్యుడి దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన సూచించారు. సరైన గ్లిసెమిక్ నియంత్రణ, ఫుట్‌కేర్‌తో ఫుట్ అల్సర్లను నివారించవచ్చని వేణుగోపాలరెడ్డి స్పష్టం చేశారు. అలాగే మరికొన్ని సూచనలు ఇచ్చారు. సరైన రీతిలో బ్లడ్‌గ్లూకోజ్ స్థాయిని నిర్వహించాలి. ప్రతిరోజూ పాదాలను పరిశీలించాలి. కోత, వాపు,బొబ్బలు ఉన్నాయేమో గమనించాలి. ఫిజికల్‌గా యాక్టివ్‌గా ఉండాలి. ప్రతిరోజు 30 నిముషాలు వ్యాయామం చేయాలి. పాదాలను పరిశుభ్రంగా, పొడిగా ఉంచుకోవాలి. మరీ ముఖ్యంగా వేళ్ల మధ్య తడి ఉండకూడదు. పాదాలను శుభ్రం చేసిన తరువాత మాయిశ్చరైజ్ చేయాలి. కాలి గోళ్లను కత్తిరించుకోవాలి. పాదరక్షలు లేకుండా నడవకూడదు. సౌకర్యవంతమైన సాక్స్, షూస్ వాడాలి. కూర్చున్నప్పుడు పాదాల కింద ఎత్తైన వస్తువు పెట్టుకోవాలి. ఎక్కువగా నిలబడటం ద్వారా పాదాలకు రక్తప్రసరణ జరిగేలా చూడాలి.

బిట్‌కాయిన్ విలువ ఢమాల్

ఢిల్లీ: భారత్‌లో బిట్‌కాయిన్ సహా ఏ క్రిప్టో కరెన్సీకి చట్టబద్ధత లేదని.. వాటిని ఎవరూ వినియోగించకుండా అన్ని చర్యలూ తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజే భారత్‌లో బిట్‌కాయిన్ విలువ పడిపోవడం గమనార్హం. శుక్రవారం మధ్యాహ్నం 1.05గంటకు బిట్‌కాయిన్ విలువ రూ.5,44,735 వద్ద ట్రేడవుతోంది. బిట్‌కాయిన్ విలువ 15శాతం పడిపోయి రెండు నెలల కనిష్టానికి చేరినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడించాయి.

గతంలో దీని విలువ రూ.6,44,042 ఉంది. బిట్‌సాచ్ క్రిప్టో కరెన్సీ ఎక్స్ఛేంజ్ వ్యవస్థాపకుడు ఆశిష్ అగర్వాల్ దీనిపై స్పందించారు. బిట్‌కాయిన్ చట్టబద్ధం కాదని జైట్లీ చెప్పడం వల్ల పెట్టుబడిదారుల్లో భయం నెలకొందని ఆయన తెలిపారు. గురువారం బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ మాట్లాడుతూ భారత్‌లో పూహాజనిత కరెన్సీలను నిర్వహించేందుకు ఆర్‌బీఐ ఎలాంటి లైసెన్సులు ఇవ్వలేదని తెలిపారు. ఇటీవల కాలంలో దేశంలో బిట్‌కాయిన్ ట్రేడింగ్ విపరీతంగా పెరిగిపోయింది.

ఏడెనిమిదేళ్లుగా వ్యవసాయ సంక్షోభం

గుదిబండలుగా బ్యాంకుల మొండిబకాయిలు

బడ్జెట్‌ను సమర్థించుకున్న జైట్లీ



న్యూఢిల్లీ: గత ఏడెనిమిదేళ్లుగా వ్యవసాయ సంక్షోభం కొనసాగుతూ వస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. వ్యవసాయ రంగాన్ని రుణభారం పట్టి పీడిస్తుంటే, బ్యాంకులకు మొండిబకాయిలు గుదిబండ లుగా మారాయన్నారు. పర్యవసానంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ ఇక్కట్ల పాలవుతోందని ఆయన అంగీకరించారు. తను గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఈ ఇక్కట్ల పరిష్కారం మీద దృష్టి నిలిపామన్నారు. శుక్రవారం కార్పొరేట్ అధిపతులతో జరిపిన ఇష్టాగోష్టిలో బడ్జెట్ సమాచారాన్ని పంచుకున్నారు. భారత పారిశ్రామిక రంగానికి సాయపడే అంశాల్లో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ గిరాకీని పెంచడం కీలకాంశమన్నారు. అలానే మౌలికాల వృద్ధిలో పురోగతి ఇంకా సాధించాల్సి ఉందన్నారు. ఉత్పత్తి వ్యయానికి ఒకటిన్నర రెట్లు ఉండేలా వ్యవసాయోత్పత్తుల కనీస మద్దతు ధరను నిర్ణయించామన్నారు. రూ8.5లక్షల కోట్లుగా ఉన్న సంస్థాగత వ్యవసాయ పరపతిని ప్రస్తుత బడ్జెట్లో రూ.11లక్షలకు పెంచినట్లు చెప్పారు. ఆహారం, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తుల మీద రాయితీల పెంపుదల 15శాతం -రూ.2.64లక్షల కోట్లకు పెంచి నట్లు చెప్పారు. ఇంకా ప్రజారోగ్యం తదితర రంగాలకు జరిపిన కేటాయింపుల వివరాలను వివరించారు. ప్రజారోగ్యానికి అరకొర నిధులే కేటాయించారన్న ప్రశ్నకు బదులిస్తూ పథకం అమలు క్రమంలో అదనంగా నిధుల కేటాయింపులు జరుగుతాయన్నారు. 2016-17 ఆర్థిక సంవత్సరంలో రూ.250కోట్ల టర్నోవరు సాధించిన కంపెనీలకు కార్పొరేట్ పన్నును 25శాతానికి తగ్గించినట్లు ఆయన తెలిపారు. దేశీయ పారిశ్రామిక రంగాన్ని విధ్వంసం చేస్తున్న విదేశీ కంపెనీల చౌక ఉత్పత్తుల నియంత్రణకు కొన్ని రంగాలకు వర్తించేలానే కస్టమ్స్ సుంకాన్ని విధించినట్లు ఆయన తెలిపారు. మొబైల్ ఫోన్ల మీద విధిస్తున్న 15శాతం కస్టమ్స్ సుంకాన్ని 20శాతానికి పెంపుదల చేయడాన్ని ప్రస్తావిస్తూ పెంచిన సుంకం తాలూకు భారాన్ని వినియోగదారులకు బదిలీ చేసేలా ఆయా విదేశీ కంపెనీల మీద ఒత్తిడి పెంచామన్నారు.

సైబర్ నేరాల కట్టడికి అపెక్స్ సెంటర్

న్యూఢిల్లీ: ఇంటర్నెట్ ఆధారిత సేవల వినియోగంలో జరుగుతున్న నేరాలు, మోసాల కట్టడికి ఢిల్లీలో ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్న యోచనలో కేంద్ర ప్రభుత్వం ఉంది. 2014-16 మధ్య కాలంలో మొత్తం లక్ష.44.496 సైబర్ దాడులు జరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఇదే తరహా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. ప్రతి రాష్ట్రంలోని పోలీసు అధికారులకు తగిన శిక్షణ నిమిత్తం ఏర్పాటు చేయనున్న ప్రయోగ, శిక్షణ కేంద్రానికి రూ.33కోట్లను కేటాయించినట్టు కేంద్ర హెం మంత్రిత్వశాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఆర్థిక నేరాలు, సామాజిక మాధ్యమాల్లో బాలలు, మహిళలను వేదింపులకు గురి చేసే వీడియోలను పోస్టు చేయడం వంటి నేరాల కట్టడికి ఈనిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అశ్లీల చిత్రాలు, దృశ్యాలను నిరోధించడమూ విధుల్లో భాగంగా ఉన్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో సమచారాన్ని సమన్వయం చేసుకోనున్నట్లు తెలిపింది. భారతీయచట్టాలను అతిక్రమించే విదేశీ వెబ్‌సైట్లను నిరోధించడం జరగుతుందన్నారు.

నేటికీ నీటి కోసం వెతలే..

- తాగునీరు సమస్య గ్రామాల్లోనే అధికం..
- రాజధాని జిల్లాలోనూ నీటి కష్టాలే...
- వాటర్ గ్రిడ్‌తో పరిష్కారానికి సర్కార్ యత్నం..



విశాలాంధ్ర అమరావతి : సాంకేతిక పరిజ్ఞానంలో ఎంతో ముందంజలో ఉన్న రాష్ట్రం తాగునీటి సరఫరాలో మాత్రం వెనకంజలోనే ఉండిపోతుంది. అవసరం మేర అనే మాట అటుంచితే కనీస అవసరాలకు కూడా కొన్ని ప్రాంతాల్లో నేటికి నీరు దొరకని పరిస్థితులు ఉండటం దురదృష్టకరం. అయితే ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ముందుకు వెళుతున్నా ఇప్పుడిప్పుడే నీటి కష్టాలు ప్రజలను వీడేలా లేవు. అటు పట్టణాల్లో ఇటు గ్రామాలలో నీటి అవసరాలు ఏ రోజుకారోజు పెరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టీ పట్టనట్లు వ్యహరించటం పట్ల ప్రజలలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. రాష్ట్ర విభజన అనంతరం పూర్తి స్థాయిలో నీటిని సరఫరా చేయలేని పరిస్థితిలో ఉండటంపై సర్కార్ కూడా మల్లగుల్లాలు పడుతుంది. నీరు కోసం ఇంకుడు గుంతులు, చెరువులు నింపటం వంటి కార్యక్రమాలు సత్ఫలితాలు ఇచ్చినప్పటికీ రానున్నది వేసవి కావటంతో ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించని పక్షంలో ఇబ్బందులు తప్పవని చెప్పకనే తెలుస్తోంది.

ప్రస్తుతం అందుతుంది ఇలా....

రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం నీరు అందిస్తున్న ప్రక్రియ పరిశీలిస్తే తలసరి రోజుకి 135 లీటర్ల నీటిని అందించాల్సిన స్థానిక సంస్థలు 70 లీటర్ల మాత్రమే అందిస్తున్నట్లు గణాంకాలు చెప్తున్నాయి. రాష్ట్రంలోని దాదాపు అధిక శాతం పట్టణాల్లో ఇదే పరిస్థితి ఉండగా, కొన్ని పట్టణంలో కొంత శాతం పెంచి నీటిని అందిస్తున్నారు. ఇక గ్రామాల విషయానికి వస్తే నేటికి 55 శాతం మించి నీటిని ఇస్తున్న పరిస్థితి ఎక్కడా కనిపించటం లేదని తెలుస్తుంది. సాక్షాత్తు కాగ్ తన నివేదికలో తాగునీటి సరఫరాపై తనదైన శైలిలో స్పందించిన విషయం తెలిసిందే. పట్టణాల్లో నీటిధర నిర్ణయించే నియంత్రణ వ్యవస్థలో ఇప్పటికి స్పష్టత లేకపోవడం శోచనీయం. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా విషయంలో 2013 నుంచి పరిశీలన విభాగం ఏర్పాటు చేసినా 72 శాతం ప్రాంతాల్లో నేటికి కార్యరూపం దాల్చకపోవటం శోచనీయం.

కలెక్టర్ల సదస్సులోనూ...

ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం దగ్గర జరిగిన కలెక్టర్ల సదస్సులోనూ తాగునీటి సరఫరాపై గణాంకాలు వివరించగా ప్రజల కంట కన్నీరే వస్తుంది తప్ప తాగేందుకు నీరు అందుతున్న పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్రంలో ఇప్పటికో 46 శాతం ప్రాంతాల్లో మాత్రమే అవసరమైనమేర చాలావరకు నీటిని అందించగలుగుతున్నట్లు గణాంకాలు వెల్లడించాయి. అంటే 54 శాతం ప్రాంతాల్లో తీవ్ర స్థాయిలో నీటి ఎద్దడి నెలకొంది. రాష్ట్రంలో నీటిని అందించే విషయంలో సర్కార్ వెనకబడి ఉందనే విషయాన్ని సాక్షాత్తూ కలెక్టర్ల సదస్సు వేదికగా వెల్లడించారు. ఎక్కడైతే నీరు అందటంలేదో అక్కడ వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అమలుచేసి సమస్యను అధిగమించేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న నీటి సరఫరా పరిశీలిస్తే కర్నూల్ జిల్లాలో అత్యల్పంగా 26 శాతం ప్రాంతాలలో మాత్రమే అందుతుండగా, కృష్ణా జిల్లాలో 65 శాతం ప్రాంతాల్లో నీరు అందుతుంది. రాజధాని నిర్మితమవుతున్న గుంటూరు జిల్లాలో సైతం 35 శాతంగా నీటి సరఫరా నమోదు కావటం విశేషం. విశాఖపట్నం, ప్రకాశం జిల్లాలో కూడా 36 శాతం మించి అందటంలేదు. ఇలా ప్రాంతాల వారీగా ఆయా జిల్లాలో ప్రజలు నేటికి నీటి కష్టాలు చవి చూస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 46 శాతం ప్రాంతాల్లో మాత్రమే తాగునీరు అందుతుండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్కింత అసహనం వ్యక్తం చేశారు. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని మంచినీటి సరఫరా విషయంలో ఎక్కడా ఇబ్బందులు లేని విధంగా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ మంత్రి లోకేష్ నీటి కష్టాలు అధిగమించేందుకు ఏ విధమైన ప్రణాళికలు సిద్ధం చేస్తారు అనేది సర్వత్రా ఆసక్తి కరంగా మారింది.

విజ్ఞానం

కేన్సర్ వాక్సిన్‌ను కనుగొన్న శాస్త్రజ్ఞులు



మనుషుల్లో తీవ్రతరమవుతున్న కేన్సర్ రాకుండా నిరోధించేందుకు శాస్త్రజ్ఞులు వ్యాక్సిన్‌ను కనుగొన్నారు. స్టాన్‌ఫోర్డ్ శాస్త్రజ్ఞులు చేపట్టిన అధ్యయనంలో భాగంగా ఎలుకలపై చేపట్టిన ప్రయోగంలో కేన్సర్‌ను అన్నివిధాలుగా అరికట్టేందుకు ప్రయత్నించారు. ఎలుకల్లోని కేన్సర్ కణాలపై రెండు రోగనిరోధక ఏజెంట్లను నేరుగా ప్రవేశపెట్టడం జరిగింది. ఈ విధానంతో సహజంగా ఉత్పన్నమయ్యే వాటితో సహా అన్ని రకాల కేన్సర్లకు విరుగుడుగా ఇది పని చేస్తుంది. లింఫోమా రోగుల చికిత్సావిధానంలో మెరుగైన విధానంపై క్లినికల్ ట్రయల్స్‌ను జనవరిలో ప్రారంభించారు. అత్యంత చవకైన ఈ విధానంతో ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా పనిచేస్తుందని తెలుస్తోంది. ఈ రెండు ఏజెంట్లను ఒకేసారి శరీరంలోకి చొప్పించడం ద్వారా శరీరంలో కణితులు ఎక్క దున్నా నిర్మూలిస్తుంది. ట్యూమర్‌ను గుర్తించడకుండానే రోగి రోగ నిరోధకవ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని తెలుస్తోంది. మనిషిలో ఈ ప్రయోగం విజయవంతమని ఒక ఏజెంట్ సమ్మతించింది. మరొక దానితో ప్రయోగం జరుగుతోందని క్లినికల్ ట్రయల్స్‌లో ఉన్నట్లు నిపు ణులు వెల్లడించారు. రోగ నిరోధక వ్యవస్థ కణాలైన టి సెల్స్ కేన్సర్ కణాల్లో అత్యధిక ప్రోటీన్‌లను గుర్తించి దాడి చేయడానికి పూను కుంటాయి. కణితి పెరుగుతున్న కొద్దీ టి సెల్స్ ప్రభావాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తాయి.

వారానికి రెండు, మూడు సార్లు

తలనొప్పి వస్తోందా.. జాగ్రత్త

కన్సాస్‌లోని ఓవర్‌లాండ్ పార్క్ ఫిజీషియన్ అధ్యయనం ప్రకారం తరచూ తలనొప్పి వస్తేమాత్రం బ్రెయిన్ ట్యూమర్‌కి దారితీసే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. వత్తిడితో కూడిన తలనొప్పి,సైనస్ తలనొప్పి, మైగ్రెయిన్ అనే మూడురకాల తలనొప్పులుఉంటాయి. కానీ హెడేక్ వారానికి రెండు సార్లకన్నా మించి వస్తుంటే వైద్యులను సంప్రదించవలసిందేనని సూచిస్తున్నారు. నిద్రసరిపోకపోతే తలనొప్పి వస్తోందా...సరిపడినంత నీరు తీసుకోకపోవడం కారణమా..తీసుకునే ఆహారం, నీరుకూడా ప్రధాన కారణాలుగా ఉన్నాయి. తలనొప్పి ప్రత్యేకంగా ఏ భాగంలో వస్తోంది.. అనే విషయాన్నికూడా గమనించవలసి ఉంది. టెన్షన్ తలనొప్పి అయితే మాత్రం తల వెనుకభాగం నుండి పైకి మళ్లడం గమనించవచ్చు. సైనస్ హెడేక్ అయితే ముఖభాగం, కళ్లచుట్టూ వస్తుంది.

మే 13న కోమెడ్ కె, యూని-గేజ్ ఎంట్రన్స్ పరీక్ష

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రైవేటు ఇంజినీరింగ్‌ను ఏకీకృతం చేయాలన్న ఆలోచనతో మూడేళ్ల క్రితం కోమెడ్‌కె-యూనిగేజ్ ఆన్‌లైన్ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ఎరా ఫౌండేషన్ సీఈవో పి.మురళీధర్, డా.కుమార్ తెలిపారు. 12,500 మంది విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఎగ్జామ్ కోమెడ్‌కె-యూనిజేజ్ రాస్తున్నారన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో రెండో అతిపెద్ద మల్టీ యూనివర్సిటీ ప్రైవేట్ ఇంజినీరింగ్ ఎగ్జామ్‌గా మారిందన్నారు. 2020 నాటికి దేశంలో కనీసం 100 ప్రైవేటు యూనివర్సిటీలు, 300 కాలేజీలకు తటస్థమైన ఉమ్మడి ప్రవేశపరీక్షను నిర్వహించి, 50 వేల ఇంజినీరింగ్ సీట్లను అందించనున్నారు. ప్రస్తుత సంవత్సరానికి బీఈ/ బీటెక్ ప్రవేశాల కోసం కోమెడ్‌కె యుగెట్, యుని-గేజ్ ఇ ప్రవేశపరీక్ష మే 13న జరగనుందన్నారు. దేశవ్యాప్తంగా 150 నగరాల్లోని 375 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలను నిర్వహిస్తున్నామని, ఇందులో తెలంగాణలో ఆరు, ఆంధ్రప్రదేశ్‌లో 10 పరీక్షా కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 10+2 పూర్తి చేసిన విద్యార్థులు అర్హులని, ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏప్రిల్ 19లోగా www.unigauge.com వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రైవేటు, డీమ్డ్ యూనివర్సిటీలు కోమెడ్ కె, యూని-గేజ్ స్కోర్లను ఈ ఏడాది బీఈ/ బీటెక్ ప్రోగ్రామ్‌ల ప్రవేశాలకు అంగీకరించనున్నట్లు వెల్లడించారు.



ఇండియా బిస్ట్రోలో దేశీయ రుచులు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: కేటరింగ్, రెస్టారెంటు రంగాలలో ప్రఖ్యాతి గడించిన ఫుడ్ లింక్ రెస్టారెంట్ ఇండియా బిస్ట్రో పేరుతో సంప్రదాయ దేశీయ వంటకాలను అందించనుంది. జూబ్లీహిల్స్‌లో గురువారం ఇండియా బిస్ట్రో రెండో అవుట్‌లెట్‌ను ప్రారంభించింది. సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి సంజయ్ వాజిరాణి మాట్లాడుతూ హైదరాబాద్‌లో రెస్టారెంట్ రెండవ అవుట్‌లెట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. తమ అత్యున్నత శ్రేణి సేవలతో ఎప్పటికప్పుడు సమీక్షించుకొనే ఆహార, పానీయాల కూర్పుతో భోజన ప్రియులను సంతృప్తి పరిచేందుకు నిరంతరం కృషి చేస్తుంటామని చెప్పారు. దేశీయ సిగ్నేచర్ వంటకాలతో కూడిన మెనూతో పాటు సీతాఫల్ కొలడాస్, డిస్ట్రక్టడ్ టర్మరిక్ మార్టిని, ది పసిఫిక్, ఇరానీ మొజిటో వంటి వెరైటీ డ్రింకులు అందుబాటులో ఉన్నాయన్నారు. అమృత్‌సం, వాగా, లక్నో వంటి ప్రాంతాల వంటకాలతో, కాటేజ్ ఆఫ్ గ్రీన్, పోన్కో క్రస్టడ్ జోధ్‌పూరి చిల్లీ, భవునా ఘోష్త్, ఫిరంగీ చికెన్, రైల్వే మటన్ కర్రీ, హింగ్లిష్ బాజీ, చనా రావల్పిండి, గలౌటీ కబాబ్ వంటివి ఉన్నాయని తెలిపారు. ఈ రెస్టారెంట్ ప్రతిరోజూ మధ్యాహ్నం 12.30 నుంచి సాయంత్రం 3.30 గంటల వరకూ, రాత్రి 7.30 నుంచి 11.30 గంటల వరకూ భోజన ప్రియులకు అందుబాటులో ఉంటుందని సంజయ్ అన్నారు.

17పైసలు నష్టపోయిన రూపాయి

ముంబై: ఆర్థిక లోటుతో రూపాయి విలువ మరింత దిగజారింది. డాలర్‌తో రూపాయి మారకపు విలు 17పైసలు నష్టపోయి ఇంటర్ బ్యాంకు ఫారెన్ ఎక్స్ఛేంజి మార్కెట్‌లో శుక్రవారం 64.19 వద్ద నిలదొక్కుకుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ డిమాండ్ పెరగడం డొమెస్టిక్ ఈక్విటీలు రూపాయిమీద వత్తిడి పెరగడంతో రూపాయి బలహీనపడింది. దీర్ఘకాలిక మూలధన పెట్టుబడులపై 10శాతం పన్నురేటున పెంచడంతో మార్కెట్లు తీవ్ర అనిశ్చితిలో ముగిసాయి. ఈ ప్రభావం కూడా రూపాయిపై ప్రభావం చూపిందని చెప్పవచ్చు. 64.08 వద్ద ప్రారంభమైన రూపాయి ఇంటర్‌బ్యాంకుఫారెన్ ఎక్స్ఛేంజిలో 4.40నిమిషాలకు 2పైసలు తగ్గి 64.04 వద్ద నిలిచింది. గురువారం రూపాయి 44పైసలు నష్టపోయి రెండు వారాల కనిష్టానికి దిగజారి 64.02 వద్ద నిలిచింది.

రూటర్ క్వాలిటీ ఆఫ్ సర్వీస్ వల్ల ఉపయోగాలు

ప్రతి ఇంట్లోనూ వైఫై రూటర్ తప్పనిసరిగా ఉంటోంది. అయితే రూటర్ కాన్ఫిగరేషన్‌లోని 'క్వాలిటీ ఆఫ్ సర్వీస్ (క్యూఓఎస్)' అనే ఓ చిన్న సెట్టింగ్‌వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తుంటాయి. ఏయే పనులకి ఇంటర్నెట్ బ్యాండ్‌విడ్త్ ఎక్కువగా కేటాయించబడాలో ప్రయారిటీ సెట్ చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. ఇది అందించే ప్రయోజనాలు ఈ విధంగా ఉన్నాయి.



ఆన్‌లైన్ గేమ్స్‌కి

చాలామంది కంప్యూటర్ ద్వారాగానీ, ఫోన్ ద్వారాగానీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుంటారు. ఇలాంటప్పుడు సరైన బ్రాడ్‌బ్యాండ్ విడ్త్ లభించక డేటా పాకెట్లు ఆలస్యంగా వచ్చినట్లయితే గేమ్ ఆడటంలో సమస్యలు తలెత్తుతుంటాయి. ముఖ్యంగా వేరేదేశంలో ఉన్న మరో వ్యక్తితో కలిసి మల్టీ-ప్లేయర్ గేమ్స్ ఆడేటప్పుడు ఇది పరోక్షంగా మనం ఓడిపోవడానికి కారణం అవుతుంది. ఈ నేపథ్యంలో క్వాలిటీ ఆఫ్ సర్వీస్ సెట్టింగ్‌ని రూటర్ కాన్ఫిగరేషన్‌లో ఎనేబుల్ చేస్తే ఈ సమస్య ఉత్పన్నం కాదు.

వీడియో ఛాటింగ్ సమయంలో

మిత్రులతో ఎవరితోనైనా వీడియో ఛాటింగ్ చేసే సమయంలో అదే వైఫై రూటర్‌కి కనెక్ట్ అయి ఉన్న మీ ఇంట్లో నివశించే మరో వ్యక్తి టొరెంట్లని డౌన్‌లోడ్ చేసుకోవడమో, యూట్యూబ్ వీడియోలు చూడటమో చేస్తున్నారనుకోండి. మీ వీడియో ఛాటింగ్ నాణ్యత తగ్గుతుంది. ఇలాంటి సందర్భాల్లో కూడా 'క్వాలిటీ ఆఫ్ సర్వీస్'ని ఎనేబుల్ చేస్తే ఎవరికీ ఇబ్బంది కలుగదు.

హెవీ డౌన్‌లోడింగ్

మీ వైఫై రూటర్‌ని వాడుకుంటున్న మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎవరైనాగానీ, ఇంటర్నెట్ నుంచి ఫైళ్లను విపరీతంగా డౌన్‌లోడ్ చేసుకుంటూ ఇంటర్నెట్ స్లో అవడానికి కారణం అవుతున్నట్లయితే 'క్వాలిటీ ఆఫ్ సర్వీస్'తో పాటు బ్యాండ్ విడ్త్ మేనేజ్‌మెంట్ అనే సెట్టింగుల ద్వారా వారికి కేటాయించే నెట్‌ని పరిమితం చేయవచ్చు.

పీసీ ట్రాఫిక్ కోసం

మీ దగ్గర కంప్యూటర్, లాప్‌టాప్‌తోపాటు అనేక స్మార్ట్‌ఫోన్లు, ఇతర డివైజ్‌లు వైఫై రూటర్‌కి కనెక్ట్ అయి ఉన్నపుడు ఆఫీస్ పనులు, లేదా ఇతర ముఖ్యమైన పనులు చేసుకోవడానికి పీసీకి ఇంటర్నెట్ మెరుగ్గా వచ్చేలా ప్రయారిటీ ఇవ్వాలన్నా 'క్వాలిటీ ఆఫ్ సర్వీస్' ఉపయోగపడుతుంది.



మెమరీ కార్డులకు ప్రొటెక్షన్ ఉందా?

మెమరీ కార్డుల్లో వైరస్‌లు వంటివి ప్రవేశించకుండానూ, అలాగే ఇతరులు ఏదిబడితే అది కాపీ చెయ్యకుండానూ కొన్నిసార్లు రైట్ ప్రొటెక్షన్ చేస్తుంటారు. అలాంటప్పుడు దాన్ని తొలగించడం ఎలాగో తెలుసుకుందాం.



ఫిజికల్ స్విచ్

రైట్ ప్రొటెక్షన్ సదుపాయం ఉన్న అధికశాతం మెమరీ కార్డులకు దాన్ని ఆన్, ఆఫ్ చేయడానికి ప్రత్యేకంగా స్విచ్ అమర్చి ఉంటుంది. మీదగ్గర రైట్ ప్రొటెక్ట్ అయిన కార్డుకి అలాంటిది ఏదైనా ఉందేమో పరిశీలించి, దాన్ని ఆఫ్ చేయండి. దాన్ని లాక్ పొజిషన్ నుండి నార్మల్‌కి సెట్ చేస్తే సరిపోతుంది.

ప్రాపర్టీల ద్వారా

కొన్ని రకాల మెమరీ కార్డులు, పెన్‌డ్రైవ్‌లకి ఇలా ప్రత్యేకంగా హార్డ్‌వేర్ స్విచ్ ఏదీ లేకపోయినప్పటికీ వాటి ప్రాపర్టీల్లో రైట్ ప్రొటెక్షన్ చేయడానికి ఆప్షన్ కల్పించి ఉంటుంది. అలాంటప్పుడు ఆ మెమరీ కార్డ్ లేదా పెన్‌డ్రైవ్‌ని మీ కంప్యూటర్‌కి కనెక్ట్ చేసి, విండోస్ ఎక్స్‌ప్లోరర్‌లోకి వెళ్లి ఆ డ్రైవ్ లెటర్‌మీద రైట్‌క్లిక్ చేసి ప్రాపర్టీస్ అనే ఆప్షన్‌ని ఎంపిక చేసుకోండి. వెంటనే వచ్చే డైలాగ్ బాక్స్‌లో వివిధ టాబ్‌లలో ఎక్కడైనా రైట్ ప్రొటెక్షన్‌కి చెందిన ఎంట్రీ ఉందేమో గమనించి దాన్ని డిసేబుల్ చేస్తే సరిపోతుంది.

ఏట్రిబ్యూట్లు మార్చడం ద్వారా

ఈ పద్ధతులు ఏవీ ఉపయోగపడనట్లయితే కమాండ్ ప్రాంప్ట్ ద్వారా ఆ డ్రైవ్‌కి రైట్ ప్రొటెక్షన్ తొలగించవచ్చు. ఆ ఏట్రిబ్యూట్లని తగిన కమాండ్‌తో మారిస్తే సరిపోతుంది. కమాండ్ ప్రాంప్ట్ ఓపెన్ చేసి ఆ డ్రైవ్‌లోకి వెళ్లి డిస్కపార్ట్ అనే కమాండ్ వాడి, సెలక్ట్ డిస్క్ ఆప్షన్ ద్వారా మెమరీ కార్డుని ఎంచుకుని ఎట్రిబ్యూట్ డిస్క్ క్లియర్ రీడ్ఓన్లీ అనే కమాండ్‌ని వాడితే సరిపోతుంది.





ఇల్ టేక్ కేర్...

ప్రైవేట్ రంగ అతిపెద్ద ఇన్సూరెన్స్ కంపెనీ 'ఐసీఐసీఐ లంబార్డ్ జీఐసీ' తాజాగా 'ఇల్ టేక్ కేర్' అనే మొబైల్ హెల్త్ యాప్‌ను మార్కెట్‌లోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ను 'గూగుల్ ప్లేస్టోర్' నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

ప్రత్యేకతలు

- దగ్గరిలో ఉన్న డాక్టర్లు, డయాగ్నస్టిక్స్, ఫార్మసీ వివరాలు పొందొచ్చు.
- రియల్ టైమ్‌లో డాక్టర్ల అపాయింట్‌మెంట్‌ను బుక్ చేసుకోవచ్చు. అవసరమైతే డాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడే వెసులుబాటు ఉంది.
- దగ్గరిలోని డయాగ్నస్టిక్ సెంటర్లలో టెస్టులు చేయించుకోవచ్చు.
- స్టోర్‌లో మెడిసిన్స్‌ను డిస్కౌంట్‌లో కొనుగోలు చేయవచ్చు. హోమ్ డెలివరీ కూడా పొందొచ్చు.
- షెడ్యూల్ హెల్త్ చెకప్‌లు చేయించుకునే అవకాశముంది.
- ఐసీఐసీఐ లంబార్డ్ నుంచి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీకి రియల్ టైమ్ క్యాష్‌లెస్ అప్రూవల్ పొందొచ్చు.
- పాలసీ అర్హత, ప్రయోజనాలు, లావాదేవీలను ట్రాక్ చేయవచ్చు.
- మెడిసిన్ రిమైండర్స్ సెట్ చేసుకోవచ్చు. మెడికల్ రికార్డ్‌లను యాప్‌లో భద్రంగా ఉంటాయి. వీటిని ఎక్కడి నుంచైనా యాక్సెస్ చేయవచ్చు. సేవలపై సంబంధిత సంస్థలకు రేటింగ్ ఇవ్వొచ్చు.

మ్యూట్‌లో ఆటోప్లే వీడియోలు.. ఎలా?



గూగుల్ తన క్రోమ్ యూజర్లకు గతనెలాఖరులో సరికొత్త అప్‌డేట్‌ను తీసుకొచ్చింది. కొత్త కొత్త ఫీచర్లతో ఈ అప్‌డేట్‌ను ప్రవేశపెట్టింది. కొన్ని వెబ్‌సైట్‌లలో ఆటోప్లే అయ్యే వీడియోలకు ఈ అప్‌డేట్ శాశ్వత పరిష్కారం అందిస్తోంది. క్రోమ్ 64 పేరుతో ఈ అప్‌డేట్‌ను ప్రవేశపెట్టింది. ఈ క్రోమ్ 64, వెబ్‌సైట్‌లలో ఆటోప్లే అయ్యే వీడియోలను మ్యూట్‌లో పెట్టుకునే ఫీచర్ పొందుపరిచింది. చాలా వెబ్‌సైట్లలో కేవలం యాడ్స్ మాత్రమే కాకుండా.. వీడియోలు కూడా ఆటోప్లే అవుతుంటాయి.

అలా ఆ వెబ్‌సైట్లలలో ఆటోప్లే అయ్యే వీడియోలను మ్యూట్‌లో పెట్టుకునేందుకు సంబంధిత వెబ్‌సైట్ ట్యాబ్ పైన రైట్ క్లిక్ ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం "మ్యూట్ సైట్" అనే ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. దీంతో డీఫాల్ట్‌గానే ఆటోప్లే అయ్యే అన్ని వీడియోలు ఆగిపోతాయని వెర్జ్ రిపోర్టులు పేర్కొన్నాయి. గత నవంబర్‌లోనే గూగుల్ ఈ సమస్యపై చర్చించి, దీనికి పరిష్కారంగా క్రోమ్ 64ను తీసుకొస్తున్నట్లు తెలిపింది. వెబ్‌సైట్‌లలో వచ్చే పాప్-అప్స్‌ను సమస్యపై కూడా గూగుల్ పరిష్కారం తీసుకొచ్చింది. పాప్-అప్స్ అనేవి మూడో వ్యక్తి కంటెంట్ కలిగి ఉన్న కొత్త పేజీలు. క్రోమ్ 64 వెబ్‌సైట్లను ప్రభావితం చేసే మెల్టౌన్, స్పెక్టర్ భద్రతా లోపాలకు కూడా పరిష్కారం కనుగొంది.

వ్యాపారుల కోసం 'వాట్సాప్ బిజినెస్ యాప్'

చిన్న వ్యాపార సంస్థల సౌకర్యం కోసం 'వాట్సాప్ బిజినెస్' పేరుతో ఉచిత ఆండ్రాయిడ్ యాప్ విడుదల అయింది. కంపెనీలు తమ కస్టమర్లతో కనెక్ట్ అయ్యేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందని సంస్థ తెలిపింది.

130 కోట్ల వాట్సాప్ యూజర్లు వ్యాపార సంస్థలతో చాట్ చేయడం ఇకపై మరింత సులువు అవుతుందని కంపెనీ పేర్కొంది. ప్రజల కోసం రూపొందించిన వాట్సాప్‌ను వ్యాపార అవసరాలకూ ఉపయోపడేలా మెరుగుపరచాలనుకుంటున్నట్లు తెలిపింది.

"భారత్, బ్రెజిల్‌లో 80 శాతం చిన్న వ్యాపార సంస్థలు తమ వ్యాపారాల వృద్ధికి, కస్టమర్లతో అనుసంధానం అయ్యేందుకు వాట్సాప్ సాయపడుతుందని చెబుతున్నాయి. 'వాట్సాప్ బిజినెస్' అన్నది మరింత సులభంగా, వేగంగా వారితో కనెక్ట్ అయ్యేందుకు తోడ్పడుతుంది" అని వాట్సాప్ వివరించింది.

టచ్ చేసి చూడు... రొటీన్

సంస్థ: శ్రీ లక్ష్మీనరసింహా ప్రొడక్షన్స్
రిలీజ్ డేట్: ఫిబ్రవరి 2, 2018
స్టోరీ : వక్కంతం వంశీ, మాటలు: దీపక్ రాజ్
ఆర్ట్: రమణ వంక, మ్యూజిక్ : జామ్ 8
కెమెరా: రిచర్డ్ ప్రసాద్, ఛోటా కె.నాయుడు
నిర్మాతలు: నల్లమలుపు బుజ్జి, వల్లభనేని వంశీ
దర్శకత్వం: విక్రమ్ సిరికొండ





మాస్ మహరాజా స్టైల్ ఆఫ్ మూవీ టచ్ చేసి చూడు. పోలీస్ ఆఫీసర్ పాత్రలో మరోసారి రవితేజ తన అదృష్టం పరీక్షించుకున్నాడు. అయితే గత సినిమాలు, తెలుగు సినిమా ఫార్ములాకు ఏ మాత్రం అటు ఇటు జరగకుండా అదే చట్రంలో మరో మూస సినిమాగా టచ్ చేసి చూడు మిగిలిపోనుంది. కథలోకి వెళ్తే...

కార్తికేయ(రవితేజ).. కార్తికేయ ఇండస్ట్రీస్‌కి అధినేత. కుటుంబంతో సహా పాండిచ్చేరిలో ఉంటాడు. తన కుటుంబానికి ఎక్కువగా విలువ ఇస్తుంటాడు. అలాగే తండ్రి మాటను కాదనకుండా పుష్ప(రాశీ ఖన్నా)ను పెళ్లి చేసుకోవాలనుకుంటాడు. అయితే కార్తికేయకు అమ్మాయితో ఎలా మాట్లాడాలో తెలియక ఆమెను రెండు సార్లు బాధపెడతాడు. దాంతో పుష్పకు కార్తికేయ అంటే ఇష్టమున్నా, తనని పెళ్లి చేసుకోనని అంటుంది. చివరకు ఇద్దరూ ఒకటవుదాం అనుకుంటున్న సమయంలో కార్తికేయ కంపెనీలో పనిచేసే ఉద్యోగి సత్యను ఇమ్రాన్ అనే వ్యక్తి హత్య చేస్తాడు. అది కార్తికేయ చెల్లెలు చూస్తుంది. ఆమె సాక్ష్యం చెప్పడానికి సిద్ధమవుతుంది. అయితే ఆమె చెప్పినట్లు ఇమ్రాన్ అనేవాడు చనిపోయి ఐదేళ్లవుతుందని పోలీసులు చెబుతారు. ఇమ్రాన్ బ్రతికే ఉన్నాడని తెలుసుకున్న కార్తికేయ హైదరాబాద్ వస్తాడు. అనేక మలుపులు తిరిగి చివరికి శుభం కార్డు పడుతుంది. పూర్తి కథ తెలియాలంటే సినిమా చూడాల్సిందే! మూవీలో రవితేజ ఎనర్జిటిక్ పెర్‌ఫార్మెన్స్‌తో ఆకట్టుకున్నాడు.

హీరో రవితేజకు వయసు మీద పడుతున్నా, ఆయనలో ఎనర్జీ ఏమాత్రం తగ్గలేదు. పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా రవితేజ మరోసారి మెప్పించాడు. హీరోయిన్లలో రాశీ ఖన్నా, సీరత్‌కపూర్‌ల ప్రాధాన్యం కేవలం గ్లామర్ ప్రదర్శనకే పరిమితమైంది. రవితేజ తండ్రి పాత్రలో నటించిన జయప్రకాష్, మరో ముఖ్యపాత్రలో నటించిన సుహాసిని, డీజీపీ షాయాజీ షిండే.. కమీషనర్ మురళీశర్మ, రవితేజ స్నేహితుడిగా నటించిన సత్యం రాజేష్‌లు తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు విక్రమ్ సిరికొండ .. రవితేజతో సినిమాను రవితేజ సినిమాల ఫార్ములాను ఫాలో అవుతూ తీయాలనుకునేలా చేయడంతో ఇది మరో రొటీన్ మూవీగా మిగిలిపోనుంది. కెమెరా పనితనం బాగుంది.



గాయత్రికి యు/ఏ సర్టిఫికెట్

కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ప్రధాన పాత్రలో తెరకెక్కిన చిత్రం 'గాయత్రి'. మదన్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఫిబ్రవరి 9న ప్రేక్షకుల ముందుకురానుంది. సెన్సార్ కార్యక్రమాలు పూర్తిచేసుకున్న ఈ సినిమా యు/ఏ సర్టిఫికెట్ పొందింది.

ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. రెండు విభిన్న పాత్రల్లో మోహన్ బాబు కనిపించనున్న ఈ సినిమాలో మంచు విష్ణు, మోహన్ బాబు యంగ్ ఏజ్‌లో ఉన్నప్పటి పాత్రలో కనిపించబోతున్నాడు. శ్రియ, విష్ణుకు జోడిగా నటించింది. వీరిద్దరు సినిమాలో కనిపించేది కొద్దిసేపే అయినా వారి పాత్రలు సినిమాకు కీలకం కానున్నాయి. తమన్ అందించిన పాటలు బాగున్నాయి. ముఖ్యంగా 'ఒక నువ్వు ఒక నేను' సాంగ్ ఆకట్టుకుంది. అనసూయ ప్రధాన పాత్రలో కనిపించిన ఈ సినిమాకు డైమండ్ రత్నబాబు కథ మాటలు అందించారు.

రోషగాడిగా వస్తున్న బిచ్చగాడు



బిచ్చగాడు రోషగాడుగా మారబోతున్నాడు. డిఫరెంట్ స్టోరీస్ సెలక్ట్ చేసుకునే విజయ్ ఆంటోనీ ఈసారి రోషగాడు అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. ఫిబ్రవరి 7న ఈ సినిమా ప్రారంభం అవుతుంది. ఎన్నో సినిమాల్లో విభిన్నమైన పాత్రలు పోషించిన విజయ్ ఆంటోనీ.. ఈ మూవీలో పవర్ ఫుల్ పోలీసాఫీసర్‌గా కనిపించబోతున్నాడు. తన సొంత బ్యానర్ విజయ్ ఆంటోనీ ఫిలిం కార్పొరేషన్ పైనే రోషగాడు చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. స్వతహాగా సంగీత దర్శకుడు కూడా అయిన విజయ్ ఆంటోనీ.. ఎప్పట్లానే ఈ సినిమాకు కూడా తనే మ్యూజిక్ ఇవ్వబోతున్నాడు. గణేషా ఈ సినిమాకు దర్శకుడు. బిచ్చగాడు, యమన్, భేతాళుడు, ఇంద్రసేన లాంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన విజయ్ ఆంటోనీ.. రోషగాడు సినిమా కూడా తెలుగు ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందని అంటున్నాడు. తన గత సినిమాల టైపులోనే ఈ మూవీని కూడా ఒకేసారి తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

మాలీవుడ్‌లోకి త్రిష ఎంట్రీ



సౌత్ ఇండియన్ సినిమాల్లో తన సొంతమార్క్ క్రియేట్ చేసుకున్న త్రిష మాలీవుడ్‌లోకి గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది. శ్యామ్ ప్రసాద్ డైరెక్షన్‌లో తెరకెక్కిన 'హే జ్యూడ్' సినిమా విడుదల కావడంతో మలయాళంలో తన తొలి మూవీతో బోణీ కొట్టింది త్రిష. నివిన్ పాల్ హీరోగా నటించిన ఈ సినిమాలో త్రిష హీరోయిన్‌గా నటించింది. తెలుగు తమిళ, కన్నడ సినిమాల్లో నటించిన త్రిష, "మళయాళ సినిమాలు రియాలిటీకి మరీ దగ్గరగా ఉంటాయన్న రీజన్‌తో ఇన్నాళ్ళు అవాయిడ్ చేసినా, ఈ సినిమా స్టోరీలైన్ నచ్చడంతో నో అని చెప్పలేకపోయాను" అని చెప్పుకుంది త్రిష.

24ఏళ్లుగా ఆయన నాతోనే ఉన్నాడు : మహేశ్



ఫేస్‌బుక్, ట్విట్టర్‌ల ద్వారా అభిమానులకు చేరువగా ఉంటున్న అగ్ర కథానాయకుడు మహేశ్‌బాబు ఇటీవల ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను కూడా ప్రారంభించారు. 'భరత్ అనే నేను' ప్రచార చిత్రాన్ని తొలి పోస్ట్‌గా అభిమాను లతో పంచుకున్నారు. తను బాలనటుడిగా ఉన్నప్పుడు తండ్రి కృష్ణ, మేకప్‌మ్యాన్ పట్టాభితో కలిసి దిగిన ఫొటో మహేశ్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. పట్టా భితో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'ఎవర్ గ్రీన్ సూపర్‌స్టార్‌తో ఫొటోకు పోజిచ్చా (స్మయిల్ సింబల్స్). గత 24 ఏళ్లుగా ఆయన నాతోనే ఉన్నారు. ఆయన లేకుండా కెమెరాను ఫేస్ చేయలేను. ఈ ఫొటోను ఫొటోషాప్ చేయలేదు. నాకిష్టమైన కలర్ బ్లూలో మై మ్యాన్ పట్టాభి (స్మయిల్ సింబల్స్)' అంటూ మహేశ్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

రోబో 2.0 మళ్లీ వాయిదా?

తలైవర్ రజనీకాంత్, స్టార్ డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తోన్న భారీ బడ్జెట్ చిత్రం రోబో 2.0. విజువల్ ఫీస్ట్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. ఈ సినిమాలో 11000 వేల గ్రాఫిక్ సీన్స్ ఉన్నాయని ఇప్పటికే ప్రచారం సాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా పలు విఎఫ్ఎక్స్ కంపెనీలు రోబో 2.0 సినిమా కోసం పనిచేస్తున్నాయని తెలుస్తోంది. అయినా సినిమా అనుకున్న సమయంలో పూర్తయ్యే అవకాశాలు తక్కువగానే ఉన్నాయని లేటెస్ట్ టాక్. ఇప్పటికే రెండు సార్లు సినిమా విడుదలను యూనిట్ వాయిదా వేసింది. తాజాగా విఎఫ్ఎక్స్ వర్క్‌ను అనుసరించి సినిమా విడుదల మరోసారి వాయిదా పడుతుందని అంటున్నారు. వినపడుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమాను నాలుగు నెలలు పాటు వాయిదా వేయనున్నారట. అంటే సినిమా ఆగస్ట్‌లో విడుదల కావొచ్చు. దీనిపై యూనిట్ నుంచి అధికారిక స్పందన మాత్రం వెలువడలేదు.





యశ్వంత్ సిన్హా కొత్తపార్టీ

న్యూఢిల్లీ : సొంత పార్టీపైనే తరచూ విమర్శలు చేస్తూ వార్తల్లో నిలుస్తున్న బీజేపీ సీనియర్ నేత యశ్వంత్ సిన్హా మరోసారి మీడియా ముందుకు వచ్చారు. కొత్త పార్టీ పెట్టబోతున్నారంటూ వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. బీజేపీని ఎట్టిపరిస్థితుల్లో వీడే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టేశారు. కాగా, ఈ మధ్యే ఆయన 'రాష్ట్ర మంచ్' అనే రాజకీయ వేదికను ప్రారంభించి ఎన్డీఏ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి ఆయన బయటకు వచ్చేస్తున్నారంటూ కథనాలు వెలువడ్డాయి. దీనిపై మీడియా ఆయన్ని ప్రశ్నించింది. 'బీజేపీ సభ్యుడిగా కంటే.. ఒక పౌరుడిగానే నాకు బాధ్యతలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర మంచ్ అనేది నిరుద్యోగులు, రైతుల హక్కుల కోసం పోరాటం చేసేందుకు ఏర్పాటు చేసిన ఓ వేదిక మాత్రమే. అంతేగానీ పార్టీల పేరుతో రాజకీయాలను వెలగబెట్టడానికి కాదు. నేను బీజేపీలోనే ఉన్నా. ఎట్టి పరిస్థితుల్లో నేను పార్టీని వీడను' అని ఆయన స్పష్టం చేశారు. తన వ్యవహారం నచ్చక బీజేపీ అధిష్టానం వేటు వేస్తే సంతోషంగా అంగీకరిస్తానని తెలిపారు.

25000 దుకాణాలు బంద్..!

న్యూఢిల్లీ : మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన సీలింగ్ డ్రైవ్‌ను నిరసిస్తూ ఢిల్లీలో మార్కెట్లన్నీ మూత పడ్డాయి. ఢిల్లీలో మార్కెట్లను 48 గంటల పాటు బంద్ చేస్తున్నట్టు ఆల్ ఇండియా ట్రేడర్స్ కాన్ఫడరేషన్ ప్రకటించింది. 2వేల ట్రేడర్స్ అసోసియేషన్స్ ఈ బంద్‌కు మద్దతు తెలిపాయి. మరోవైపు కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి హర్‌దీప్ పురీ ఆందోళనలను పరిగణలోకి తీసుకుంటామని మాట ఇచ్చినప్పటికీ వర్తకుల సంఘం నిరసనను పాటించాలనే నిర్ణయించింది. మున్సిపల్ కార్పొరేషన్ చేపడుతున్న ఈ సీలింగ్ డ్రైవ్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయనుందని కాన్ఫడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ ప్రవీణ్ ఖండేల్‌వాల ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో మొత్తంగా 25వేల మార్కెట్లను శుక్రవారం మూసివేశారు. 500 మార్కెట్లలో ఆందోళనలు చేపట్టారు. సీపీ, ఖాన్ మార్కెట్‌తో పాటు ఛాందినీ చౌక్, కరోల్ భాగ్, కమలా నగర్, సౌత్ ఎక్స్‌టెన్షన్, గ్రేటర్ కైలాష్, లజపత్ నగర్, డిఫెన్స్ కాలనీ, గ్రీన్ పార్క్, రాజౌరి గార్డెన్, తిలక్ నగర్ మార్కెట్లు మూతపడ్డాయి. దీంతో ఈ విషయంపై ఢిల్లీ బీజేపీ నాయకులు, రాజధాని పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సమావేశమయ్యారు.

మరుగుదొడ్డిలో కుమ్ములాట

ఢిల్లీలో విద్యార్థి హత్య

న్యూఢిల్లీ : మరో 'రేయాన్' తరహా ఘటన ఢిల్లీలో సంచలనం సృష్టించింది. తొమ్మిదో తరగతి విద్యార్థిని పాఠశాల మరుగుదొడ్డిలో సహవిద్యార్థులు హతమార్చారు. గ్యాంగస్టర్‌ల తరహాలో ఒక విద్యార్థిపై ముగ్గురు దాడి చేసి పిడిగుద్దులతో చంపేశారు. ఢిల్లీలోని కరావల్ నగర్‌లో ఈ దారుణం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. 16 ఏళ్ల తుషార్ కుమార్ స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం స్కూల్‌కు వచ్చిన తుషార్.. కొద్ది గంటల తర్వాత వాష్‌రూంలో స్పృహ లేకుండా పడి కన్పించాడు. అతడిని గుర్తించిన సహ విద్యార్థులు యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లారు. తుషార్‌ను స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు ముందు తుషార్ కడుపు నొప్పితో బాధపడినట్లు స్కూల్ యాజమాన్యం ప్రకటించింది. కానీ అతడి తల్లిదండ్రులు మాత్రం తమ కుమారుడి హత్య చేశారని ఆరోపిస్తున్నారు. కొందరు విద్యార్థులు తమ కొడుకును కొట్టి చంపారని, వాళ్లని రక్షించేందుకు స్కూల్ యాజమాన్యం ప్రయత్నిస్తోందన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. పాఠశాలలోని సీసీకెమెరా పుటేజీ ఆధారంగా... విద్యార్థులు మరుగుదొడ్డిలో ఫైటింగ్ చేసినట్టు పోలీసులు గుర్తించారు. వెంటనే ముగ్గురు సహ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తొలుత తరగతి గదిలో గొడవ జరిగింది. ఆ తరువాత వీరంతా మరుగుదొడ్డిలోకి వెళ్లి తన్నుకున్నట్టు పోలీసులు గుర్తించారు. గతేడాది సెప్టెంబరులో గురుగ్రామ్‌లోని రేయాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో రెండో తరగతి చదువుతున్న ప్రద్యుమన్ ఠాకూర్ అనే చిన్నారిని హత్య చేసిన విషయం విధితమే. పరీక్షలు వాయిదా వేయించేందుకు ప్రద్యుమన్‌ను సీనియర్ విద్యార్థి వాష్‌రూంలో గొంతుకోసి చంపేసినట్లు సీబీఐ విచారణలో తేలింది.

'మోడీకేర్' అంత ఈజీ కాదు

- నిధులు భారమేనా..!
- వ్యయం ఏడాదికి రూ.11 వేల కోట్లు
- బడ్జెట్‌లో రూ.2 వేల కోట్ల కేటాయింపు
- 29 రాష్ట్రాల నిధితో కేంద్రానిది రూ.5 వేల కోట్లు
- కుటుంబ బీమా వ్యయం రూ.1,110గా అంచనా



న్యూఢిల్లీ : దేశంలో దాదాపు సగం జనాభాకు ఆరోగ్య బీమా ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించిన జాతీయ ఆరోగ్య రక్షణ పథకానికి భారీగా నిధులు అవసరమవుతాయనేది తేటతెల్ల మవుతోంది. అంతమేరకు నిధులను కేంద్రం సమకూర్చగలదా అనే విషయమై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజారోగ్య వ్యవస్థ అస్తవ్య స్తంగా ఉన్న నేపథ్యంలో ఈ పథకం అమలుపై ప్రజల్లో అనుమా నాలున్నాయి. ఒక్కో ఏడాదికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు రూ.11 వేల కోట్లు అవసరమవుతాయని అంచనా అని అధికారి ఒకరు తెలిపారు. గురువారం ప్రకటించిన 2018-19 కేంద్ర బడ్జెట్‌లో ఈ ఆరోగ్య రక్షణ పథకాన్ని 'మోడీకేర్'గా ప్రభుత్వం పేర్కొంటోంది. ఒక్కొక్క కుటుంబానికి తీవ్ర అనారోగ్యాలకు ఉచిత చికిత్స కోసం ఏడాదికి రూ.5 లక్షల ఆరోగ్య కవరేజీతో 10 కోట్ల మంది లేదా దాదాపు 50 కోట్ల మందికి ఈ ఆరోగ్య రక్షణ బీమా అందిస్తారు. 2018-19లో ఈ పథకానికి రూ.2 కోట్ల కేంద్ర నిధుల కేటాయింపును ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించింది. కానీ పథకం అమల్లోకి వచ్చిన సంవత్సరంలో ఈ కార్యక్రమానికి మరిన్ని నిధులు అందే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని రూపాల్లో ఆరోగ్య బీమాను అందిస్తున్నాయి. కానీ ఈ ఆరోగ్య రక్షణ పథకాలు సాధారణంగా, పేలవంగా అమలవుతున్నాయి. కాగా పథక సమాచారం తెలిసిన ప్రభుత్వ అధికారి ఒకరు మాట్లాడుతూ కొత్త పథకం కింద, ఒక్కో కుటుంబానికి బీమా వ్యయం దాదాపు రూ.1,100గా ఉంటుందని ప్రభుత్వ అంచనా అని తెలిపారు. అయితే ఆరోగ్య చికిత్సలకు సంబంధించి భారీ వ్యయాన్ని ఎదుర్కొంటున్న గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు ఆరోగ్య రక్షణ కార్యక్రమాన్ని ప్రకటించినట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వ నిధితో నడిచే ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య రక్షణ కార్యక్రమంగా ప్రభుత్వం పేర్కొంటోంది. అయితే 2018-19 సంవత్సరానికి ఈ కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల కోట్ల నిధులు సమకూర్చగలదా అని విమర్శకులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా, ఆరోగ్య పథకానికి నిధికి ప్రీమియంలలో రూ.11 వేల కోట్లు అవసరం కాగా, 29 రాష్ట్రాల నిధితో కేంద్ర ప్రభుత్వం రూ.7 వేల కోట్లు అందజేస్తోంది. బడ్జెట్‌లో కేటాయించిన రూ.2 వేల కోట్లపైన కేంద్ర ప్రభుత్వం రూ.5 వేల కోట్లు కేటాయిస్తుంది. రానున్న నెలల్లో ఈ పథకానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులోకి వస్తాయని అధికారి చెప్పారు. 'ఈ ఆరోగ్య రక్షణ కార్యక్రమ నిధికి ప్రభుత్వ ఆరోగ్య బీమా కంపెనీలు వెంటనే అంగీకారం తెలిపాయి' అని వివరించారు. ఆస్పత్రులు, వైద్యుల కొరత ఎదుర్కొంటున్న దేశ ప్రజారోగ్యంపై జీడీపీలో ఇప్పటికీ సుమారు 1 శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారు. ప్రపంచంలోనే ఇది అతి తక్కువగా ఉంది. 2018-19 బడ్జెట్‌లో దేశ ఆరోగ్య రంగానికి రూ.54,667 కోట్లు 11.5 శాతంగా మోడీ ప్రభుత్వం ప్రకటించింది.

అధికారమే అంతిమ లక్ష్యం

- బడ్జెట్ సారాంశమిదే
- హామీలన్నీ పక్కన పెట్టేశారు



న్యూఢిల్లీ : 2019పార్లమెంటు ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలనేది మోడీ సర్కారు నిర్ణయం. గురువారం పార్లమెంటులో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇదే సారాంశాన్ని వివరిస్తోంది. 2014ఎన్నికల సమయంలో గుప్పించిన హామీలు కావచ్చు, నాటి అధికార యూపీఏ-2 కూటమి పాలనా వైఫల్యాలు కావచ్చు బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే సర్కారును అధికారంలోకి తేగలిగాయి. నాటి ఎన్నికల్లో ఏఒక్క హామీని మోడీ సర్కారు నెరవేర్చలేకపోయింది. ఏకపక్షంగా అమలు జరిపిన పెద్ద నోట్ల రద్దు, ఆదరాబాదరాగా అమల్లోకి తెచ్చిన వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ)లను అతి గొప్ప ఆర్థిక సంస్కరణలుగా ప్రభుత్వం ప్రకటించుకుంది. ఆర్థిక సంస్కరణల కారణంగా ఏ వర్గ ప్రజానీకం గోడు వెళ్లబోసుకున్నా ప్రధాని నరేంద్రమోడీ, ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీలు ఆలకించిన దాఖలాలేలే లేవు. రాజస్థాన్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ పునాదులు కదులుతున్న వాస్తవాన్ని గుర్తించిందే తడవు జనరంజక బడ్జెట్ అందిస్తున్నామంటూ ప్రకటిస్తున్నారు. 2019 లేదా ఇంకా ముందుగా జరుగుతాయని భావిస్తున్న ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా మోడీ సర్కారులో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తన చివరి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇందులో వ్యవసాయ రంగాన్ని, రైతులను ఆదుకునేందుకు తాము ప్రకటించిన, ప్రవేశపెడుతున్న పథకాలను వివరించేందుకే 40నిమిషాల సమయాన్ని జైట్లీ తీసుకున్నారు. ఇలా ఏరంగం గురించి అయినా పథకాల ఊసులే ఎక్కువగా వినిపించారు. అమలు తీరు , నిధుల కేటాయింపు, కాలపరిమితి తదితర అంశాలన్నిటినీ విస్మరించ డం గమనార్హం. ఇందులో ఎన్ని పథకాలు సానుకూల ఫలితానిస్తాయని ప్రశ్నిస్తే వాటికి బదులిచ్చేందుకు మోడీ, జైట్లీలు ఇంతకాలమూ అనుసరించిన దాటవేత ధోరణినే కొనసాగించే ధోరణి వ్యక్తమవుతోంది. ఉదాహరణకు ప్రపంచంలో అతి పెద్ద ప్రజారోగ్య పథకాన్ని ప్రకటించిన జైట్లీ ఆపథకం అమలు పరిధి, వ్యయ అంచనాలు తదితర వివరాలను అసమగ్రంగానే అందించారు. మరో ముఖ్య విషయం జీడీపీలో ద్రవ్యలోటు వాస్తవంగా 3.7శాతం ఉందని ఆర్థిక నిపుణులు ప్రస్తావిస్తున్నారు. సిల్క్, ఐఫోన్లు, గాలి పటాలు, టెలివిజన్లు, పాదరక్షలు, ఫర్నిచర్ తదిత రాలపై కస్టమ్ సుంకాలను ఇష్టారాజ్యంగా పెంచేశారు. కేవలం ఒక పదిహేను రోజుల క్రితం దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఈఎఫ్) సదస్సులో ప్రసంగించిన సందర్భంగా ఉగ్రవాదం, వాతావరణ మార్పులు వంటి సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో స్వీయ రక్షణాత్మక విధానాలకు స్వస్తి పలకాలని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు భిన్నమైన బడ్జెట్ సరళిని గమనిస్తే చెప్పేదొకటి , చేసేది మరొకటి అన్న చందంగా మోడీ సర్కారు పాలన తీరు ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు.

ఆధార్ సమాచారం సురక్షితం : రవిశంకర్

న్యూఢిల్లీ : ఆధార్, యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) సమాచారం సురక్షితంగా ఉందని, ఎలక్ట్రానిక్ సాంకేతికశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ శుక్రవారం రాజ్యసభలో వెల్లడించారు. ఆధార్ సమాచారాన్ని అమ్ముకుంటున్నా రన్నది పూర్తిగా అవాస్తవమని, సమాచారం పూర్తి భద్రతతో ఉందన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన నీరజ్ శేఖర్ ఆధార్ సమాచారం రూ.500లకు అమ్ముతున్నారని మీడియా వెల్లడిస్తుందన్న ప్రశ్నకు ఆయన పై విధంగా సమాధానం ఇచ్చారు. ప్రజా సమస్యలు తెలుసుకుంటానికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ అధికారుల కోసం సమాచారాన్ని అందుబాటులో ఉంచుతున్నామని అయితే సమాచారాన్ని కారుచౌకగా అమ్ముకుంటున్నారన్న విషయం పూర్తిగా వాస్తవ విరుద్ధమని మంత్రి వివరించారు. కేవలం రూ. 500లకు ప్రైవేటు వ్యక్తి వేలాదిమంది సమాచారాన్ని అమ్ముకున్నాడని ప్రైవేటు వ్యక్తిపై ఆధార్ , ఐటీ చట్టాలతో జనవరి 4న పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి

పాట్నా : బీహారులో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురు మృతి చెందగా, చాలామంది గాయాలపాలయ్యారని పోలీసులు వెల్లడించారు. సివన్, బెగుసరాయ్‌ల్లో ఈ ఘటనలు జరిగాయన్నారు. మొదటి ప్రమాదంలో ముగ్గురు మహిళలతో సహా ఒక శిశువు రైల్వే బ్రిడ్జి నుంచి పడి మృతి చెందారన్నారు. సివన్ కుట్చెరి రైల్వే స్టేషన్‌ను చేరుకుంటానికి వారంతా దహా నదిని వంతెనపై దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించిందన్నారు. ఆ బ్రిడ్జిపై వస్తున్న ప్యాసెంజరు రైలు వారి సమీపిస్తుండగా వారంతా నదిలోకి దూకారన్నారు. గోరఖ్‌పూర్‌లోని తూర్పు రైల్వే ప్రజా సంబంధాల అధికారి (పీఆర్వో) సంజయ్ యాదవ్ మాట్లాడుతూ ట్రెన్ డ్రైవర్ వచ్చే స్టేషన్‌కు ఎవరినీ బ్రిడ్జిపై నడవనీయవద్దని స్టేషన్ మాస్టారికి సమాచారం ఇచ్చాడన్నారు. తీవ్రగాయాలైన వ్యక్తిని మాత్రం పీఎంసీహెచ్ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతి చెందిన వారిని ఖుష్బూ నిషాన్, జుని ఖటూన్, సరస్వతీదేవి, బాలుడు మున్నాగా గుర్తించారు. గాయపడిన వ్యక్తిని అస్లాం అన్సారీగా గుర్తించామని డీఎం వెల్లడించారు. మరొక ఘటనలో ఆటో ట్రక్‌ను ఢీ కొట్టడంతో ఒక జంట మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయని పోలీసు అధికారి తెలిపారు. మృతి చెందిన వ్యక్తిని సురేష్ షాగా గుర్తించగా, మహిళను గుర్తించాల్సి ఉంది. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించి, ట్రక్‌ను స్వాధీనం చేసుకున్నామని, డ్రైవరు పారిపోయాడని పోలీసులు వెల్లడించారు.

నిరసన హోరు

ఏపీకి సాయం కోసం కేవీపీ మౌననిరసన









రాజ్యసభలో పోడియం వద్ద విపక్ష సభ్యుల నిరసన, నినాదాలు

- కురియన్ అసహనం : చర్యలు తీసుకుంటానంటూ హెచ్చరిక
- యూపీ సర్కార్ సమాధానమివ్వాలి : ఎస్పీ డిమాండు
- ఢిల్లీ సీలింగ్‌పై ఆప్ నిరసన : మద్దతిచ్చిన ఆజాద్
- కార్యకలాపాలకు అంతరాయం : సభ వాయిదా
- ఢిల్లీ ప్రజలను ఆదుకోండి : కేంద్రానికి ఆజాద్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : కేంద్రబడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం, ఉత్తరప్రదేశ్‌లో కాస్‌గంజ్ ఘర్షణ, ఢిల్లీ సీలింగ్ అంశాలపై శుక్రవారం రాజ్యసభ దద్దరిల్లింది. విపక్షాల నిరసనలతో సభ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడింది. దీంతో సభ వాయిదా పడింది. ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్‌లో అన్యాయం జరిగిందంటూ ఏపీకి చెందిన కాంగ్రెస్ పార్టీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు నిరసన వ్యక్తంచేశారు. కాస్‌గంజ్ ఘర్షణలు, ఢిల్లీ సీలింగ్ అంశాలపై ప్రతిపక్ష కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యులు ధ్వజమెత్తారు. తొలుత పశ్చిమబెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం మృతులకు నివాళులర్పించి, సభ కార్యకలాపాలను రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ పీజే కురియన్ ప్రారంభించారు. జీరో అవర్‌లో మాట్లాడేందుకు సభ్యులకు అనుమతిచ్చారు. కేవీపీ రామచంద్రరావు ట్రెజరీ బెంచీల వద్దకు వెళ్లి 'హెల్ప్ ఆంధ్రప్రదేశ్' (ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోండి) అన్న ప్లకార్డును ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. కురియన్ ఆయనను పలుమార్లు కూర్చోవాల్సిందిగా కోరారు. తగిన విధంగా నోటీసు ఇచ్చి ఈ అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఆయినా రామచంద్రరావు వెనక్కుతగ్గలేదు. మౌనంగానే తన నిరసనను కొనసాగించారు. దీంతో అసహనానికి గురైన కురియన్ నోరుజారారు. 'ఆయనేం చేస్తున్నారో చూడండి.. ఎవరైనా ఏదైనా చేయండి.. ఆయనకేమైనా పిచ్చా.. ఆయనపై చర్యలు తీసుకుంటా.. ఏ ఆయనపై ఎందుకని చర్యలు తీసుకోకూడదు.. మీ పార్టీ సభ్యుడిని అదుపు చేయలేరా..' అంటూ రామచంద్రరావు తీరును ఉద్దేశించి రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్‌తో కురియన్ అన్నారు. అదే సమయంలో ఎస్పీ సభ్యులు రామ్‌గోపాల్ యాదవ్, నరేష్ అగర్వాల్ కాస్‌గంజ్‌లో మతఘర్షణల అంశాన్ని ప్రస్తావించి, మైనారిటీల గొంతుకను నొక్కేందుకు యూపీ ప్రభుత్వం యత్నిస్తోందని మండిపడ్డారు. దీనిపై ప్రభుత్వం సమాధానం ఇవ్వాలంటూ డిమాండు చేశారు.

'కాస్‌గంజ్‌లో మైనారిటీలు అణచివేతకు గురవుతున్నారు. అధికార యంత్రాంగం అండతో వారి ఇళ్లను కొల్లగొడుతున్నారు. వారి గళాన్ని నొక్కేస్తున్నారు. వారిని అరెస్టు చేసి వేధిస్తున్నారు' అని యాదవ్ అన్నారు. యాదవ్ మాట్లాడుతుండగా ఎస్పీ సభ్యులంతా చైర్మన్ పోడియం వద్దకు వెళ్లి పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఆప్ సభ్యులు సైతం సంజయ్ సింగ్ సారథ్యంలో పోడియం వద్దకు చేరుకొని నిరసన తెలిపారు. ఢిల్లీలో సీలింగ్ డ్రైవ్‌ను వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. ఎస్పీ, ఆప్ నేతలతో పాటుగానే కేవీపీ తన నిరసనను కొనసాగించారు. నరేష్ అగర్వాల్ మాట్లాడుతూ కాస్‌గంజ్ హింసకు ఉత్తరప్రదేశ్ ప్రభుత్వమే కారణమన్నారు. కాస్‌గంజ్‌లో ఏం జరిగినా అది రాష్ట్ర ప్రభుత్వం కనుసన్నల్లోనే జరుగుతోందని, ప్రభుత్వం ఏకపక్షంగానే చర్యలు తీసుకుంటోందని, దీనిపై వెంటనే సమాధానం ఇవ్వాలని అగర్వాల్ అన్నారు. తగిన విధంగా నోటీసులిచ్చి ఆయా అంశాలను ప్రస్తావించాలంటూ ఎస్పీ నేతలకు సూచించిన కురియన్... సమాధానం ఇవ్వాల్సిందిగా తాను ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురాలేనని చెప్పారు. 'సమాధనం ఇస్తారా.. లేదా అన్నది ప్రభుత్వమే నిర్ణయిస్తుంది.. ఇప్పటికి సభను వాయిదా వేయడం తప్ప నాకు మరో మార్గం లేదు' అంటూ విపక్షాల నిరసన నడుమ మధ్యాహ్నం 12 గంటలకు సభను వాయిదా వేశారు. తిరిగి సభా కార్యక్రమాలు మొదలుకాగానే ఆప్ నేతలు చైర్మన్ పోడియం వద్దకు చేరుకొని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఏడు లక్షల మందికిపైగా ఉన్న వర్తకుల జీవితాలతో కేంద్రప్రభుత్వం చెలగాటమాడు తోందని సంజయ్ సింగ్ ఆరోపించారు. ఈ అంశంపై తగిన విధంగా నోటీసు ఇచ్చి, సోమవారం చర్చించాలని కురియన్ ఆప్ సభ్యులకు సూచించారు. అయినా ఆప్ సభ్యులు నిరసనను కొనసాగించారు. 'ప్రతి ఎంపీకి ఢిల్లీ రెండో ఇల్లు. వారికి సహాయం చేయడం మన విధి. కేంద్రప్రభుత్వం ప్రేక్షక పాత్ర ఎలా పోషించగలదు. సమాధానం ఇవ్వాల్సిందే' అని ఆజాద్ అనడంతో ఆప్ సభికులు తిరిగి తమ స్థానాల్లో కూర్చొన్నారు. 'ఢిల్లీ ప్రజలను ఆదుకోండి' అంటూ కేంద్రప్రభుత్వానికి ఆజాద్ విజ్ఞప్తిచేశారు.

పోలీసుల అదుపులో జేకేఎల్ఎఫ్ నేత

శ్రీనగర్ : ఇటీవల సైన్యం కాల్పుల్లో పౌరుడు మృతిచెందిన ఘటనకు నిరసనగా శుక్ర వారం చేపడుతున్న ప్రదర్శనలో పాల్గొనేందుకు వెళుతున్న జమ్మూ, కాశ్మీర్ లిబరేషన్ ఫ్రంట్ (జేకేఎల్ఎఫ్) చీఫ్ మొహమ్మద్ యాసిన్ మాలిక్‌ను పోలీసులు అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక జమియా మసీదు నుంచి నుంచి ప్రారంభమయ్యే ర్యాలీలో పాల్గొనేందుకు ఆయన షోపియాన్‌కు చేరుకున్న సందర్భంలో అదుపులోకి తీసుకున్నారు. హురియత్ కాన్ఫరెన్స్ చైర్మన్ మిర్జా ఫారూఖ్‌ను కూడా ర్యాలీలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు గృహనిర్బంధం చేశారు.

'బోఫోర్స్' తీర్పుపై సీబీఐ సవాల్

న్యూఢిల్లీ : బోఫోర్స్ కేసులో నిందితులపై ఆరోపణలను తోసిపుచ్చుతూ ఢిల్లీ హైకోర్టు 2005లో ఇచ్చిన ఆదేశాలను సవాలుచేస్తూ సీబీఐ శుక్రవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. యూరప్ పారిశ్రామికవేత్తలు హిందూజా సోదరులతోపాటు నిందితులందరికీ ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తూ 2005 మే 31న హైకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేసింది. కొన్ని ముఖ్యమైన పత్రాలు, ఆధారాలతో పిటిషన్‌ను దాఖలు చేసింది.

వీధి కుక్కల దాడిలో పసికందు మృతి

భోపాల్ : ఓల్డ్ భోపాల్‌లో వీధి కుక్కల బారిన పడి 18 నెలల బాలుడు మృతిచెందాడని పోలీసులు శుక్రవారం తెలిపారు. ఈ ఘటన గురువారం గౌతంనగర్ పోలీసు స్టేషను పరిధిలో చోటుచేసుకుందని చెప్పారు. ఇంటి బయటకు వచ్చిన బాలుడుని ఐదారు వీధి కుక్కలు దాడి చేశాయని, బాలుడిని రక్షించేందుకు స్థానికులు చేసిన ప్రయత్నం ఫలించలేదన్నారు. వీధికుక్కలు బాలుడిని 50 అడుగుల దూరం వరకూ ఈడ్చుకు పోయాయని చెప్పారు. తీవ్రగాయాలైన బాలుడిని ఆసుపత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

ఢిల్లీలో పరువు హత్య

న్యూఢిల్లీ : ఢిల్లీలోని ఖ్యాలాలో పొరుగున ఉండే 23 ఏళ్ల యువకుడు తమ కుమార్తెతో సన్నిహితంగా ఉంటున్నాడన్న కారణంతో ఆమె కుటుంబసభ్యులు ఆయన మెడ నరికి చంపారని పోలీసులు శుక్రవారం తెలిపారు. మృతుడు ఫోటోగ్రాఫర్ అని తెలిపారు. రెండు, మూడేళ్లుగా పొరుగు ఇంట్లోని యువతితో సన్నిహితంగా ఆ యువకుడు ఉంటున్నాడని తెలియడంతో రెండు కుటుంబాల మధ్య వాదనలు జరిగాయని చెప్పారు. తాజాగా జరిగిన వాదన సందర్భంలో యువతి తల్లి, తండ్రి, మామయ్య, ఆమె మైనర్ తమ్ముడు యువకుడిని పట్టుకుని హత్య చేశారని తెలిపారు.

షోపియాన్ ఘటనపై సిట్‌తో దర్యాప్తు

జమ్మూ : షోపియాన్ జిల్లాలో సైన్యం కాల్పుల్లో ముగ్గురు పౌరులు మృతిచెందిన ఘటనపై దర్యాప్తునకు సిట్‌ను నియామకం చేయాలని జమ్మూ, కాశ్మీర్ శాసనసభ ప్రతిపక్ష నేత ఒమర్ అబ్దుల్లా శుక్రవారం శాసనసభలో డిమాండు చేశారు. పోలీసులు, సైన్యం దాఖలు చేసిన రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లపై ప్రస్తుతం వాదనలు జరుగుతున్నాయన్నారు. కాగా గత నెల 27న జిల్లాలో ఆందోళనకారులు ఆర్మీ కాన్వాయ్‌పై రాళ్లు రువ్వడంతో కాల్పులు జరిపినట్టు పోలీసులు, సైన్యం చెబుతోంది.

భూకబ్జా కేసులో లాయర్ అరెస్టు

ముజఫర్‌నగర్ : భూకబ్జా కేసులో ఓ న్యాయవాది, ఆయన అనుచరుడిని గ్యాంగ్‌స్టర్ యాక్ట్ కింది పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక న్యాయవాది రంజన్ మిట్టల్, ఆయన అనుచరుడు రాజీవ్ అగర్వాల్‌లను ఉత్తరప్రదేశ్ గ్యాంగ్‌స్టర్, యాంటి సోషల్ యాక్టివిటీస్(ప్రివెన్షన్) యాక్ట్ కింద అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటనలో జిల్లా బార్ అసోషియేషన్ అధ్యక్షుడితో పాటు కొందరు న్యాయవాదులు అరెస్టు అయిన న్యాయవాదికి మద్దతుగా ఆందోళనకు దిగారు. భూకబ్జా కేసులో రంజన్‌ను ఇరికించారని వారు ఆరోపించారు.

మేఘాలయ ఎన్నికలు-బీజేపీ తొలి జాబితా

షిల్లాంగ్ : ఫిబ్రవరి 27న జరగనున్న మేఘాలయ శాసనసభ ఎన్నికలకు బీజేపీ 45 అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. 60 అసెంబ్లీ సీట్లు ఉన్న మేఘాలయాలో మొత్తం సీట్లకు బీజేపీ పోటీ చేస్తుంది. విడుదల చేసిన జాబితాలో కాంగ్రెస్ మాజీ మంత్రి ఏఎల్ హెక్, రాష్ట్ర ఎన్సీపీ మాజీ అధ్యక్షుడు సంబోర్ షుల్లై, 8మంది మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారని మేఘాలయ బీజేపీ అధ్యక్షుడు షిబున్ లింగ్డో తెలిపారు. జాబితాలో ఇద్దరు మహిళా అభ్యర్థులు ఉన్నారు.

'సీలింగ్ డ్రైవ్' వద్దు: ప్రధానికి షీలా లేఖ

న్యూఢిల్లీ : 'సీలింగ్ డ్రైవ్' ఢిల్లీ వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశారు. 2006లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొన్నానని, ఈ విషయంపై లేఖ రాయగా, అప్పటి కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, వ్యాపారుల ఆస్తులను పరిరక్షించేలా ఆర్డినెన్స్‌ను జారీ చేసిందని ప్రధానికి రాసిన లేఖలో గుర్తు చేశారు.

త్రిపురలో 320 నామినేషన్లు

అగర్తాలా : ఫిబ్రవరి 18న జరగనున్న త్రిపుర శాసనసభ ఎన్నికలకు ఇప్పటి వరకు వివిధ రాజకీయపార్టీలు, ఇండిపెండెంట్ అభ్యర్థుల 320 నామినేషన్లు దాఖలయాయని ఎన్నికల అధికారులు తెలిపారు. గురువారం జరిగిన స్క్రూటినీ అనంతరం 307 నామినేషన్లు చెల్లుబాటు అయాయని, 13 నామినేషన్లు తిరస్కరించినట్టు వారు వెల్లడించారు. తిరస్కరణకు గురైన నామినేషన్లలో 5 బీజేపీ-5 ఇండిజెనస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపురకు చెందినవి కాగా, ఒక నామినేషన్ తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిదని, మిగిలినవి ఇండిపెండెంట్ అభ్యర్థులవని అధికారులు తెలిపారు.

క్రాస్ ఎగ్జామినేషన్ త్వరగా ముగించండి

న్యూఢిలీ : కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ క్రాస్ ఎగ్జామినేషన్‌ను ఫిబ్రవరి 12 నాటికి మూసివేయవల్సిందిగా ఢిల్లీ హైకోర్టు ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఆదేశించింది. కేజ్రీవాల్‌తో పాటు ఐదుగురిపై అరుణ్ జైట్లీ దాఖలు చేసిన పరువునష్టం కేసుపై ఢిల్లీ హైకోర్టు ఈ విధంగా స్పందించింది. క్రాస్ ఎగ్జామినేషన్ సందర్భంగా జైట్లీ 8 సార్లు వివిధ తేదిల్లో కోర్టుకు హాజరయ్యారని, జాయింట్ రిజిస్ట్రార్ రాకేష్ పండిట్ పేర్కొన్నారు.

దగ్గు మందు బాటిళ్లు స్వాధీనం

గువాహటి : నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో(ఎన్సీబీ) 1,200 కాఫ్ సిరప్ బ్యాటిళ్లను స్వాధీనం చేసుకొని, ఒక వ్యక్తిని అదుపులోకి ఎన్సీబీ తీసుకుంది. అందిన సమాచారం ప్రకారం ఖనాపరా ఏరియాలోని జాతీయ రహదారి-37పై ఉన్న వాహనంపై దాడి చేసి, దగ్గు మందు బ్యాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎన్సీబీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనకు బాధ్యుడైన వ్యక్తిని అదుపులోకి తీసుకొని, వాహనాన్ని సీజ్ చేశామని ఆ ప్రకటన పేర్కొంది.

లోయా కేసుపై సుప్రీం విచారణ

ఢిల్లీ: సీబీఐ ప్రత్యేక న్యాయమూర్తి బి.హెచ్.లోయా మరణంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశాలివ్వాలంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాలపై సుప్రీం కోర్టు శుక్రవారం విచారణ తిరిగి చేపట్టింది. సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసుపై విచారణ జరుపుతున్న లోయా 2014 డిసెంబర్ 1న గుండెపోటుతో మరణించారు. సహచరుడి కుమార్తె వివాహానికి నాగ్‌పూర్ వెళ్లినప్పుడు ఈ ఘటన జరిగింది. భారత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్ర, జస్టిస్ ఎ.ఎం.ఖాన్‌విల్కర్, జస్టిస్ డి.వై.చంద్రచూడ్‌లతో కూడిన ధర్మాసనం ఈ విచారణ చేపడుతుంది.

రూ.150 కోట్లతో గాంధీ జయంతి

ఢిల్లీ: మహాత్మాగాంధీ 150వ జయంతి వేడుకలను ఏడాదిపాటు(2019 అక్టోబరు 2నుంచి 2020 అక్టోబరు 2వరకు) ఘనంగా నిర్వహించనున్నారు. అందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకుగాను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జాతీయ కమిటీ ఏర్పాటైంది. ఈ వేడుకల కోసం తాజా బడ్జెట్‌లో రూ.150 కోట్లు కేటాయించింది.



ఇంజినీరింగ్‌లో విద్యాప్రమాణాలు పెరగాలి

విశాలాంధ్రబ్యూరో - గుంటూరు : రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో విద్యాప్రమాణాలు పెరగాలని, అప్పుడే విద్యార్థులు ఉన్నతంగా తీర్చిదిద్దబడతారని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తి జాస్తి చలమేశ్వర్ అన్నారు. గుంటూరు జేకేసీ కళాశాలలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ స్వర్ణోత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ చదువుకునేందుకు పేదలకు స్తోమత లేని రోజుల్లో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాలలను నిర్మించి విద్యాబుద్ధులు నేర్పించడం అభినందనీయమన్నారు. ఉన్నత ఆశయంతో యాభై సంవత్సరాలపాటు పేదవిద్యార్థుల అభ్యున్నతికి కృషిచేస్తున్న జేకేసీ కళాశాల లు మరింత అభివృద్ధి చెందాలన్నారు. రాష్ట్ర శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద రావు మాట్లాడుతూ నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఎనిమిది విద్యాసంస్థ లు కొనసాగడం ప్రశంసనీయమన్నారు. ఎన్నో వేల మంది విద్యార్థులను ఉన్నతులు గా తీర్చిదిద్దిన ఈ సంస్థలో విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు రెండుకోట్ల రూపాయలు విరాళం ఇచ్చేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీ సాంబశివరావు, సొసైటీ అధ్యక్షులు బసవ పున్నయ్య, గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే వేణుగోపాల్‌రెడ్డి, ఈస్ట్ ఎమ్మెల్యే ముస్తాఫా, మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ, ఏఎన్‌యూ ఉపకులపతి రాజేంద్ర ప్రసాద్, జేకేసీ ప్రతినిధి జాగర్లమూడి మురళీమోహన్, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాస్, సొసైటీ ఉపాధ్యక్షులు మద్దినేని గోపాలకృష్ణ, సిద్ధార్థ అకాడమీ అధ్యక్షులు వెంకటేశ్వరరావు, కార్యదర్శి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్



విశాలాంధ్రబ్యూరో - కర్నూలు : సెరూడ్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వ ర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి 16వ తేదీ వరకు కర్నూలులో జాతీయ స్థాయి టెన్నిస్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నీ నిర్వహణ కమిటీ డైరెక్టర్ గొర్ల మల్లికార్జున తెలిపారు. నగరంలోని జాయ్ హోంలో శుక్రవారం నిర్వహణ కమిటీ కార్యదర్శి ఎం.కమల్‌బాషాతో కలసి విలేకరులతో మాట్లాడుతూ 10, 11 తేదీల్లో క్వాలిఫైడ్ రౌండ్ ఉంటుందన్నారు. కర్నూలు క్లబ్‌లో 12వ తేదీ ఉదయం 9 గంటలకు టోర్నీ ప్రారంభమవుతుందన్నారు. నేషనల్ ఛాంపియన్ డాక్టర్ నిథిన్‌బిజ్జం, ప్రముఖ పారిశ్రామికవేత్త రావడ శ్రీనివాస్ కిరీటి పాల్గొంటారన్నారు. నగరంలోని కర్నూలు క్లబ్, పోలీసు పెరేడ్ గ్రౌండ్, ఆఫీసర్స్ క్లబ్, అచ్చీబర్స్ అకాడమీ కోర్టుల్లో కొనసాగే మ్యాచ్‌ల్లో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, ఛత్తీస్‌గడ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 168 మంది ఆల్ ఇండియా ర్యాంకర్స్ తలపడనున్నట్లు వివ రించారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో క్రీడాభిమానులను కనులవిందు చేయనున్నార న్నారు. 16వ తేదీన విజేతలకు బహుమతీ ప్రదానంతోపాటు ఆల్‌ఇండియా టెన్నిస్ అసోసియేషన్ కొత్త ర్యాంకుల ప్రకటనలతో టోర్నీ ముగుస్తుందని వారు తెలిపారు. సమావేశంలో పీఈటీ మల్లికార్జున, జిల్లా నెట్‌బాల్ సంఘం కార్యదర్శి రత్నమయ్య, ఫిజికల్ డైరెక్టర్ ఇస్మాయిల్, సెరూర్స్ జాయింట్ డైరెక్టర్ గొర్ల రాముడు తదితరులు పాల్గొన్నారు.

బెంగాల్ కూలీలను కాటేసిన కలుషిత ఆహారం

విశాలాంధ్ర - తుళ్ళూరు : పొట్టకూటి కోసం పశ్చిమబెంగాల్ నుంచి అమరావతికి వలస వచ్చిన ఓ నిర్మాణ సంస్థలో దినసరి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులను కల్తీ ఆహారం కాటేసింది. ఆహారం తీసుకున్న మరుసటి రోజు విరోచనాలు, వాంతులు కావడంతో ఎనిమిది మందిని తోటి కార్మికులు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో శుక్రవారం ఒకరు మృతి చెందగా, మరో ఏడుగురు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వీరి ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్టు సమాచారం. పశ్చిమబెంగాల్‌కు చెందిన కొందరు కార్మికులు జీవన ఉపాధికోసం ఏపీ నూతన రాజధాని అమరావతి ప్రాంతానికి వచ్చారు. అనంతవరం, నెక్కల్లు మధ్య ఆర్‌ఏబీఎస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీలో దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. గత నెల 31వ తేదీన తయారు చేసుకున్న ఆహారాన్ని మరుసటి రోజు తినడంతో ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వీరిలో సామ్రాట్ అనే కూలీ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 11 గంటల సమయంలో మృతి చెందారు. సమాచారం అందుకున్న తుళ్ళూరు ఎస్సై శ్రీనివాస్ సిబ్బందితో కూలీలు నివసిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు.

గొల్లలపేటలో అగ్నిప్రమాదం

విశాలాంధ్ర - గుర్ల : విజయనగరం జిల్లా గుర్ల మండలం గూడెం గ్రామంలోని గొల్లల పేటలో శుక్రవారం అగ్ని ప్రమా దంలో పది పూరిళ్లు దగ్ధమయ్యా యి. రూ.10 లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని రెవెన్యూ వర్గాల అంచనా. కరగాన రాములమ్మ తన ఇంట్లో దీపం పెట్టి పనులకు వెళ్లి పోవడంతో సామాన్లకు అంటుకోవడంతో మంటలు చెలరేగాయి. ఇంట్లోని దుస్తులు, తిండిగింజలు, వంటసామాగ్రి కాలి బూడిదయ్యాయి. అగ్నికీలలు మిగిలిన ఇళ్ళకు వ్యాపించాయి. చీపురుపల్లి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలిలో మంటలను అదుపులోకి తెచ్చాయి. ప్రమాదం తీరును రెవెన్యూ అధికారులు పరిశీలించారు.

15 మందిపై విరుచుకుపడ్డ పిచ్చికుక్కలు

చిన్నారులను పీకేశాయి - ఆస్పత్రికి క్యూకట్టిన క్షతగాత్రులు



విశాలాంధ్ర - గురజాల : గుంటూరు జిల్లా గురజాల పట్టణంలో శుక్రవారం మధ్యాహ్నం మూడు పిచ్చికుక్కలు జనంపై విరుచుకుపడ్డాయి. వీధుల వెంట పరుగులుతీస్తూ 15 మందికి కాటేశాయి. తొలుత స్థానిక కాలేజీ సెంటర్లో ఇంటర్ విద్యార్థి మోహన్‌రెడ్డిని కుక్క కరవడంతో హుటాహుటిన ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తర్వాత మోహన్‌రెడ్డి, సాయిరాం, లేళ్ళ కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, షేక్ జానీభాషా, కోటేశ్వరరావు, కత్తి సుందరమ్మ, సురేంద్ర, సాల్మన్, సైదా నాయక్‌తోపాటు 15 మంది కుక్కలదాడిలో గాయపడి ఆస్పత్రికి క్యూ కట్టారు. చిన్నారులు అవినాష్ నాయక్(రెండేళ్ల), నల్లా కృష్ణయ్య తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ఆస్పత్రికి తరలించారు.

ఆర్థిక రాజధానిలో హత్యల అలజడి

- వారానికి నాలుగు హత్యలు, అయిదు దోపిడీలు
- పెరుగుతున్న కిరాయి హత్యల సంస్కృతి
- వరుస దుర్ఘటనలతో ప్రజల్లో భయాందోళనలు

విశాలాంధ్ర - విశాఖపట్నం : నవ్యాంధ్ర ఆర్థిక రాజధాని విశాఖపట్నంలో వరుస హత్యలు, దోపిడీలు అలజడి రేపుతున్నాయి. శరవేగంగా అభివృద్ధి చెందుతూ దేశంలోనే స్మార్ట్ సిటీగా ఎంపికైన నగరంగా, సిటీ ఆఫ్ డెస్టినీగా విశాఖకు గొప్ప పేరుంది. వీటితోపాటు సుందరమైన సాగరతీరం, విభిన్న రంగాల పరిశ్రమలు, అంతర్జాతీయ స్థాయి ఎయిర్‌పోర్టు, సీ పోర్టు ఇవన్నీ అదనపు సొబగులు. ఎడ్యుకేషన్ హబ్, టెక్నాలజీ హబ్, నాలెడ్జి హబ్, ఇండస్ట్రియల్ హబ్, టూరిజం హబ్, హెల్త్‌హబ్, ఐటీ హబ్ తదితర హబ్‌ల మయం విశాఖ అంటూ ముఖ్యమంత్రి సహా మంత్రుల ప్రకటనలు. త్వరలో నగరానికి ఫార్మారంగ పరిశ్రమలు, చిత్ర పరిశ్రమ అంటూ ఊరింపు మాటలు. ఈ నేపథ్యంలోనే నగరానికి పర్యాటకుల రాక కూడా తక్కువేం కాదు. సీజన్ అన్‌సీజన్ అంటూ తేడా లేకుండా వారి తాకిడి ఉంటుంది. నగర ప్రాభవానికి బలం చేకూర్చేలా ప్రతిష్టాత్మక సదస్సుల నిర్వహణ అన్నీ ఇక్కడే.. మరీ ముఖ్యంగా రాష్ట్ర విభజన జరిగిన తరువాత జాతీయ, అంతర్జాతీయ సదస్సుల నిర్వహణ అంతా విశాఖలోనే. దీంతో సాధారణంగానే ప్రముఖుల రాకపోకలు. ఇంత వరకు బాగానే ఉంది.

కానీ ఇదంతా నాణానికి ఓవైపు... మరో వైపు వరుస హత్యలు, దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు, అన్‌లైన్ మోసాలు, బోర్డు తిప్పేస్తున్న చిట్‌ఫండ్ కంపెనీలు,



గంజాయి తదితర మత్తు పదార్థాల విక్రయాలు, హైటెక్ వ్యభిచారం వీటన్నింటికీ కేరాఫ్ అడ్రస్‌గా విశాఖ నిలుస్తోంది. ఇటీవలి కాలంలో వారానికి నాలుగు హత్యలు, అయిదు దోపిడీలు విశాఖ కీర్తిని దిగజారుస్తున్నాయి. గడిచిన వారంరోజుల్లో యోగా టీచర్ హత్య, జాలారిపేటలో అన్నను చంపిన తమ్ముడు, ఏయూ క్వార్టర్స్‌లో రైల్వే రిటైర్డ్ ఉద్యోగి హత్య, నబ్బవరం రౌడీషీటరు హత్య, నిందితుడిపై హత్యాయత్నం, ఆనందపురంలో ఓ యువకుడు హత్య, శుక్రవారం తాజాగా స్టీల్‌ప్లాంట్ సెక్టార్-5లో పట్టపగలే యువకుడు దారుణ హత్య ఇలా వరుస హత్యలతో నగరం భీతిల్లుతోంది. ఓపక్క రియల్ ఎస్టేట్ రంగం, మరోపక్క వ్యాపార రంగం విస్తరిస్తున్న తరుణంలో విశాఖలో నేర సంస్కృతి విలయతాండవం చేస్తోంది.

కొరవడిన పోలీస్ నిఘా

అభివృద్ధి చెందుతున్న నగరాలలో అంతే స్థాయిలో అసాంఘిక కార్యకలాపాలు జరగడం సర్వ సాధారణమని నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న సాంకేతికతను వినియోగించుకుని వైజాగ్ లాంటి నగరాల్లో సైబర్ నేరాలు తరహా చోటు చేసుకోవడం పట్ల పెద్దగా ఆశ్చర్యపోనక్కర్లేదు. కానీ దీనికి భిన్నంగా కత్తుల సంస్కృతి విస్తరించడం, కిరాయి హత్యలు జరగడం మాత్రం ఆందోళన కలిగించే విషయమే. ఈ విషయాలే నగర ప్రజల భయాందోళనలకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. పాతకాలం నాటి కక్షలు, కార్పణ్యాలున్న ప్రాంతాలలో జరిగేలా కిరాయి హత్యలు నగరంలో చోటు చేసుకోవడం మాత్రం బాధాకరమని స్థానికులు అంటున్నారు. గత ఏడాది జరిగిన హత్యలు, హత్యాయత్నాలు పరిశీలిస్తే ఎక్కువ సంఖ్యలో వీటికి పాల్పడింది గతంలో నేర చరిత్ర ఉన్నవారే. ఇక్కడే పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. వారిలో వారు ఆధిపత్య పోరులో కొన్ని, వారి అనుచరులుగా ఏర్పడిన మరి కొంత మంది భాగం పంచుకున్న నేరాలు కొన్ని. మొత్తమ్మీద పాతనేరస్తుల పాత్ర ఇప్పుడు జరుగుతున్న నేరాల్లో స్పష్టంగా తెలుస్తోంది. కొన్ని దొంగతనాల కేసులు మినహాయిస్తే మిగతా నేరాలన్నింటిలో కూడా ఆర్థిక లావాదేవీల పాత్ర ఉన్నట్లు తేటతెల్లం అవుతోంది. ఇకనైనా పోలీసులు పాత నేరస్తులపై నిత్యం నిఘా ఉంచకుంటే విశాఖ నగర ప్రతిష్టను చేజేతులా నాశనం చేసుకునే వారమవుతామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేరాలు అదుపు చేయకుంటే నిత్యం నగరానికి వచ్చే ప్రముఖులు, పర్యాటకులపై కూడా ఈ ప్రభావం పడుతుందని, తద్వారా విశాఖకు ఆర్థికంగానూ నష్టం చేకూరుతుందని వారు చెబుతున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఇకనైనా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విశాఖ ప్రజలు కోరుతున్నారు.

అప్పుల బాధ తాళలేక
అన్నదాత ఆత్మహత్య

విశాలాంధ్ర - బేస్తవారిపేట : వ్యవసాయంలో నష్టాల కారణంగా చేసిన అప్పులబాధ తట్టుకోలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం పిటికాయగుళ్ల గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రైతు చేగిరెడ్డి వెంకటరెడ్డి (42) తన ఎకరన్నర పొలంతోపాటు మరో ఏడున్నర ఎకరాలు కౌలుకు చేస్తున్నాడు. మొత్తం తొమ్మిది ఎకరాలలో పత్తి, మిరప పంటలు వేశాడు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పొలంలో ఆరు బోర్లు వేసినా 5 బోర్లలో చుక్కనీరు కూడా పడలేదు. ఒక బోరులో మాత్రం అరకొర నీరు బయటకొచ్చింది. సాగునీరు అందక పంటలు ఎండిపోయాయి. దీంతో వెంకటరెడ్డి లక్షల రూపాయల అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టాడు. పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియని స్థితిలో గురువారం పురుగుమందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. భర్త మృతితో భార్య రాజ్యలక్ష్మి, బంధువులు బోరున విలపించారు. స్థానిక ఎస్సై ఎ. శశికుమార్ ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదల ఇళ్లు కూల్చకుండా
కోనసీమ రైల్వేలైన్ ఎలైన్‌మెంట్ మార్చాల్సిందే



విశాలాంధ్ర - రాజోలు : కోనసీమ రైల్వేలైన్ నిర్మాణంలో పేదల ఇళ్ళు తొలగించకుండా ఎలైన్‌మెంట్ మార్చాలంటూ సీపీఐ, సామాజిక హక్కుల వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం తూర్పు గోదావరి జిల్లా రాజోలు కేంద్రంగా భారీ ధర్నా నిర్వహించారు. రైల్వేలైను ఏర్పాటులో ఇళ్లు కోల్పోతున్న బాధితులు మూకుమ్మడి శివకోడు లాకు సెంటరు వద్దకు చేరుకుని జాతీయరహదారి 216పై ధర్నా చేశారు. శివకోడు లాకు నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడి తమ బతుకులు బజారుకీడ్చవద్దంటూ నినదించారు.

రాజోలు మండలంలోని శివకోడు, కొండేలంక, మల్కిపురం మండలంలోని మేడిచర్లపాలెం, దిండి గ్రామాల వారు పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రస్తుత ఎలైన్‌మెంట్ మార్చి కొత్త ఎలైన్‌మెంటు తయారుచేసేలా పాలకులు తక్షణ చర్యలు తీసుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ నూతన రైల్వేలైన్ నిర్మాణంతో నిరుపేదలకు చెందిన 100 ఇళ్లు నేలమట్టమవుతాయన్నారు.

కొద్దిమంది స్వార్థం కోసం శివకోడు, కొండేలంక, మేడిచర్లపాలెం, దిండి గ్రామాల్లో నిరుపేదలకు తీవ్రనష్టం కలిగించడం అన్యాయమన్నారు. ఇప్పటికే ఓఎన్‌జీసీ పైపులైన్ ఏర్పాటుతో పేదలు తమ భూములను కోల్పోయారన్నారు. పేదల ఇళ్లకు నష్టం వాటిల్లకుండా రైల్వేలైను నిర్మించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మల్కిపురం మండల కార్యదర్శి దేవ సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ, మేడిచర్లపాలెం సర్పంచ్ మేడిచర్ల శ్రీనివాస్‌తోపాటు గుబ్బల సత్యనారాయణ, రాపాక రత్నరాజు, దబ్బా విజయవర్మ పాల్గొన్నారు.

నాటక కళతో సమాజ చైతన్యం

ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్



విశాలాంధ్ర - తెనాలి : సమాజ చైతన్యానికి నాటక కళ ఎంతగానో దోహదం చేస్తుందని ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో రాష్ట్ర చలనచిత్ర, టీవీ., నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో 2017 నంది నాటకోత్సవాలను శుక్రవారం తెనాలిలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆలపాటి ప్రారంభించారు. నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ అధ్యక్షత వహించిన సభలో ఆలపాటి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కళాకారులు తాము ఎంచుకున్న మార్గంలో సమస్యలపై ప్రజలను చైతన్య పర్చే నాటక కళకు తెనాలికి ఓ అనుబంధం ఉందని, నంది నాటకోత్సవాల ద్వారా ఇది మరింత బలపడుతుందన్నారు. తెలుగు వాడిగా చరిత్ర తెలుసుకుని వర్తమానాన్ని సరిదిద్దుకుని భవిష్యత్ వైపు భావితరాలు అడుగులు వేసేందుకు నాటక కళ చక్కని సందేశాత్మకంగా నిలుస్తుందన్నారు. గుమ్మడి గోపాలకృష్ణ మాట్లాడుతూ నాటక రంగానికి సీఎం చంద్రబాబు ప్రసాదించిన వరం నంది నాటకోత్సవం అన్నారు. గతంలో స్క్రూట్నీ ద్వారా నాటకాలను ప్రదర్శనకు ఎంపిక చేసే వారని, దీంతో ఎంతో మంది ఆసక్తి కలిగిన కళాకారులు అవకాశాల కోసం ఎదురుచూసేవారన్నారు. అలాంటి పరిస్థితుల నుంచి నంది నాటకోత్సవాల్లో ప్రదర్శనా అవకాశాలను అందరికీ కల్పించడం ఓ సువర్ణ అవకాశమన్నారు. 38 రోజులపాటు తెనాలిలో నంది నాటకోత్సవ పండుగలు నిర్వహించుకోవడం గొప్ప అంశమన్నారు. లలిత కళల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకుని సభా మర్యాదలు పొందాలని చిన్నారులకు సూచించారు. భారతీయ సంస్కృతి, కళలు, సాహిత్యం, ఆధ్యాత్మికత అంశాల ఆరాధకుడు సీఎం చంద్రబాబునాయుడు అని కొనియాడారు.

ఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్ శేషతల్పసాయి మాట్లాడుతూ నంది నాటకోత్సవాల నివేదికను సమర్పించారు. నంది నాటకోత్సవాలు తెనాలి, కాకినాడ, రాజమండ్రి, నంద్యాల ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, కృష్ణాజిల్లాల పరిధిలో తెనాలి కేంద్రంగా 184సమాజాలు నాటక ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు వివరించారు.

జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన నందినాటకోత్సవాల ప్రారంభ సభకు నటులు ఎంపీ కన్నేశ్వరరావు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పెండేల వెంకట్రావు, కమిషనర్ కె.శకుంతల, ఎఫ్‌డీసీ జనరల్ మేనేజర్ శేషతల్పసాయి, కావేటి సామ్రాజ్యం, దుగ్గిరాల మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ చందు సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు. ప్రారంభ సభకు ముందుగా నాదస్వర జతులతో మంగళప్రదమైన డోలు కచేరీ కార్యక్రమం, అభయ హర్షిణి దశావతారల నృత్యప్రదర్శన, ఆరాధ్యుల తేజశ్వి ప్రఖ్య బృందం మా తెలుగుతల్లికి నృత్యరూపకం, ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



మహిళలు పారిశ్రామికంగా ఎదగాలి

విశాలాంధ్ర - ఏఎన్‌యూ : మహిళలు పారిశ్రామికంగా ఎదగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర మహిళాశిశు సంక్షేమ శాఖ కార్యదర్శి కె.సునీత అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ సోషియాలజీ, సోషల్ వర్క్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో మూడురోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. మహిళల పారిశ్రామికీకరణ, ప్రపంచీకరణ, సవాళ్ళు అనే అంశంపై కె.సునీత ప్రారంభోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా అభివృద్ధి సాధించారన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయినప్పటికీ ఆశించిన మేర మహిళలు అభివృద్ధి సాధించలేదన్నారు. భారతదేశ అభివృద్ధి మహిళలపై ఆధారపడి ఉందని, వీరి అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నేషనల్ సోషల్ సైన్స్ ఇన్‌స్టిట్యూట్ ఎండీ, ప్రొ॥ డీకే వర్మ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలంటే, వారిలో దాగి ఉన్న నైపుణ్యతా విలువలను వెలికితీసి సమాజహితానికి తోడ్పడేలా కృషి చేయాలన్నారు.

పడిపోతున్న ధాన్యం ధరలు

- ఆందోళనలో అన్నదాతలు
- పట్టించుకోని పాలకులు
- కొనుగోలుకు ముందుకురాని వ్యాపారులు

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ధాన్యం ధరలు దిగజారుతుండడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. రైతుకు భరోసా కల్పించేందుకు వ్యవసాయానికి పెద్ద పీట వేస్తామని పాలకులు వాగ్దానాలు చేయడం తప్ప ఆచరణలో అమలు కావడంలేదని ఆవేదన చెందుతున్నాడు. వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతున్నా పాలకులు మద్దతు ధర కల్పించక పోవడంపై రగలిపోతున్నాడు. ఎకరాకు రూ. 15వేల నుంచి రూ. 18 వేల వరకు భూమి కౌలు చెల్లించి పంట సాగు కోసం మరో రూ. 27 వేల నుంచి రూ. 30 వేల వరకు పెట్టుబడులు పెట్టి నష్టాలు చవిచూడటంతో కుమిలిపోతున్నాడు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతోపాటు ఈ ప్రాంతంలో సాగు నీరు విడుదల కావడంతో దిగుబడులు రైతన్నకు కొంత ఊరటనిచ్చాయి. గత ఏడాది డిసెంబర్ రెండవ వారంలో 75 కిలోల బీపీటీ ధాన్యం బస్తా రూ.





1,470 నుంచి రూ. 1490, సాధారణ రకాలు రూ. 1420 నుంచి రూ. 1430 వరకు ధర పలికాయి. నేడు బీపీటీ ధర రూ.1400, సాధారణ రకాలు రూ.1270కు పడిపోయాయి. సాగు కోసం చేసిన అప్పులకు వడ్డీలు పెరుగుతుండడంతో ప్రస్తుత ధరకు ధాన్యాన్ని అమ్మినా కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు రావడంలేదని రైతులు కుమిలిపోతున్నాడు. మరో వైపు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలలో సాధారణ రకం ధాన్యం 75 కిలోల బస్తాకు రూ.1162.50, ఏ గ్రేడ్ ధాన్యం రూ. 1192.50 వంతున మద్దతు ధరను నిర్ణయించారు. కేంద్రానికి ధాన్యం తీసుకు వెళ్ళేందుకు బాడుగ రైతే చెల్లించాల్సిఉంది. దింపుడు కూలీ, కాటా కూలీ, గోతం ఖర్చు భరించాల్సి ఉంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించిన మద్దతు ధర అన్నదాతను కన్నీరు పెట్టిస్తోంది. ఖరీఫ్ వరి ధాన్యం కుప్పల రూపంలో పంట భూములలోనే ఉన్నాయి. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో గుంటూరుజిల్లా రేపల్లె వ్యవసాయ సబ్ డివిజన్‌లో లక్ష ఎకరాలకు పైగా వరి పంట సాగు చేశారు. అధిక శాతం కౌలు రైతులు కావడంతో ఒక వైపు కౌలు ధరలు, మరో వైపు పెరిగిపోతున్న పెట్టుబడులతో కష్టాలు పడుతున్నాడు. రాష్ట్ర అభివృద్ధికి పునాదిగా ఉన్న వ్యవసాయ రంగాన్ని పాలకులు విస్మరిస్తున్నారని అన్నదాత ఆవేదన చెందుతున్నాడు. 65శాతం మంది ప్రజానీకం వ్యవసాయమే జీవనాధారంగా బతుకు సాగిస్తున్నారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పార్లమెంట్‌లో రైతు బడ్జెట్ ప్రవేశపెట్టామని చెప్పుకుంటున్న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధి ప్రస్తావన లేకపోవడం రైతాంగాన్ని మోసం చేయడమేనన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ నుంచే కనీస మద్దతు ధర ఉత్పాదక వ్యయంకంటే ఒక్కటిన్నర శాతం రెట్లు పెంపుదల చేసి రైతును ఆదుకుంటామని చెప్తున్నా కేటాయింపులు మాత్రం నామమాత్రంగానే ఉన్నాయని రైతులు అంటున్నారు.

ఆశాజనకంగా జొన్న :

ఈ ఏడాది రబీ సీజన్‌ను పురస్కరించుకుని మండలంలోని మాగాణి భూములలో సాగు చేసిన తెల్లజొన్న, మొక్కజొన్న పైర్లు ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాది రబీలో మాగాణి భూములలో సాగు చేసిన మినుము పంటను వైరస్ తెగుళ్ళు ఆశించడంతో పెట్టుబడులను సైతం నష్టపోయిన రైతాంగం ఈ సంవత్సరం మొక్కజొన్న, తెల్లజొన్న పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతోపాటు ఇటీవల 10 రోజుల పాటు దట్టమైన మంచు కురవడంతో సదరు పైర్లు ఏపుగా పెరిగి రైతన్నను మురిపిస్తున్నాయి. కొందరు రైతులు సాగుచేసిన మినుము పైరులో అక్కడక్కడ పల్లాకు తెగులు కనిపిస్తున్నా గత ఏడాదితో పోల్చుకుంటే కొంతమేరకు ఆశాజనకంగానే ఉంది.

రాజ్యసభలో రెండు బిల్లులు ప్రవేశపెట్టిన విజయ్‌సాయిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో - న్యూఢిల్లీ : వైసీపీ ఎంపీ విజయ్‌సాయిరెడ్డి శుక్రవారం రాజ్యసభలో రెండు ప్రైవేటు మెంబరు బిల్లులు ప్రవేశపెట్టారు. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించాలని విజయసాయి రెడ్డి పేర్కొన్నారు. ఓబీసీ కమిషన్ కు రాజ్యాంగబద్ధత కల్పించేందుకు వైసీపీ మద్దతిస్తోందన్నారు. బీసీ రిజర్వేషన్లకోసం ప్రైవేట్ మెంబర్ బిల్లు పెట్టామని, ఆర్టికల్ 330ఏ, ఆర్టికల్ 332 ఏ, రెండు సవరణలను ప్రతిపాదించామన్నారు.బీసీల హక్కులను పరిరక్షించేందుకు వైసీపీ కట్టుబడి ఉందన్నారు. బీసీ కమిషన్ కు రాజ్యాంగబద్ధత కల్పించే బిల్లుకు వైసీపీ సంపూర్ణ మద్దతిస్తుందన్నారు. ఆర్టికల్ 15(4), 15(5), 16 (4)ను ప్రతిపాదిస్తూ మరొక బిల్లు , బీసీలకు ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన కల్పించాలని బిల్లు పెట్టామన్నారు.ఎస్సీ,ఎస్టీల్లాగే జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లివ్వాలని, ఎస్సీ ఎస్టీల రిజర్వేషన్ల జోలికెళ్లకుండా వాటిని కొనసాగించాలన్నారు.

మధ్యతరగతిపై కరుణ లేదు

బడ్జెట్‌పై కమల్‌హాసన్ వ్యాఖ్య



చెన్నై : కేంద్ర ప్రభుత్వం దృష్టి ఉన్నట్టుండి రైతులు, గ్రామీణ ప్రాంతాల మీదకు మళ్లిందని, ఇందుకు సంతోషించాలని ప్రముఖ సినీనటులు కమల్ హాసన్ పేర్కొన్నారు. ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలపై కమల్ హాసన్ స్పందించారు. మధ్యతరగతి వారి విషయంలో మాత్రం బడ్జెట్ విభిన్నంగా ఉన్నదని అన్నారు. "నాకు అర్థమైనంత వరకు బడ్జెట్ దిశ రైతులు, గ్రామీణ ప్రాంతాల వైపు మళ్లింది. ఒక రకంగా ఇది ఓదార్పులాంటిది" అని పేర్కొన్నారు. త్వరలో రాజకీయాలలోకి రానున్నట్టు కమల్ హాసన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

బీజేపీపై టీజీ ఫైర్...!



హైదరాబాద్ : రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను బీజేపీ సర్కారు తుంగలోకి తొక్కడంపై తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంబంధించి నిధుల ఊసే లేకపోవడంపై కేంద్రంలోని అధికార బీజేపీపై టీడీపీ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే మిత్రపక్షమైన బీజేపీపై టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అసంతృప్తిని వ్యక్తం చేశారు. తాజాగా టీడీపీ ఎంపీ టీజీ వెంకటేశ్ బీజేపీపై నిప్పులు చెరిగారు. 'రాజీనామాలు, బహిష్కరణలపై ప్రకటనలు వద్ద'ని చంద్రబాబు సూచించి 24 గంటలు గడవకముందే బీజేపీ పొగరు దించుతామని, జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక కూటమికి చంద్రబాబు నాయకత్వం వహిస్తారని వెంకటేశ్ చెప్పారు. టీజీ ఢిల్లీలో శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ బీజేపీ అధిష్ఠానంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ నాయకుడిని బీజేపీ అవమానిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. "చక్రం తిప్పడంలో సిద్ధహస్తుడైన చంద్రబాబునే బీజేపీ పట్టించుకోవడం లేదు. ఒంటరిగా మెజారిటీ సీట్లు ఉన్నాయన్న పొగరుతోనే బీజేపీ తన మిత్రులను లెక్క చేయడం లేదు. ఏపీలో టీడీపీ, మహారాష్ట్రలో శివసేనను నిర్లక్ష్యం చేస్తోంది. ఇప్పుడు బీజేపీ పొగరు దించాల్సిన అవసరం ఉంది. బాబును ఎప్పుడూ తక్కువ అంచనా వెయ్యొద్దు. బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో కూటమికి చంద్రబాబును మించిన నాయకులు లేరు. ప్రేమగా పనులు చేయించుకుందామన్న ఉద్దేశంతోనే ఇన్నాళ్లూ ఊరుకున్నాం. ఏపీకి ప్రత్యేక హోదా బదులు ప్యాకేజీ ఇస్తానని అంటే ఒప్పుకున్నాం. ఇప్పుడా ప్యాకేజీ కూడా లేదు. కాబట్టి మేం మళ్లీ ప్రత్యేక హోదాను డిమాండు చేస్తాం. కేంద్ర ప్రభుత్వంపై యుద్ధం చేస్తాం. ఇందుకు మూడంచెల వ్యూహాన్ని సిద్ధం చేశాం. మొదట కేబినెట్‌లోని టీడీపీ మంత్రుల రాజీనామా, రెండో దశలో ఎంపీల రాజీనామాల గురించి ఆలోచిస్తున్నాం. మూడో అడుగులో బీజేపీతో తెగదెంపులు చేసుకుంటాం. బీజేపీ ప్రస్తుతం బలహీన పడుతోంది. ఇటీవల ఉప ఎన్నికల్లో ఆ పార్టీ ఎదురుదెబ్బలు తిన్న విషయం తెలిసిందే. ఆదివారం జరుగనున్న టీడీపీ కీలక సమావేశంలో ఈ మేరకు వార్ డిక్లరేషన్ ఉంటుంది' అని టీజీ వెంకటేశ్ చెప్పారు.



బడ్జెట్‌లో పక్షపాతం.. ఏపీకి మొండిచెయ్యి

చలసాని శ్రీనివాస్, దోనేపూడి శంకర్

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌పై కక్షకట్టి తీవ్ర అన్యాయం చేస్తుందని, రాష్ట్రానికి ఇస్తామన్న ప్రత్యేక హోదాను తుంగలోతొక్కి ప్రత్యేక ప్యాకేజీలు ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు వాటి అమలుకు కూడా నిధులు కేటాయించక పోవడం దుర్మార్గమని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, కృష్ణా జిల్లా కన్వీనర్ దోనేపూడి శంకర్ డిమాండు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన కపట నాటకాలకు ఇప్పటికైనా తెరదించి రాష్ట్రానికి రావాలసిన నిధుల విషయంలో కేంద్రంపై ఒత్తిడి పెంచాలని, అందుకు పార్టీలకు అతీతంగా పార్లమెంట్ సభ్యులందరూ పార్లమెంట్‌ను స్తంభింప చేయాలన్నారు. అవసరమైతే ప్రధాని ఇంటిని ముట్టడి చేయాలని వారు డిమాండు చేశారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ప్రజానీకానికి కేంద్ర బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపారని, రాష్ట్రంపై సవతి తల్లి ప్రేమ కనబరిచారని విమర్శించారు. నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణానికి నిధుల ఊసే లేదన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు ప్రత్యేకప్యాకేజీ క్రింద రూ.24,350 కోట్లు ఇవ్వవలసి ఉండగా నయా పైసా రాల్చలేదనీ, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ నిర్మాణం ప్రస్తావన తీసుకురాలేదన్నారు. 2018 మార్చి నాటికి పూర్తి చేయాలన్న దుగ్గరాజపట్నం, రామాయపట్నం పోర్టుకు నిధులు కేటాయించలేదని చెప్పారు. జాతీయహోదా ఉన్న పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం ఊసే బడ్జెట్‌లో లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ విశాఖ రైల్వేజోన్ ప్రస్తావన లేదని పేర్కొంటూ, రైల్వే కేటాయింపుల్లో రానున్న మహారాష్ట్ర ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ముంబై రైల్వేస్‌కు రూ.11 వేల కోట్లు, మహారాష్ట్రలో ఇతర రైల్వే పనుల నిమిత్తం మరో రూ.17 వేల కోట్లు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం ఏపీ రైల్వేస్‌కు మాత్రం కేవలం రూ.3,500 కోట్లు మాత్రమే ఇవ్వనున్నట్లు సమాచారం ఉందన్నారు. విశాఖ నుండి రాజధాని అమరావతి మీదుగా చెన్నై వరకు నిర్మిస్తామన్న రైల్వే లైన్‌ను బడ్జెట్‌లో విస్మరించారన్నారు. రాష్ట్ర విభజన నాటికే ఆంధ్రప్రదేశ్ రూ.16 వేల కోట్ల మేర లోటు బడ్జెట్‌లో ఉందని, రాష్ట్రంలోని లోటును పూడ్చేందుకు కేంద్రం ఈ బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు జరుపకపోవడం సవతి తల్లి ప్రేమకు నిదర్శనమన్నారు. 2014 విభజన చట్టంలోని హామీల అమలుకు కేంద్రం ఏమాత్రం చిత్తశుద్ధి చూపడంలేదని, కేంద్ర బడ్జెట్‌లో హామీల అమలుపై ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆవేదన చెందినంత మాత్రాన కేంద్రం దిగిరాదని, తమ పార్టీ ఎంపీలతో రాజీలేని పోరాటం చేయించేందుకు సన్నద్ధం కావాలని డిమాండు చేశారు. విభజన హామీల అమలుకై గల్లీ నుండి ఢిల్లీ వరకు పోరుబాట సాగించేందుకు ఫిబ్రవరి 12వ తేదీన విజయవాడలో ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిపి, భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని చెప్పారు. పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రంలో జల్లికట్టు క్రీడపై అన్నిపక్షాలు ఏకమైన సందర్భాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలుగు రాష్ట్రాలకు జరిగిన అన్యాయంపై ఇరు రాష్ట్రాల ఎంపీలు రాజకీయాలకతీతంగా సమిష్టి పోరాటం చేసి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలని, ఈ పోరాటంలో అన్నివర్గాల మేధావులు, సినీనటులు కలసి రావాలని కోరారు. ఈ సమావేశంలో సాధన సమితి నాయకులు నిడుమోలు రాజేంద్రప్రసాద్, విద్యార్థి జేఏసీ నాయకులు రవికిరణ్, ఏఐవైఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ. మొయినుద్దీన్, బొక్కా ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర వ్యవహారంపై త్వరలో రాజకీయ నిర్ణయం



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం జరిగినమాట వాస్తవమే అయినప్పటికీ ఇంకా సంయమనం పాటిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సూచించారు. ఈలోపు ఎవరూ తొందరపడి ఏది పడితే అది మాట్లాడొద్దని మంత్రులను కోరారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులను ఏవిధంగా రాబట్టుకోవాలనే విషయమై ఆలోచన చేయాలని ఆయన మంత్రులు, అధికారులకు సూచించారు. ఇతర రాష్ట్రాల్లో మెట్రో సహా ఆయా ప్రాజెక్టులకు విరివిగా నిధులను కేటాయించిన కేంద్రం ఏపీ విషయంలో తీరని అన్యాయం చేసిందని పలువురు మంత్రులు సీఎం వద్ద ప్రస్తావించగా.. దీనిపై త్వరలోనే రాజకీయ నిర్ణయం తీసుకుందామని ఆయన స్పష్టం చేశారు. వెలగపూడిలోని సీఎం కార్యాలయంలో శుక్రవారం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో కేంద్ర బడ్జెట్‌పై సుదీర్ఘంగా చర్చించారు. శాఖలవారీగా జరిగిన బడ్జెట్ కేటాయింపులను ఆర్థికశాఖ కార్యదర్శి రవిచంద్ర వివరించారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించిన మంత్రిమండలి వాటిని ఆమోదించడమే కాకుండా పలు సంస్థలకు భూముల కేటాయిస్తూ తీర్మానించింది. ముఖ్యంగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలపై చర్చించిన మంత్రివర్గం, సంస్థ కారణంగా ఆవేదనకు గురై మృతి చెందిన 96 కుటుంబాలకు ఈనెల 12వ తేదీన ఒక్కొక్కరికి రూ. 5 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించింది. మంత్రివర్గం నిర్ణయాలను మంత్రులు కాల్వ శ్రీనివాసులు, కళా వెంకట్రావు, ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్ విలేకరులకు వివరించారు.

మంత్రివర్గం నిర్ణయాలు ఇవే..

ఏపీ కంటెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం. ఏపీఎస్ఎఫ్ఎల్‌కు సబ్సిడరీగా ఇది పని చేస్తుంది. విజ్ఞానశాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, పరి పాలన, విద్య, రాజ్యాంగం, ప్రసారం, సాంఘిక సంస్కరణలు, ఆర్థికశాస్త్రం, రాజకీయాలు మొదలైన వాటికి సంబంధించిన అనేక అంశాలలో నిరంతర పరిశోధన అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. కంటెంట్ కార్పొరేషన్ ఈ బాధ్యతలు నిర్వహించనున్నది. ఏపీ డ్రోన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయం. ప్రస్తుతం విస్తృతంగా పెరిగిన ప్రభుత్వావసరాలు, ప్రైవేట్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని డ్రోన్లకు ప్రత్యేకంగా కార్పొరేషన్ అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. పోలీస్, మైనింగ్, మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, అగ్రికల్చర్, జల వనరులు, అర్బన్ డెవలప్‌మెంట్, సర్వేలు, టూరిజం, ఎస్సెట్ మానిటరింగ్ తదితర సేవలకు వీటిని వినియోగించనున్నారు. టూడీ, త్రిడీ మోడల్స్‌లో హై రిజల్యూషన్ వీడియోలు తీసేందుకు, ఫోటోలు క్యాప్చరింగ్ చేసేందుకు డ్రోన్లను విస్తృతంగా ఉపయోగిస్తారు. గుంటూరు జనరల్ ఆసుపత్రిలో 597 పడకలతో మాతాశిశు ఆరోగ్య కేంద్రం 'మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్' (ఎంసీహెచ్‌సీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం. రూ.65 కోట్ల వ్యయంతో నెలకొల్పే 'ఎంసీహెచ్‌సీ'ని 'గుంటూరు మెడికల్ కాలేజ్ అలుమ్నీ ఆఫ్ నార్త్ అమెరికా' (జీఎంసీఏఎన్ఏ) ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేస్తారు. ఇందులో జీఎంసీఏఎన్ఏ రూ.30 కోట్లు అందిస్తుంది. దీనిని 2,34,420 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసుపత్రిని నిర్మిస్తారు. ప్రపంచబ్యాంక్ సహకారంతో రాష్ట్ర ఆరోగ్య రంగాన్ని పటిష్టపరచాలన్న ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదముద్ర. రాష్ట్రంలో వైద్య మౌలిక వసతులను కల్పించేందుకు ప్రపంచబ్యాంక్ నుంచి రుణం తీసుకునేందుకు మంత్రిమండలి అనుమతి ఇచ్చింది. రాష్ట్రంలో వైద్య మౌలిక వసతుల కల్పనకు రూ.4,807 కోట్లు అవసరం అని ప్రతిపాదించగా, ఇందులో ప్రపంచ బ్యాంక్ నుంచి 70 శాతం (రూ.3,365 కోట్లు) రుణంగా తీసుకోవాలని, మిగిలిన 30 శాతం (రూ.1,442 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుపెట్టాలని నిర్ణయించింది. ఈ నిధులతో రాష్ట్ర వైద్యరంగంలో మౌలిక వసతులను కల్పిస్తారు. ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రైమరీ హెల్త్ కేర్ సెంటర్లుగా అభివృద్ధి చేయడం, ఆసుపత్రులలో నాణ్యతా ప్రమాణాలు పెంపొందించడం, రోగి భద్రత తదితర అంశాలపై దృష్టి పెడతారు. పట్టణ ప్రాంతాలలో ప్రభుత్వం చేపడుతున్న 5 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఏపీ టీడ్కో నిధులు సమకూర్చేందుకు బ్యాంకులకు ప్రభుత్వం హామీగా ఉండేందుకు మంత్రిమండలి అంగీకారం తెలిపింది. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలలో రూ.38,265 కోట్ల వ్యయం అయ్యే 5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతోంది. ఈ హౌసింగ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.13,035 కోట్లు, కేంద్రం రూ.7,500 కోట్లు భరిస్తాయి. రాష్ట్రంలోని పార్లమెంట్ నియోజకవర్గాలలో చేపట్టాల్సిన అభివృద్ధి అవసరాలు, కార్యక్రమాలు, ప్రాజెక్టుల రూపకల్పనకు ఏర్పాటు చేసిన 'మెంబర్స్ ఆఫ్ పార్లమెంట్ అలయెన్స్ ఫర్ కలెక్టివ్ ట్రాన్స్‌ఫర్మేషన్' ట్రస్టుకు రూ.కోటీ 20 లక్షలు విడుదల చేయాలని మంత్రిమండలి నిర్ణయం. 'బాలామృతం' వంటి పౌష్టికాహారం తయారు చేసే కర్మాగారం కోసం టాటా ట్రస్టుతో ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీవీ) ఏర్పాటు చేయడానికి మంత్రిమండలి నిర్ణయం. మహిళలకు, చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని ఈ ట్రస్టు ఎటువంటి లాభాపేక్ష లేకుండా తయారు చేసి అందిస్తుంది. తిరుమల, తిరుపతి దేవస్థానం (టీటీడీ) పరిధిలోని అప్పలాయగుంట శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో 8 పోస్టుల ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం. హైకోర్టు ఆదేశానుసారం ఆలయంలో పనిచేస్తున్న 8మంది పోటులను రెగ్యులర్ చేయడానికి ఈ పోస్టులకు అనుమతి ఇచ్చింది. ఈ పోస్టుల వల్ల ఏటా రూ.22,53,672 ఖర్చు కానున్నది. ఆంధ్రప్రదేశ్ పోలీస్ (రిఫామ్స్), (అమెండ్‌మెంట్) ఆర్డినెన్స్, 2017 స్థానంలో బిల్లు ప్రవేశపెట్టడానికి మంత్రిమండలి ఆమోదించింది. రానున్న శాసనసభ సమావేశాలలో ఈ బిల్లును ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. పోలవరం ప్రాజెక్టు పనులకు సంబంధించి ప్రత్యేక ముందస్తు నిధులను (స్పెషల్ ఇంప్రెస్ట్ అమౌంట్) పెంచుతూ మంత్రిమండలి ఆమోదం. ఈ మొత్తాన్ని రూ.150 కోట్ల నుంచి రూ.160 కోట్లకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. గోరకల్లు బైపాస్ కెనాల్ పనులకు చేపట్టిన కాంట్రాక్టరుకు ఫుల్ అండ్ ఫైనల్ సెటిల్మెంట్ అమౌంటు కింద రూ.4,78,77,638లను చెల్లించడానికి మంత్రిమండలి ఆమోదం.

వివిధ సంస్థలు, కంపెనీలకు భూముల కేటాయింపులు:

శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం దేవునిపాలవలస గ్రామంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు 13.58 ఎకరాల ప్రభుత్వ భూమిని విశాఖ ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌కు ఉచితగా అప్పగించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోద ముద్రవేసింది. విశాఖ జిల్లాలోని అస్కపల్లి, పూడిమడక, విజయరాంపుర, అగ్రహారం, గుర్రం పాలెం గ్రామాలలో 90.72 ఎకరాల ఏడబ్ల్యూడీ పోరంబోకుగా వర్గీకరించిన భూమిని ఇండస్ట్రియల్ సెజ్ విస్తరణకు, ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ఉచితంగా కేటాయించే ప్రతిపాదనకు రాష్ట్రమంత్రిమండలి ఆమోదం తెలిపింది. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం మండలం పెద్దాపురం గ్రామంలో ఏడబ్ల్యూడీగా వర్గీకరించిన 3.43 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ యూనిట్ల ఏర్పాట్లకు గాను ఏపీఐఐసీకి అందచేస్తుంది. చిత్తూరు జిల్లా వలమనేరు మండలం నాగమంగళం గ్రామంలో 7.44 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇండస్ట్రియల్ పార్కు నెలకొల్పేందుకు ఉచితంగా కేటాయిస్తుంది.

చిత్తూరు జిల్లా మదనపల్లి మండలం, మొలకలదిన్నె గ్రామంలో 24.13 ఎకరాల భూమిని ఇండస్ట్రియల్ పార్కు నెలకొల్పేందుకు ఏపీఐఐసీకి అప్పగించే ప్రతిపాదనకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. చిత్తూరు జిల్లా బి.కొత్తకోట మండలం కోటవూరు గ్రామంలో 3.74 ఎకరాల ప్రభుత్వ భూమిని హార్సిలీ హిల్స్‌లో హై ఆల్టిట్యూడ్ క్రీడా శిక్షణా కేంద్రం ఏర్పాటు కోసం విజయవాడలోని స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ అండ్ ఎండీకి ఉచితంగా అప్పగించే ప్రతిపాదనకు రాష్ట్రమంత్రిమండలి ఆమోదముద్ర వేసింది. అనంతపురం జిల్లా కుదేరు మండలం కుదేరు గ్రామంలో ఏపీఐఐసీకి ఇప్పటికే అప్పగించిన 421.37 ఎకరాల భూమిలో 16.50 సెంట్ల భూమిని వెనక్కి తీసుకుని ఎన్.ఆర్.ఇ.డి. క్యాప్ (ఎన్ఆర్ఈడీసీఏపీ) వైస్ చైర్మన్, ఎండీకి ముందస్తుగా స్వాధీనం చేసే అధికారాన్ని జిల్లా కలెక్టర్‌కు దాఖలు పరిచే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించింది. కృష్ణాజిల్లా గన్నవరం మండలం కొండపావులూరు గ్రామంలో 25 ఎకరాల ప్రభుత్వ భూమిని సెంట్రల్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగా అండ్ నాచురోపతీ (సీఆర్ఐవైఎన్) స్థాపనకు విజయవాడలో ఉన్న ఆయుష్ ఎక్స్ అఫీషియో కార్యదర్శికి అప్పగించే ప్రతిపాదనను రాష్ట్ర మంత్రిమండలి ఆమోదించింది.

హైదరాబాద్ నరబలి

- మూడు నెలల చిన్నారి శిరచ్ఛేదనం
- తల గుర్తింపు.. లభించని మొండెం..
- గ్రహణం కావడంతో బలిచ్చినట్లు అనుమానాలు
- క్షుద్రపూజల కోణంలో దర్యాప్తు



హైదరాబాద్: రాష్ట్ర రాజధాని నగరమైన హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తుంటే.. ఇది నేరాలు, ఘోరాలకు అడ్డాగా మారిపోతోంది. మొన్న గర్భిణి మృతదేహం ముక్కలుగా గోనెసంచిలో లభ్యంకాగా నేడు మూడునెలల చిన్నారి తల ఓ ఇంటి డాబాపై కనిపించడం కలకలం రేపింది. నగరవాసులకు దడపుట్టిస్తుంది. అభంశుభం తెలియని మూడునెలల చిన్నారి శిరచ్ఛేదనం వెనుక వాస్తవాలేమిటో తెలియాల్సి ఉన్నప్పటికీ ఇది నరబలన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఆ పాప మొండెం ఆచూకీ లభించలేదు. ఈ ఘటన బుధవారం ఉప్పల్ సర్కిల్‌లోని చిలుకానగర్ డివిజన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆ రోజు పౌర్ణమి ...అదీకాక సంపూర్ణ చంద్రగ్రహణం కావడంతో పాప హత్యను నరబలిగా భావిస్తున్నారు. ఇది తెలుసుకున్న ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మైసమ్మ దేవాలయం సమీపంలో నివసించే రాజశేఖర్ (35) క్యాబ్ డ్రైవం ఇంటిపై గురువారం ఉదయం చిన్నారి తలను గుర్తించారు. మొండెం ఆచూకీ లేకపోవడం, ఘటనాస్థలిలో పరిస్థితులను బట్టి ఇది నరబలి అయి ఉంటుందని పోలీ సులు కూడా అనుమానిస్తున్నారు. మరోవైపు వివాహేతర సంబంధం నేపథ్యంలో హత్య జరిగిందా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. కాగా, రాజశేఖర్ కుటుంబమంతా మేడారం జాతరకు వెళ్లేందుకు సిద్ధమవుతుండగా ఆయన అత్త బాల లక్ష్మి బట్టలు ఆరేసేందుకు డాబాపైకి వెళ్లారు. అక్కడ ఎవరో చిన్నారి తల కనబడటంతో వచ్చి కుటుంబీకులకు చెప్పారు. డాబాపైకి వెళ్లి చూసిన రాజశేఖర్.. వెంటనే ఉప్పల్ పోలీసులకు సమాచారమిచ్చారు. చిన్నారి తల దొరికిందన్న వార్త దావానలంలా వ్యాపించడంతో స్థానికులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. దీంతో ఉద్రిక్తతలు తలెత్తకుండా రాచకొండ జాయింట్ కమిషనర్ తరుణ్ జోషి సహా పెద్ద సంఖ్యలో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఆ తల మూడు నెలల చిన్నారిదిగా పోలీసులు భావిస్తున్నారు. అయితే మొండెం లభించకపోవడంతో ఆడపిల్లా, మగపిల్లాడా అన్నది తెలియలేదు. ప్రాథమికంగా లభించిన ఆధారాలు, రక్తం మరకలను బట్టి బుధవారమే హత్య జరిగిదని.. ఆ రోజున చంద్రగ్రహణం కావడంతో క్షుద్రపూజలు, నరబలి జరిగివుంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. తలపై కుడిచెవి పూర్తిగా తెగిపోయి ఉందని, దవడపై కత్తి గాట్లు ఉన్నాయని గుర్తించారు. ఇవన్నీ నరబలి అనుమానాలకు బలాన్నిస్తున్నాయని చెబుతున్నారు. చిన్నారి మొండెం కోసం చుట్టుపక్కల ప్రాంతాలు, డ్రైనేజీలు, శ్మశాన వాటికల్లో గాలిస్తున్నారు.

అక్కడికక్కడే తిరిగిన జాగిలాలు : చిన్నారి మిస్సింగ్‌కు సంబంధించి ఉప్పల్ సహా చుట్టుపక్కల పోలీసు స్టేషన్లలో ఎలాంటి ఫిర్యాదు అందలేదు. దీంతో ఎవరైనా సంబంధీకులే ఘాతుకానికి ఒడిగట్టి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసు జాగిలాలు కూడా చిన్నారి తల లభించిన డాబా పైనుంచి ఆ ఇంటి ముందుకు, ఎదురుగా ఉన్న నరహరి అనే వ్యక్తి ఇంటి వద్దకు తిరిగి రోడ్డు మీదకు వచ్చి ఆగాయి. అయితే ఈ రెండు ఇళ్లలోని ఓ ఇంట్లోని దేవుడి గది వరకూ జాగిలాలు వెళ్లినట్లు తెలిసింది. దీంతో క్షుద్రపూజల కోణంపై పోలీసులు దృష్టి పెట్టారు. చుట్టుపక్కల వారినీ విచారిస్తున్నారు.

మహిళల భద్రతకు రూ.1267 కోట్లు

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిన నోట్లరద్దు, ఒఖీ తుపాను

మద్యంపై పన్ను పెంపు


బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన కేరళ ఆర్థిక మంత్రి

తిరువనంతపురం: ఎన్నికల సందర్భంగా మహిళలకు ఇచ్చిన హామీని నిలుపుకుంటూ కేరళలోని ఎల్డీఎఫ్ ప్రభు త్వం మహిళానుకూల బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. రాష్ట్రంలో మహిళా భద్రతా ప్రాజెక్టుల కోసం 1267 కోట్ల రూపా యలను కేటాయిస్తూ ఆర్థిక మంత్రి థామస్ ఇసాక్ బడ్జెట్ ను ప్రతిపాదించారు. ఒకే బిడ్డ ఉన్న మహిళలకు ప్రత్యేక పథకాన్ని కూడా ప్రకటించారు. 2018-19 ఆర్థిక సంవ త్సరానికి బడ్జెట్ ప్రతిపాదనలను ఆయన అసెంబ్లీకి సమ ర్పించారు. ఒఖీ తుపాను బాధితుల సహాయం కోసం రూ. 2000 కోట్లను కేటాయించారు. మద్యం మరింత ప్రియమైంది.

నోట్ల రద్దు, ఒఖీ తుపాను రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిందని మంత్రి తెలిపారు. మహిళా సంక్షే మం, భద్రతలో న్యాయవాదులు, న్యాయవ్యవస్థ, పోలీ సులు, సంబంధితులందరికి ప్రాతినిధ్యం వుంటుందని చెప్పారు. ఈ విధమైన చర్యలు మహిళలపై నేరాలను తగ్గించడానికి దోహదపడతాయని చెప్పారు. ప్రజారోగ్య సేవలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 1685 కోట్లను కేటాయిం చింది. రాష్ట్రమంతటా ఉబర్ తరహా అంబులెన్స్ సేవలను ప్రారంభించే ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎన్ఆర్ఐల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 80 కోట్లను కేటాయించింది, విదే శాలలో క్లిష్టపరిస్థితులలో లేదా ఇబ్బందికర పరిస్థి తులలో ఉన్న వారిని ఆదుకునేం దుకు రూ. 16 కోట్లను కేటాయిం చింది. ఒఖీ తుపాను సృష్టించిన విధ్వంసబాధితులను ఆదుకునేందుకు కోస్తా ప్రాంత అభివృద్ధి కోసం 2వేల కోట్ల రూపాయల ప్యాకేజిని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

విచారణాధికారి గాయబ్

- శ్రీనివాస్ హత్యకేసులో ఊహించని ట్విస్ట్
- రాజకీయ ఒత్తిళ్లే కారణమన్న అనుమానాలు



విశాలాంధ్ర బ్యూరో-నల్గొండ: నల్గొండ మున్సిపల్ చైర్మన్ బొడ్డుపల్లి లక్ష్మి భర్త శ్రీనివాస్ హత్య కేసులో మరో ఆశ్చర్య కరమైన మలుపు చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న నల్గొండ టూటౌన్ సీఐ వెంకటేశ్వర్లు శుక్రవారం ఉదయం నుంచి కనిపించకుండా పోయారు. తన వద్ద ఉన్న డిపార్ట్ మెంటల్ సిమ్‌కార్డును మాడ్గులపల్లి పోలీస్ స్టేషన్‌లో పోలీసు స్టేషన్‌లో అప్పగించి వెళ్లిపోయారు. అలాగే గన్‌ను కూడా కానిస్టేబుల్ ద్వారా సరెండర్ చేశా రు. అంతేకాకుండా తన వ్యక్తిగత ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేశా రు. ఈ తాజా పరిణామంతో రాష్ట్ర రాజకీయాల్లో కలవరం చోటుచేసుకుంది. తన భర్త హత్య కేసును సీబీఐకిగానీ, ప్రత్యేక దర్యాప్తు సంస్థకుగానీ అప్పగించా లంటూ బొడ్డు పల్లి లక్ష్మి ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించారు. రాజకీయ కుట్రతోనే ఈ హత్య జరిగిందని ఆరోపిస్తున్నారు. కాగా నల్లగొండ డీఎస్పీ సుధాకర్ మాత్రం ఈ హత్య చిల్లర పంచాయితీ కారణంగా జరిగిందే తప్ప రాజకీయ కుట్ర కోణం లేదని వెల్లడించారు. కేసుకు సంబంధించిన ప్రమాణ పత్రం దాఖలు చేయాలని, మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని నల్లగొండ ఎస్పీని హైకోర్టు ఆదేశించిన తరుణంలో విచారణాధికారి ఆకస్మికంగా మాయమైపోవడం పెద్ద దుమారమే రేపుతోంది. ఈ నేప థ్యంలో కేసును తారుమారు చేయడం కోసం సీఐ మీద ఉన్నతాధికారుల ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? లేక రాజ కీయ పరమైనవ ఒత్తిళ్లు ఉన్నాయా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. వాటిని తట్టుకోలేక సీఐ వెంకటేశ్వర్లు అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. తన సొంత ఫోన్‌ను సైతం స్విచ్ఛాఫ్ చేయడంతో ఆయన ఎక్కడ ఉన్నారో, ఎటు వెళ్లారో తేలడం లేదు. ఆయన స్వగ్రామం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి గ్రామం. కాగా, జనవరి 24న బొడ్డుపల్లి శ్రీనివాస్ హత్యకు గురైన విషయం తెలిసిందే.

మాటల గారడీ బడ్జెట్

(మొదటి పేజీ తరువాయి)

కర్షక, సామాన్య, మధ్యతరగతి వర్గ ప్రజల వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల బడ్జెట్ అని విమర్శించారు. ఇది సంపదను సృష్టిస్తోన్న కష్ట జీవులకు ఏ మాత్రం ఉపయోగకరంగా లేదన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. రాజారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ నాయకులు వేమయ్య యాదవ్, ఏఐటీ యూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి ఎ.మల్లికార్జున, నాయకులు పోతులయ్య, భాగ్యమ్మ, నగర కార్యదర్శి రాజేష్ గౌడ్, నాయకులు వి.క్రిష్టుడు, రమేష్, వేణు, లక్ష్మినారా యణతో పాటు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

మదనపల్లెలో నల్లజెండాలతో నిరసన : బడ్జెట్ కేటాయింపుల్లో ఏపిపై కేంద్ర ప్రభుత్వం చూపించిన వివక్షతను నిరసిస్తూ ప్రజాప్రతినిధులు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పుట్టా హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా మదనపల్లెలో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్లో బడ్జెట్ కేటాయింపుల్లో వివక్షతకు నిరసనగా నల్లజెండాలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న హరినాథరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా కార్పొరేట్ దిగ్గజాలకు అనుకూలంగా ఉందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరల కోసం బడ్జెట్‌లో కేటాయింపులో లేకపోవడంపై ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మదనపల్లె నియోజకవర్గ కార్యదర్శి టి.క్రిష్టప్ప, మంగిరి సాంబ, ఏఐటీయూసీ నాయకులు శ్రీరాములు, రాజ్‌కుమార్, గోపాల్, రెడ్డెప్ప, నాగేంద్ర, రవి, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్‌కుమార్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జాతిపితకు వినతిపత్రం: కేంద్రం బడ్జెట్ కేటాయింపులో మన రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా శుక్రవారం నిరసన తెలిపి మహాత్మా గాంధికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేద ప్రజలకు అన్యాయం జరిగిందని అన్నారు. బడ్జెట్ వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ఉందని అన్నారు. అనేక వస్తువులపై పన్ను భారం పెరిగిందని అన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించబడిన పోలవరంతో సహా సాగునీటి ప్రాజెక్టుకు నిధులు తగ్గించబడ్డాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ కృష్ణగౌడ్, నియోజకవర్గ కార్యదర్శి దేవండ్ల శ్రీనివాసులు, మండల కార్యదర్శి కె గురవయ్య, నాయకులు ఎన్ యోగయ్య, ఎం వెంకటేశ్వర్లు, శివయ్య తదితరులు పాల్గొన్నారు. కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో బడ్జెట్‌పై నిరసనగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి రావులపల్లి రవీంద్రనాథ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సీహెచ్ కోటేశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బుద్ధి రమేష్, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి పీతా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి కొండపల్లి అప్పారావు, గ్రామ శాఖ కార్యదర్శి కన్నా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కార్మికచట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చేందుకు పార్లమెంట్‌లో చట్టం చేసి కార్మికుల హ క్కులను కాలరాస్తే బీజేపీకి పతనం తప్పదని ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి మనోహర్‌మాణిక్యం, కర్నూలు జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప కేంద్రప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో ఏఐటీయూసీ నగర అధ్యక్షులు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ప్రభాకర్ పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు. గుంటూరు శంకర్‌విలాస్ నుంచి లాడ్జిసెంటర్ వరకు శుక్రవారం జరిగిన నిరసన ప్రదర్శనలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగూరి రాధాకృష్ణమూర్తి, సీపీఐ నగర నాయకులు జి.సురేష్, నూతలపాటి చిన్న తదితరులు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను నిరసిస్తూ శుక్రవారం సీపీఐ ఏలూరు ఏరియా సమితి ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సెంటరులో ధర్నా చేసి, కేంద్ర ప్రభుత్వం దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శివర్గసభ్యులు బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచెయ్యి చూపడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాకినాడ రెవెన్యూ కాలనీలోని సీపీఐ కార్యాలయం నుంచి నిరసన ప్రదర్శన నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, నగర కార్యదర్శి నక్కా కిషోర్ తదితరులు పాల్గొన్నారు. బడ్జెట్‌కు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో నెల్లూరులో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పార్థసారధి, నగర కార్యదర్శి మునీర్ తదితరులు ఈ ర్యాలీకి నాయకత్వం వహించారు. శ్రీకాకుళంలో నగరంలోని రామలక్ష్మణ కూడలి వద్ద సీపీఐ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీకి ప్రత్యేక హోదా ప్రకటించకపోవడం ప్రత్యేక నిధులను కేటాయించక పోవడంపై నిరసన తెలిపారు. విశాఖకు రైల్వేజోన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నప్పటికీ ప్రకటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిక్కాల గోవిందరావు, పి.ప్రభావతి, ఎం.యుగంధర్, కంది శ్రీనివాసరావు, కీర్తి సూర్యనారాయణ, గుజ్జ జనార్ధనరావు, ఇల్లా కృష్ణంరాజు, సామ కృష్ణారావు, లబ్బ జగ్గారావు, నిమ్మాడ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు. విజయనగరం జిల్లా ఎస్.కోట దేవి బొమ్మకూడలి వద్ద కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిసూ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.కామేశ్వరరావు మాట్లాడుతూ వెనుకబడ్డ విజయనగరం జిల్లాను కేంద్రం విస్మరించిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోపాడ మధు, మద్దికృష్ణ, మండల కార్యదర్శి ఎస్.కె స్వామి అప్పారావు, అప్పలరాజు, మొదగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోచ్‌లు కావాలి

- పదేళ్లుగా ఇదే చెబుతున్నా..
- సింధు ఫామ్‌పై ఆందోళన లేదు
- కోచ్ పుల్లెల గోపీచంద్

న్యూఢిల్లీ: కామన్వెల్త్, ఆసియా క్రీడల్లో పతకాలు సాధించడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని.. భారత్‌కు కోచ్‌ల అవసరం ఎంతో ఉందని బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ అన్నాడు. "మనం ఎక్కువ మంది క్రీడాకారులు వెలుగులోకి రావాలంటే ఏం చేయాలో దాని గురించి మాట్లాడుతున్నాం. సింధు, సైనా, శ్రీకాంత్, ప్రణీత్ లాంటి వాళ్లు ఆట మొదలుపెట్టినప్పుడు వారితోనే ఎక్కువ సమయం గడిపా. మేం ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో ఆడామని కాదు. మా ఆలోచన కూడా గొప్ప స్థాయిలో ఉంది. మాకు కోచ్‌లు లేరని పదేళ్లుగా చెబుతూనే ఉన్నా. రెండు ప్రధాన టోర్నీలు రాబోతున్నాయి. కామన్వెల్త్ క్రీడలేమో గోల్డ్‌కోస్ట్‌లో, జకార్తాలో ఆసియా క్రీడలు జరగ నున్నాయి. అలాగే ప్రపంచ చాంపియన్‌షిప్, ఆల్ ఇంగ్లాండ్ టోర్నీలూ ఉన్నాయి. ఈ పెద్ద టోర్నీలకు ఆటగాళ్లు సమర్థంగా సన్నద్ధమై మంచి ఫలితాలు రాబట్టడమే ముఖ్యమైన విషయం" అని గోపీచంద్ తెలిపాడు. సింధు పరాజయాల గురించి మాట్లాడుతూ.. "ఆటలో ప్రగతి కనిపిస్తున్నపుడు పరాజయాల గురించి పెద్దగా పట్టించుకోను. మనం ప్రపంచ టాప్ ర్యాంకర్ల గురించి మాట్లాకుంటున్నాం. ప్రపంచ నం.1 తైజు బాగా ఆడుతోంది. కానీ సింధు ఆమెను ఒలింపిక్స్‌లో ఓడించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఫైనల్ కూడా చేరింది. సమయం వచ్చినప్పుడు అన్నీ అలా జరిగిపోతుంటాయి. రెండో స్థానంలో నిలవడం సరిపోదు అని కొంతమంది అంటుంటారు. కానీ ఆ విషయంలో నేనెప్పుడూ సానుకూల దృక్పథంతోనే ఉన్నా. ఆమె సాధిస్తున్న విజయాలపై ఆనందంగా ఉన్నా. కనీసం ఒక్క శాతం కూడా ఆమె విఫలమైందని నేను అనుకోవట్లేదు" అని గోపీచంద్ చెప్పాడు. బ్యాడ్మింటన్‌లో నిలకడగా రాణిస్తూ విజయాలు సాధించే ఆటగాళ్లు కావాలంటే మెరుగైన కోచ్‌లు, పటిష్టమైన శిక్షణా విధానం ఉండాలని గోపి అన్నాడు. "భారత బ్యాడ్మింటన్‌ను చూసినట్లయితే విజయాలు సాధిస్తున్న ఆటగాళ్ల సంఖ్య బాగుంది. కానీ శ్రీకాంత్ లాంటి వారిని తయారుచేయాలంటే మెరుగైన కోచ్‌లు, శిక్షణావిధానం కావాలి" అని అన్నాడు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో నిలకడ లోపించిందని, అందువల్లే విజయాలు అందట్లేదని గోపి అభిప్రాయపడ్డాడు. "డబుల్స్‌లో జపాన్ ఓపెన్ సెమీస్ చేరడం లాంటి కొన్ని మెరుపులు మీరు చూసి ఉండొచ్చు. కానీ వాళ్లు స్థిరంగా రాణించడం లేదు. తొందర్లోనే ఆ లోపాన్ని అధిగమిస్తాం. డబుల్స్‌ను కెరీర్‌గా ఎంచుకునే ఆటగాళ్లు కావాలి. వాళ్లను ప్రోత్సహించే తల్లిదండ్రులు, వాళ్లకు స్పాన్సర్‌షిప్‌లు, మీడియా మద్దతు కావాలి. ఇప్పుడు డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ లాంటి వాళ్లు ఉన్నారు. కానీ వాళ్ల వయసు ఇంకా 18 ఏళ్లే. వాళ్లు సత్తా చూపేందుకు మరింత సమయం పడుతుంది" అని అన్నాడు.



•యూ-19

'ఫైనల్ ఫీవర్' నేడు

- పోటాపోటీగా రెండు జట్లు
- నాలుగోసారి గెలిచేందుకు రెడీ
- రికార్డు కోసం పృథ్వీషా తహతహ

మౌంట్ మాంగనుయ్ (న్యూజిలాండ్): నాలుగోసారి అండర్-19 వరల్డ్ కప్ గెలిచి రికార్డు సృష్టించాలని ఉవ్విళ్లూరుతున్న భారత్‌కు ఫైనల్లో ఆస్ట్రేలియా రూపంలో దీటైన సవాలు ఎదురుకానుంది. రాహుల్ ద్రవిడ్ సాంకేతిక శిక్షణలో రాటు తేలిన యువ భారత్ నేడు జరగనున్న ఫైనల్లో రికార్డు సృషించేందుకు సమాయత్తమవుతుంది. అండర్-19 టోర్నమెంట్ చరిత్రలో చెరో మూడుసార్లు కప్ గెలిచిన జట్లుగా భారత్, ఆస్ట్రేలియాలు నాలుగో సారి కప్‌ను గెల్చేందుకు శనివారం ఫైనల్లో తలపడనున్నాయి. 2002లో మొహ్మద్ కైఫ్, 2008లో విరాట్ కోహ్లి, 2012లో అన్ముక్త్ చంద్ సారధ్యంలో అండర్-19 కప్‌ను భారత్‌కు అందించారు. వారి సరసన నిల్చేందుకు యూ-19 కెప్టెన్ పృథ్వీషా తహతహలాడుతున్నాడు. ఈ టోర్నమెంట్‌లో భారత్ అద్భుతమైన ఆట తీరుతో ఆకట్టుకుంది. ఆడిన ఐదు మ్యాచ్‌లూ గెలిచింది. సెమీ ఫైనల్లో భారత్ చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌కు 272 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. పకడ్బందిగా ఆడి పాక్‌ను కేవలం 69 పరుగులకే ఆలౌట్ చేసి, 203పరుగుల తేడాతో గెలిచి తన ఆధిపత్యాన్ని చాటింది. ఆస్ట్రేలియాపై 100 పరుగుల తేడాతో విజయాన్ని ఆత్మవిశ్వాసంతో తన ఖాతాలో రాసుకుంది. రాహుల్ ద్రవిడ్ దిశ నిర్దేశంలో భారత్ టీం అన్ని రంగాల్లో ప్రతిభ కనబరుస్తోంది. పటిష్టమైన బ్యాంటింగ్ యూ-19 స్వంతం. ఓపెనర్లు షా, మనోజ్ కర్లా ప్రతి మ్యాచ్‌లో మంచి శుభారంభాన్ని ఇచ్చారు. మూడో



స్థానంలో శుభ్‌మన్ గిల్ రాణించాడు. స్థిరమైన బ్యాంటింగ్‌తో అందరి కళ్లు గిల్‌పైనే ఉన్నాయి. సెమీస్‌లో పాకిస్థాన్‌పై శతకాన్ని మోది నాటౌట్‌గా నిలిచాడు. శనివారం ఫైనల్లో ఆస్ట్రేలియాపై మరో అద్భుతాన్ని సృష్టిస్తాడని అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఇక భారత్ బౌలింగ్‌ను విశ్లేషిస్తే, శివం మావీ, కంలేష్ నాగర్ కోటిలు గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బంతులు విసిరి ప్రత్యర్థుల గుండెల్లో దడపుట్టిస్తున్నారు. అయితే ఫైనల్లో వారు పటిష్టమైన బ్యాటింగ్ ఉన్న ఆస్ట్రేలియాకు బౌలింగ్ చేయాలంటే అంత సులవైన విషయం కాదు. స్పిన్నర్లు అభిషేక్ శర్మ, అనుకుల్ రాయ్‌లు బాధ్యతతో బౌలింగ్ చేయాల్సి ఉంటుంది. అభిషేక్ అటు బౌలింగ్‌లో ఇటు బ్యాటింగ్‌లోను చక్కటి ప్రతిభ కనబరుస్తున్నాడు. టోర్నమెంట్‌లో భారత్ ఫీల్డింగ్ పరంగా అద్భుతంగా ఉంది. అటు....టోర్నమెంట్ మొదటి మ్యాచ్‌లో తనను ఓడించిన భారత్‌పై ప్రతీకారం తీర్చుకునేందుకు ఆస్ట్రేలియా ఎదురు చూస్తుంది.

శుభమన్ గిల్ × లాయిడ్ పోప్

ఫైనల్ పోరులో ఇద్దరు ఆటగాళ్లపై అందరి దృష్టి ఉంది. టీమిండియా తరపున అత్యద్భుత ఇన్నింగ్స్‌లు ఆడిన శుభ్‌మన్ గిల్ అందులో ఒకడు. అండర్-19 ప్రపంచకప్‌లో 170 సగటుతో విజృంభించాడు అతడు. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 113.28 స్ట్రైక్‌రేట్‌తో 341 పరుగులు చేశాడు. టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక పాక్‌పై ఒకవైపు వికెట్లు పడుతున్నా 94 బంతుల్లోనే 102 పరుగులతో అజేయంగా నిలిచి తనకు తానే సాటి అని నిరూపించుకున్నాడు. మిగతా మ్యాచుల్లో 63, 90లి, 86తో నిలిచాడు. ఆస్ట్రేలియా జట్టులో లెగ్‌స్పిన్నర్ లాయిడ్ పోప్ ఆట ఆసక్తికరం. ఇంగ్లాండ్‌తో క్వార్టర్‌లో ఆసీస్ 127 పరుగులకే పరిమితమైంది. అయితే బౌలింగ్‌లో పోప్ 35 పరుగులిచ్చి 8 వికెట్లు తీసి ఇంగ్లాండ్‌ను 96కు కుప్పకూల్చాడు. టోర్నీలో ఇప్పటి వరకు 11 వికెట్లు తీశాడు. తుదిపోరులో ఇతడి ఆట కీలకం కానుంది.



ఫోన్‌లు ఆఫ్ చేయండి : ద్రవిడ్

న్యూఢిల్లీ : అండర్-19 భారత యువ క్రికెటర్లకు కోచ్ రాహుల్ ద్రవిడ్ తమ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశాడట. ఇదంతా వారి కోసమే. ఎందుకంటే శనివారం ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఫైనల్లో భారత్-ఆస్ట్రేలియా తలపడనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఆటగాళ్ల ఏకాగ్రత దెబ్బతినకుండా ఉండేందుకు అండర్-19 భారత జట్టు కోచ్ రాహుల్ ద్రవిడ్ ఫైనల్ ముగిసే వరకూ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయాల్సిందిగా ఆటగాళ్లకు ఆదేశాలు జారీ చేశాడట. ద్రవిడ్ ఇలా చేయడం ఇదే తొలి సారి కాదు. మొన్నటికి మొన్న ఐపీఎల్ వేలం సమయంలోనూ వారికి క్లాస్ పీకిన సంగతి తెలి సిందే. 'ఐపీఎల్ కోసం వేలం ఏటా నిర్వహిస్తారు. అండర్-19 ప్రపంచకప్‌లో ఆడే అవకాశం మాత్రం రెండేళ్లకు ఒకసారి మాత్రమే వస్తుంది. ఆటపై దృష్టి పెట్టండి' అని ద్రవిడ్ ఆటగాళ్లను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్లు ఫోన్లు వాడుతూ ఉంటే వారి ఏకాగ్రత దెబ్బతింటుందని, ఒత్తడికి గురవుతారని భావించే ద్రవిడ్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని పలు వురు హర్షం వ్యక్తం చేశారు. 'పాక్‌తో సెమీఫైనల్ అనంతరం మా కుమారుడు శివమ్ మావితో మాట్లాడదామని ప్రయత్నించాను. కానీ, ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. గత ఆదివారం చివరిసారిగా శివమ్‌తో మాట్లాడాను. ప్రధాన మ్యాచ్‌లకు ముందు ఫోన్లు వాడొద్దని ద్రవిడ్ ఆదేశాలు జారీ చేసినట్లు అప్పుడే శివమ్ మాతో చెప్పాడు' అని శివమ్ తండ్రి పంకజ్ మావి తెలిపారు. భారత్-ఆస్ట్రేలియా మధ్య శనివారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో భారత్.. ఆసీస్‌పై విజయం సాధించిన సంగతి తెలిసిందే. భారత కాలమానం ప్రకారం శనివారం ఉదయం 6.30గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారం కానుంది.

సెమీస్‌లోకి దూసుకెళ్లిన సింధు



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్, భారత టాప్ స్టార్ పీవీ సింధు సెమీఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ క్రీడాకారిణి బియాట్రిజ్ కొరల్స్‌పై 21-12, 19-21, 21-11 తేడాతో సింధు విజయం సాధించింది. ఈ విజయంతో సింధు ఇండియా ఓపెన్ సెమీస్‌లోకి మూడోసారి ప్రవేశించిన క్రీడాకారిణిగా గుర్తింపు పొందింది. తొలిసెట్‌ను అలవోకగా గెల్చిన సింధుకు రెండో సెట్‌లో ప్రత్యర్థి అనూహ్యంగా గట్టిపోటీనిచ్చింది. చివరకు రెండో సెట్‌లో బియాట్రిజ్ కొరల్స్ పై చేయి సాధించడంతో నిర్ణయాత్మక మూడో సెట్ ఆడాల్సి వచ్చింది. తిరిగి పుంజుకున్న సింధు ఈ సెట్‌లో ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా విజయ కేతనం ఎగురవేసింది.

విరుద్ధ ప్రయోజనాల్లో ఎడుల్జీ..!



న్యూఢిల్లీ: బోర్డు పాలక మండలి (సీవోఏ) సభ్యురాలు దయానా ఎడుల్జీ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతున్నారని బీసీసీఐ కోశాధికారి అనిరుధ్ చౌదరి ఆరోపించారు. అంతర్జాతీయ మహిళా క్రికెటర్లకు బోర్డు ఇచ్చిన ఏకకాల చెల్లింపుల ద్వారా డయానా లబ్ది పొందడాన్ని ఆయన ప్రశ్నించారు. ఈ పథకం కింద డయానా, 1970వ దశకంలో ఒకేఒక్క టెస్టు ఆడిన ఆమె సోదరి బెహ్రెూజ్ కూడా బోర్డు నుంచి నగదు అందుకుంది. అంతర్జాతీయ క్రికెటర్లకు ఏకకాల చెల్లింపుల కింద ప్రోత్సాహకాలు అందించాలన్న పాలసీని సీవోఏనే ఆమోదించింది. ఈ విషయంపై బోర్డు వర్గాల్లో అంతర్గతంగా వ్యతిరేకత వ్యక్తమైనా.. చౌదరి లేఖతో అది బయటపడింది. సీవోఏకు వ్యతిరేకుడనే ముద్ర పడ్డ అనిరుధ్.. ఎడుల్జీ ప్రయోజనాలను ప్రశ్నిస్తూ రాసిన లేఖ బయపడడం చర్చనీయాంశంగా మారింది.

కోహ్లి జట్టుకు దూకుడు నేర్పాడు..!



ముంబై: కెప్టెన్ విరాట్ కోహ్లి భారత జట్టుకు దూకుడు నేర్పాడని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైక్ బ్రెయర్లీ అన్నాడు. కోహ్లి జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపాడని మైక్ కొనియాడాడు. "నేను విరాట్‌కు దరిదాపుల్లో లేను. కానీ అతని ఆటను ఆరాధిస్తున్నా. అతను జట్టులో ఆత్మవిశ్వాసాన్ని నింపడంతో పాటు దూకుడును నేర్పాడు. ఎప్పుడూ అప్రమత్తంగా ఉంటాడు. కోహ్లి తెలివైన బ్యాట్స్‌మన్. ప్రపంచంలో ఎక్కడైనా అతను పరుగులు చేయగలడు. ఎలాంటి పరిస్థితుల్లో అయినా బౌలర్లను సమర్థంగా ఎదుర్కొనే సత్తా అతనికుంది. కోహ్లి జట్టుకు దూకుడు నేర్పాడు" అని మైక్ అన్నాడు. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్‌లో జట్టులో మార్పులు చేసి విమర్శల పాలైన కోహ్లిని మైక్ వెనకేసుకొచ్చాడు.

అన్నిదేశాలపై 'సెంచరీ'..రికార్డు



న్యూఢిల్లీ: దక్షిణాఫ్రికా గడ్డపై గురువారం అద్భుత ఇన్నింగ్స్ ఆడిన టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఖాతాలో మరో అరుదైన రికార్డు చేరింది. దక్షిణాఫ్రికాపై వడివడిగా సెంచరీ బాదిన కోహ్లి.. తాను ఆడిన అన్ని దేశాల్లోనూ శతకం సాధించిన ఆటగాడిగా గుర్తింపు పొందాడు. ఛేజింగ్‌లో భాగంగా కోహ్లి సెంచరీ సాధించడం ఇది 20వ సారికాగా.. తన సెంచరీతో మ్యాచ్‌లు గెలిపించడం 18వసారి. కోహ్లి కెరీర్‌లో మొత్తంగా ఇది 33వ సెంచరీ కావడం విశేషం. ఇప్పటివరకు 9 దేశాల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన ఈ సంచలన క్రికెటర్.. పాకిస్తాన్ గడ్డపై ఇంకా ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. కాగా మొత్తం పది పూర్తిస్థాయి సభ్యదేశాల్లో తొమ్మిది దేశాలపై సెంచరీలు సాధించిన ఆటగాళ్లలో సచిన్ టెండూల్కర్, సనత్ జయసూర్యలు మాత్రమే ఉన్నారు. అయితే వన్డే కెరీర్‌లో సచిన్ దక్షిణాఫ్రికాలోనూ, జయసూర్య జింబాబ్వేలోనూ సెంచరీ ముచ్చట తీర్చుకోలేకపోయారు.

ధోనీ వల్లే అలా..!



దర్బన్: భారత క్రికెట్ జట్టు సారథిగా విరాట్ కోహ్లి ఉన్నప్పటికీ తెర వెనుక ఉండి అంతా తానై జట్టును ముందుకు నడిపించేది మాత్రం మహేంద్ర సింగ్ ధోనీ అని అందరికీ తెలిసిందే. తాజాగా ఇది మరోసారి రుజువైంది. దర్బన్‌లో ఆతిథ్య దక్షిణాఫ్రికాతో జరిగిన వన్డేలో చైనామెన్ బౌలర్ కుల్‌దీప్ యాదవ్ ఎంతో పొదుపుగా బౌలింగ్ వేశాడు. 10 ఓవర్లలో మూడు కీలక వికెట్లు తీసి సఫారీ జట్టు నడ్డి విరిచాడు. మ్యాచ్ అనంతరం కుల్‌దీప్ మాట్లాడుతూ. 'మొదటిసారి దక్షిణాఫ్రికా గడ్డపై ఆడేందుకు వచ్చిన నేను చాలా ఆందోళనకు గురయ్యా. ఇక్కడ బౌలింగ్ ఎలా చేయాలన్న దానిపై నాకు ఏమాత్రం అవగాహన లేదు. అలాంటి సమయంలో నేను మహేంద్ర సింగ్ ధోనీని ఆశ్రయించి నా పరిస్థితి వివరించాను. ఎలా బౌలింగ్ చేయాలో చెప్పమని అడిగా. 'నువ్వు ఎలా బౌలింగ్ చేస్తావో అలాగే చెయ్యి' అని సున్నితంగా చెప్పాడు. దీంతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. మ్యాచ్‌లో వికెట్ల వెనుక నుంచి ధోనీ ఎప్పటికప్పుడు సలహాలు ఇస్తూనే ఉన్నాడు. అవి నాకు ఎంతో ఉపయోగపడ్డాయి' అని కుల్‌దీప్ తెలిపాడు. 'ప్రస్తుతం మా జట్టులో ఇద్దరు దిగ్గజాలు ఉన్నారు. వారే కోహ్లి, ధోనీ. ఒకరు ప్రస్తుతం జట్టును నడిపిస్తున్నారు. మరొకరు ఇప్పటికే జట్టును విజయవంతంగా నడిపించిన వారు. ధోనీ ఇప్పటికే చాలా క్రికెట్ ఆడాడు. బ్యాట్స్‌మెన్ మైండ్‌ను చదివేయగలడు. అందుకే ధోనీ ఎప్పటికప్పుడు మాకు పరిస్థితిని వివరించి సలహాలు ఇస్తూ ఉంటాడు. దీంతో మాకు బౌలింగ్ వేయడం సులువు అవుతోంది. జట్టులో చాలా మంది యువకులమే ఉన్నాం. మాకు ఇప్పుడే ధోనీకి ఉన్న అనుభవం రాదు' అని కుల్‌దీప్ ప్రశంసల వర్షం కురిపించాడు.

బంగ్లాదేశ్ అరుదైన రికార్డు



చిట్టగాంగ్: టెస్టు క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ అరుదైన రికార్డు సృష్టించింది. శ్రీలంకతో ఇక్కడ జరుగుతున్న తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 513 పరుగులు చేసిన బంగ్లాదేశ్ టెస్టు క్రికెట్ చరిత్రలోనే అత్యంత అరుదైన ఘనత అందుకుంది. ఈ మొత్తం స్కోరులో ఒక్కటంటే.. ఒక్క బై కానీ, లెగ్ బై కానీ లేకపోవడం గమనార్హం. అంతేకాదు.. టెస్టు క్రికెట్‌లో బంగ్లాదేశ్‌కు ఇది ఐదో అత్యధిక స్కోరు కూడా. 2014లో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్ల నష్టానికి 494 పరుగులు చేసింది. ఈ స్కోరులో కూడా ఒక్క పరుగు కూడా బై, లైగ్ బై రూపంలో రాలేదు. మూడేళ్లపాటు భద్రంగా ఉన్న ఈ రికార్డును ఇప్పుడు బంగ్లాదేశ్ బద్దలు కొట్టి సరికొత్త రికార్డు సృష్టించింది. తొలి టెస్టు మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక మూడు వికెట్ల నష్టానికి 504 పరుగులు చేసింది. కుశాల్ మెండిస్ (196) తృటిలో డబుల్ సెంచరీ చేజార్చుకోగా ధనంజయ డిసిల్వా 173 పరుగులు చేశాడు. రోషన్ సిల్వా 87, కెప్టెన్ దినేష్ చండీమల్ 37 పరుగులతో క్రీజులో ఉన్నారు.

బ్యాటింగే కొంపముంచింది : డుప్లెసిస్



దర్బన్: దక్షిణాఫ్రికా కెప్టెన్ ఫా డుప్లెసిస్‌కు వారం రోజులుగా కంటిమీద కునుకు కరువైంది. టెస్టుల్లో భారత్‌ను వైట్‌వాష్ చేద్దామనుకున్నాడు. చివరి టెస్టులో భారత్ విజృంభించడంతో అది కుదరలేదు. టెస్టుల్లోని జోరును వన్డేల్లోనూ కొనసాగించాలని భావించిన డుప్లెసిస్ సేనకు తొలి వన్డేలో పరాభవం ఎదురైంది. తాజా ఓటమిపై సౌతాఫ్రికా కెప్టెన్ మాట్లాడుతూ.. తొలి వన్డేలో తామంత బాగా బ్యాటింగ్ చేయలేదన్నాడు. ఓటమికి బౌలర్లను నిందించాల్సిన అవసరం లేదని పేర్కొన్నాడు. 260 పరుగులు చెప్పుకోదగ్గ స్కోరు కాదని, కనీసం 300 పరుగులు చేసి ఉండాల్సిందని పేర్కొన్నాడు. గతంలో ఇక్కడ ఆడిన రెండు మ్యాచుల్లోనూ చాలా పరుగులు చేసినట్టు చెప్పాడు. ఇదే పిచ్‌పై ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో 370 పరుగులను ఛేదించామని గుర్తు చేశాడు. కాబట్టి ఇక్కడ బౌలర్ల వైఫల్యం ఎంతమాత్రమూ లేదన్నాడు. తాము తక్కువ పరుగులు చేశామని ఓటమికి అదే కారణమని తేల్చిచెప్పాడు. వికెట్లు తీసేందుకు బౌలర్లు బాగానే కష్టపడ్డారని కితాబిచ్చాడు. మరో 60-70 పరుగులు చేసి ఉంటే బౌలర్ల పని సులభమయ్యేదని వివరించాడు.

ముంబైకి పోలార్డ్ కృతజ్ఞతలు



ముంబై: విండీస్ బిగ్ హిట్టింగ్ ఆల్ రౌండర్ కీరన్ పొలార్డ్ ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీకి థ్యాంక్స్ చెప్పాడు. 2010 నుంచి ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న పొలార్డ్‌ను ఈసారి కూడా ముంబై ఇండియన్స్ అట్టే పెట్టుకుంది. గతవారం బెంగళూరులో జరిగిన ఐపీఎల్ వేలంలో 'రైట్ టు మ్యాచ్' (ఆర్‌టీఎం) కార్డు ద్వారా పొలార్డ్‌ను రిటైన్ చేసుకుంది. విషయం తెలిసిన పొలార్డ్ ముంబై ఇండియన్ ఫ్రాంచైజీకి కృతజ్ఞతలు తెలిపాడు. తనపై విశ్వాసం ఉంచినందుకు ఆనందంగా ఉందంటూ ఓ ఇంటర్వ్యూలో భావోద్వేగంగా పేర్కొన్నాడు. "నాపై విశ్వాసం ఉంచినందుకు ముంబై ఇండియన్స్‌కు కృతజ్ఞతలు చెప్పాలని భావిస్తున్నా. ముంబై ఇండియన్స్‌తో కలిసి వెళ్తున్నందుకు సంతోషంగా ఉంది" అని పొలార్డ్ పేర్కొన్నాడు. కష్ట సుఖాల్లో ప్రజలు తమతో ఉన్నప్పుడు చివర్లో వారికి రివార్డు ఇవ్వాల్సి ఉంటుందని పొలార్డ్ పేర్కొన్నాడు.



ఢిల్లీలోని ఏపీ భవన్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సీపీఐ నేత నారాయణ, కొణతాల రామకృష్ణ

ఏపీకి అన్యాయంపై ఢిల్లీలో నిరసనల సెగ

న్యూఢిల్లీ: విభజన హామీలు అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, బడ్జెట్‌లో కనీస నిధులు కూడా కేటాయించలేదంటూ గురువారం రాత్రి ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఏపీ భవన్‌లో ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్‌లో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను నిధులు కేటాయించక పోవడం అన్యాయమని మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ తెలిపారు. ఇటీవల కొణతాల ఉత్తరాంధ్ర సమస్యలు, ఏపీకి ప్రత్యేక రైల్వే జోన్ అంశాలపై ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో గాంధీ సమాధి వద్ద నిరసన దీక్ష చేపట్టారు. జాతీయ స్థాయి ప్రతిపక్ష నేతలను సైతం కలిసి ఏపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. తాజా బడ్జెట్‌లో రైల్వే జోన్‌పై ఏదైనా ప్రకటన వస్తుందని ఆశించిన ఏపీ రాష్ట్ర ప్రజలను కేంద్రం మరోసారి మోసం చేసిందని ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆరోపించింది. రైల్వే జోన్ సాధించే వరకు తమ పోరాటం ఆగదని పేర్కొంది. ఆందోళన కార్యక్రమంలో సీపీఐ నేత నారాయణ తదితర నేతలు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.